# ఖమ్మం - భద్రాద్రి కొత్తగూడెం



# వార్త

మంగళవారం 06, అక్టోబర్ 2026 16 పేజీలు




16వ పేజీలో...

## పిల్లల చదువుపై కలెక్టర్ అంకిత్ నజర్ !!

**పరీక్షల నుంచి మధ్యాహ్న భోజనం వరకు**
**కొమ్ముగూడెం బడిలో ఆకస్మిక తనిఖీ**

జూలూరుపాడు, ప్రభాతవార్త
పాఠశాలలో పిల్లల చదువు, హాజరు, పరీక్షల నిర్వహణతో పాటు వారి ఆరోగ్యం, పోషకాహారంపైనా జిల్లా కలెక్టర్



# అభివృద్ధి సంక్షేమమే.. ప్రభుత్వ ధ్యేయం

**రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు**

**అర్హులైన ప్రతి నిరుపేదకూ ప్రభుత్వ సంక్షేమ ఫలాలు అందాలి**
**విద్యా, వైద్య రంగాలకు ప్రత్యేక ప్రాధాన్యత**
**నగరంలోని 48వ డివిజన్ లో 1.80 కోట్ల రూపాయల వ్యయంతో బీటీ రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేసిన మంత్రి**

ఖమ్మం టౌన్,ప్రభాతవార్త అక్టోబర్ 5
రాష్ట్రంలో రేవంత్‌రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం పేదల సంక్షేమం, సమగ్ర అభివృద్ధే ధ్యేయంగా పనిచేస్తోందని రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార, చేనేత, జౌళి శాఖామాత్యులు తుమ్మల నాగేశ్వరరావు అన్నారు.!! సోమవారం నగరపాలక సంస్థ పరిధిలోని ఎఫ్ సిఐ బైపాస్ రోడ్డు దానవాయిగూడెం ఫిల్టర్ బెడ్ నుండి ఎంబి గార్డెన్స్ వరకు రూ. 180.00 లక్షల



16వ పేజీలో...

# ఖమ్మంలో బంగారం ట్రేడింగ్ పేరుతో.. ఘరానా మోసం!

**తెలుగు రాష్ట్రాల్లో అనేక మందిని నమ్మించి మోసం చేసిన కేటుగాళ్లు.**
**సూత్రధారుల్లో పోలీస్ శాఖలోని ఓ కీలక వ్యక్తి.**
**ఖమ్మం వన్ టౌన్ పీఎస్ లో ఇప్పటికే కేసు నమోదు.**
**కీలక నిందితులు పరారీ.**
**జిల్లా ఉన్నతాధికారులు దృష్టి సారిస్తారా..?**

ఖమ్మం క్రైమ్, ప్రభాతవార్త
బంగారం, ఫారెక్స్ ట్రేడింగ్ పేరుతో కోట్ల రూపాయల మోసం ఆరోపణలు ఇప్పుడు జిల్లాలో సంచలనంగా మారాయి. ఖమ్మం కు చెందిన నలుగురిపై తీవిలీ సెక్షన్ల కింద పోలీసులు కేసు నమోదు చేశారు. ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన ఈ ఘటన ప్రస్తుతం జిల్లాలో సంచలనంగా మారింది.

ప్రధాన నిందితుడు గోపతి యశ్వంత్ అరెస్ట్ కాగా మరికొందరు నిందితులు, పోలీస్ శాఖకు చెందిన వ్యక్తి పరారీలో ఉంటూ కేసును నీరుగారిచేందుకు తీవ్రంగా ప్రయత్నిస్తున్నట్లు తెలుస్తోంది.

బంగారం, ఫారెక్స్ ట్రేడింగ్‌లో పెట్టుబడుల పేరుతో తెలుగు రాష్ట్రాల్లో పలువురు వ్యక్తులను మోసం చేసి, కోట్ల రూపాయల మేర డబ్బులు వసూలు చేసినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న గోపతి యశ్వంత్ వ్యవహారం ఖమ్మం నగరంలో చర్చనీయాంశంగా మారింది. బాధితుల్లో కొందరు ఖమ్మం నగరంలో ఫిర్యాదు చేయడంతో ఈ వ్యవహారం వెలుగులోకి వచ్చినట్లు సమాచారం.

**సమస్యల మళ్లింపునకే ఆస్తుల ఆరోపణలు**
**ప్రజల పాత్ర లేని దిశగా ప్రజాస్వామ్యం**
**ఐక్య కార్యాచరణ తర్వాతే ఐక్యత**
**అధికారం ఉన్నప్పుడు భూములు పంచేందుకు జంకెందుకు...?**
**సిపిఎం నేత తమ్మినేని**



సీఎస్‌లో...

# రాజకీయాలను దిగజారుస్తున్న.. బజారు భాష

ఖమ్మం బ్యూరో,ప్రభాతవార్త
రాష్ట్రంలో అధికార, విపక్ష నేతలు వాడుతున్న బజారు భాష రాష్ట్ర రాజకీయాలను దిగజారుస్తుందని సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు, మాజీ ఎంపి తమ్మినేని వీరభద్రం తెలిపారు. గౌరవనీయ భాష ప్రయోగించకుండా నీచ పదజాలం రాజకీయాల్లో సరైంది కాదని ఆయన తెలిపారు. ప్రజా సమస్యలను పక్కదారి పట్టించుకే భూ కబ్జాలు, ఆక్రమణల వ్యవహారాన్ని తెరపైకి తెస్తున్నారని

## ప్రతి ఫిర్యాదు దరఖాస్తును పరిశీలించి చర్యలు తీసుకోవాలి

**స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డాక్టర్ శ్రీజ**



సీఎస్‌లో...

## భద్రాద్రి బ్యాంకు 30వ అవతరణ దినోత్సవం వేడుకలు

ఖమ్మం అక్టోబర్ 5 ప్రభాత వార్త:



ఖమ్మంలో గాంధీచౌక్ హెడ్ ఆఫీసులో భద్రాద్రి కో పరేటివ్ అర్బన్ బ్యాంకు 30వ అవతరణ దినోత్సవం వేడుకలు ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా కేకు కట్చేసి బ్యాంకు చైర్మన్ చెరుకూరి కృష్ణమూర్తి మాట్లాడుతూ.. బ్యాంకు 29 వసంతాలు పూర్తి చేసుకొని 30వ సంవత్సరంలోకి అడుగుపెడుతున్న సందర్భంగా ఖాతాదారులకు, శ్రేయోభిలాషులకు, వాటాదారులకు, సిబ్బందికి, తనతో కలిసి పనిచేసిన పూర్వ ప్రస్తుత డైరెక్టర్లకు శుభాకాంక్షలు కృతజ్ఞతలు తెలిపారు. బ్యాంకు వివిధ రంగాల వారికీ ఋణ సహాయంచేస్తూ సమాజంలో వారి అభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తోందని తెలిపారు. బ్యాంకు 25 శాఖలతో విస్తరించిందని , బ్యాంకు యొక్క వ్యాపార టర్నోవరు రూ++ 1065 కోట్లు దాటిందని సంతోషం వ్యక్తం చేశారు. ఖాతాదారులు తమ మీద వుంచిన విశ్వాసానికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. బ్యాంకు వైస్ చైర్మన్ లు సన్నే ఉదయ్ ప్రతాప్ , వేములపల్లి వెంకటేశ్వరరావు, బ్యాంకు డైరెక్టర్స్ దేవత రాజారావు , మద్ది పిచ్చయ్య , కర్లపూడి నర్మద, కపిలవాయి జయప్రద, రాజ్పురోహిత్ చెన్ సింగ్ , శ్రీ రంగా నాగ శ్రీనివాసరావు, దారా జీవన్ రామ్ , బోర్డు ఆఫ్ మేనేజ్మెంట్ సభ్యులు, బ్యాంకు ఉన్నతాధికారులు ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

## భద్రాచలం ఆధ్యాత్మికతకు తగ్గట్టుగా పోలీసింగ్

### ప్రజలకు అందుబాటులో.. నేరాలపై ఉక్కుపాదం

### స్నేహపూర్వకతతో సేవలు.. శాంతిభద్రతలే లక్ష్యం

### భద్రాచలం పట్టణ సీఐగా సట్ల రాజు

భద్రాచలం క్రైమ్, అక్టోబర్ 5(ప్రభాతవార్త):

భద్రాచలం పట్టణ పోలీస్ స్టేషన్ సీఐగా సట్ల రాజు బాధ్యతలు చేపట్టనున్నారు. గతంలో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పరిధిలోని అశ్వాపురం సీఐగా విధులు నిర్వహించిన ఆయనకు పోలీస్ శాఖలో విశేష అనుభవం ఉంది. అశ్వాపురంలో పనిచేసిన సమయంలో శాంతిభద్రతల పరిరక్షణతోపాటు ప్రజలకు అందుబాటులో ఉంటూ స్నేహపూర్వక అధికారిగా గుర్తింపు పొందారు. ప్రస్తుతం భద్రాచలం వంటి అత్యంత సున్నితమైన, ఆధ్యాత్మిక ప్రాధాన్యం కలిగిన పట్టణంలో సీఐగా బాధ్యతలు చేపట్టనున్న నేపథ్యంలో ఆయనపై ప్రజల్లో ఆసక్తి నెలకొంది. శ్రీ సీతారామచంద్రస్వామి దేవస్థానం, భక్తుల రద్దీ, ప్రధాన కూడళ్లలో ట్రాఫిక్ నియంత్రణ వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాల్సిన అవసరం ఉంది. భక్తులు, స్థానిక ప్రజలు, వ్యాపారులు, ఆటోడ్రైవర్లు తదితర వర్గాలతో సమన్వయంతో ముందుకు సాగితే పోలీసింగ్ మరింత ప్రజలకు చేరువయ్యే అవకాశం ఉంది. నేరాల నియంత్రణతోపాటు మహిళలు, వృద్ధులు, భక్తుల భద్రతకు ప్రాధాన్యం ఇవ్వాల్సి ఉంది. ఆధ్యాత్మిక పట్టణ ప్రశాంతతకు భంగం కలగకుండా ముందస్తు చర్యలు చేపట్టడం కీలకం కానుంది. గతంలో పనిచేసిన ప్రాంతాల్లో సమర్థవంతమైన అధికారిగా, ప్రజలకు అందుబాటులో ఉండే అధికారిగా పేరు తెచ్చుకున్న సట్ల రాజుపై భద్రాచలం ప్రజలు సైతం అదే తరహా సేవలను ఆశిస్తున్నారు. నూతన సీఐగా బాధ్యతలు స్వీకరిస్తున్న సట్ల రాజుకు పలువురు పోలీసు అధికారులు, ప్రజలు అభినందనలు తెలిపారు.






## శ్రీదేవి శరన్నవరాత్రి మహోత్సవాల ముహూర్తం రాట ఏర్పాటు

దుమ్ముగూడెం ప్రభాతవార్త (అక్టోబర్ 5)



దుమ్ముగూడెం గ్రామంలో పవిత్ర గోదావరి నది తీరాన పరమ శివ నందీశ్వర శ్రీ ముత్యాలమ్మ అమ్మవారి ఆలయాల నడుమ ఉన్న శ్రీ శ్రీ ఆత్మారామ చంద్ర స్వామి వారి ఆలయ ప్రాంగణంలో ఈ నెల 11 వ తేదీ ఆది వారం నుండి శ్రీ దేవి శరన్నవరాత్రి ఉత్సవాలు ప్రారంభం కానున్నాయి దసరా మహోత్సవాలు సందర్భంగా సోమవారం ఉదయం 9.29 నిమిషాలకు శ్రీ దేవి శరన్నవరాత్రి మహోత్సవం ప్రారంభ సూచికగా ముహూర్తం రాట అంగ రంగ వైభవంగా వేద పండితులు కొంపల్లి సత్యనారాయణ మూర్తి మంత్రాల నడుమ మహిళలు ముత్తైదువులు పిల్లలు పెద్దలు సమక్షం లో ముహూర్తం రాటను వేశారు ఈ ముహూర్తం రాట ఏర్పాటు కొరకు ఆదివారం మేళా తాళాలతో ఇంటి ఇంటికి మహిళలు గ్రామస్తులు వెళ్లి బొట్టు కార్యక్రమం నిర్వహించి అమ్మవారి తాంబూలం స్వీకరించుటకు మహిళలు ముత్తైదువులను ఆహ్వానించారు దసరా మహోత్సవాల సందర్భంగా ముహూర్తం రాటను వేసే కార్యక్రమానికి అధిక సంఖ్యలో భక్తులు విచ్చేసి అమ్మవారి దైవ కార్యక్రమం లో పాల్గొని అమ్మ వారి తీర్థ ప్రసాదాలు స్వీకరించి అమ్మవారి కృపకు పాత్రులైనారు

## అర్హులైన నిరుపేదలకే ఇళ్లను మంజూరు చేయాలి

– పెండింగ్ దరఖాస్తులను వెంటనే పూర్తిచేయాలి

– జిల్లా కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా



ప్రభాతవార్త ప్రతినిధి, జనగామ :

అర్హులైన నిరుపేదలకు ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేయాలని జిల్లా కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా అధికారులను ఆదేశించారు. సోమవారం జిల్లా సమీకృత కలెక్టర్ కార్యాలయంలోని మినీకాన్ఫరెన్స్ హాల్లో ఇందిరమ్మ ఇళ్లపథకంకింద మంజూరైన ఇళ్లనిర్మాణాల పురోగతి, రెండు పడకగదుల ఇళ్ల కేటాయింపుకు సంబంధించిన ధ్రువపత్రాల పరిశీలన ప్రక్రియ, పెండింగ్ దరఖాస్తులపై అదనపు కలెక్టర్ బెన్షాలోమ్‌తో కలిసి జిల్లా కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ అర్హతకలిగిన ప్రతిలబ్ధిదారుడికి న్యాయంజరిగేలా, అనర్హులకు ఇళ్లుమంజూరు కాకుండా నిబంధనల ప్రకారం క్షుణ్ణంగా పరిశీలన చేయాలన్నారు. పాలకుర్తి, జనగామ నియోజకవర్గాల్లో పెండింగ్‌లో ఉన్న ఇళ్లదరఖాస్తుల పరిశీలన ప్రక్రియను వేగవంతంచేసి, త్వరితగతిన పూర్తిచేయాలని సూచించారు. దరఖాస్తుల పరిశీలనలో రేషన్‌కార్డు, ఆదాయధృవీకరణ పత్రం కీలకంగా పరిగణించాలని సూచించారు. కుటుంబంలోని పెద్దలు, వయోజనుల వివరాలను రేషన్‌కార్డు ఆధారంగా పరిశీలించడంతోపాటు, కుటుంబంలోని కుమారులు వేర్వేరుగా రేషన్ కార్డులు తీసుకొని, ప్రత్యేకంగా నివసిస్తున్న సందర్భాల్లో వారి అర్హతలను కూడా నిబంధనల ప్రకారం సరిచూడాలన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో రూ.1.50లక్షలు, పట్టణ ప్రాంతాల్లో రూ.2లక్షల వరకు వార్షిక ఆదాయం ఉన్నవారిని ఆదాయ పరిమితి నిబంధనల ప్రకారం పరిగణనలోకి తీసుకోవాలని సూచించారు. ఆదాయ ధృవీకరణ పత్రాలు ప్రతి సంవత్సరం మారే అవకాశం ఉన్నందున వాటిని తప్పనిసరిగా ధృవీకరించి తగిన చర్యలు తీసుకోవాలన్నారు. లబ్ధిదారులకు భూమి, ఇల్లు, ఇతర ఆస్తులు ఉన్నాయా అనే విషయాన్ని సంబంధిత ప్రభుత్వ వెబ్‌సైట్ల ద్వారా పరిశీలించాలని ఆదేశించారు. కుటుంబ సభ్యులకు ఇతర ప్రాంతాల్లో ఇళ్లు, భూములు, ఆస్తులు ఉన్నట్లయితే స్థానికంగా విచారణ జరిపి, వాస్తవాలను నిర్ధారించుకోవాలని సూచించారు. అన్ని వివరాలను క్షుణ్ణంగా పరిశీలించిన అనంతరం మాత్రమే దరఖాస్తులను ఆమోదించడం, తిరస్కరించడం చేయాలని స్పష్టంచేశారు. ఈ-ఆఫీస్ విధానాన్ని తప్పనిసరిగా వినియోగిస్తూ, కార్యాలయ ఫైళ్ల ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించాలని స్పష్టంచేశారు. సమావేశంలో గృహ నిర్మాణశాఖ పీడీ బలరామరావు, మునిసిపల్ కమిషనర్ రాజశేఖర్‌రెడ్డి, ఎంపిడిఓలు మహేష్‌నాయక్, లావణ్య, ఇతర సంబంధిత అధికారులు, డీఈఈలు, అన్ని మండలాల ఏఈలు, తదితరులు పాల్గొన్నారు.

## మంథని నియోజకవర్గానికి రూ.12.58 కోట్ల నిధులు...

### 115 భవనాల నిర్మాణానికి మంజూరు..

### ఐదు మండలాల్లో అభివృద్ధి పనులకు శ్రీకారం...

కాటారం, అక్టోబర్ 5, ప్రభాతవార్త:

జయశంకర్ భూపాలపల్లి జిల్లా పరిధిలోని మంథని నియోజకవర్గంలోని 5 మండలాల్లో అభివృద్ధి పనులకు రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు భారీగా నిధులు మంజూరు చేయించారు. వీబీ జీ రామ్ జీ 202627 కింద మొత్తం రూ.12.58 కోట్లతో 115 భవనాల నిర్మాణానికి నిధులు మంజూరైనట్లు మంత్రి క్యాంప్ కార్యాలయం ఒక ప్రకటనలో తెలిపింది.

**కొత్తగా రూ.5.08 కోట్లు..**

మహాముత్తారం, మల్హర్ రావు మండలాల్లో 6 గ్రామ పంచాయతీ భవనాలకు రూ.1.20 కోట్లు (ఒక్కోటి రూ.20 లక్షలు), కాటారం, మహాముత్తారం, మహదేవ పూర్, మల్హర్ రావు మండలాల్లో 24 అంగన్వాడీ భవనాలకు రూ.2.88 కోట్లు (ఒక్కోటి రూ.12 లక్షలు), మహాముత్తారం, మహదేవ పూర్, పలిమెల మండలాల్లో 10 మహిళా సంఘ (వీఓ) భవనాలకు రూ.కోటి (ఒక్కోటి రూ.10 లక్షలు) మంజూరయ్యాయి. రెడ్డిపల్లి, ప్రేమ్ నగర్, రేగులగూడెం, ఇప్పలపల్లి, ఎడ్లపల్లి, నాచారం గ్రామాల్లో పంచాయతీ భవనాలు, కాటారం మండలంలోని మద్దులపల్లి, కాటారం, ఎర్రగుంటపల్లి తదితర 14 గ్రామాల్లో అంగన్వాడీ భవనాలు నిర్మించనున్నారు.

**ఇదివరకే రూ.7.50 కోట్లు..**

ఇదివరకే మంజూరైన 75 వీఓ భవనాలకు రూ.7.50 కోట్లు మంజూరయ్యాయి. కాటారంలో 24, మహాముత్తారంలో 19, మల్హర్ రావులో 15, మహదేవపూర్ లో 11, పలిమెలలో 6 భవనాల నిర్మాణ ప్రక్రియలో ఉన్నాయి. నిధులు మంజూరు చేసిన మంత్రి శ్రీధర్ బాబుకు 5 మండలాల కాంగ్రెస్ నాయకులు, సర్పంచులు, గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు.

## ప్రజావాణి అర్జీల పరిష్కారంలో జాప్యం వద్దు..

నిరక్ష ్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవు

జయశంకర్ భూపాలపల్లి జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ

జిల్లా ప్రజావాణిలో 85 దరఖాస్తుల స్వీకరణ

ప్రభాతవార్త ప్రతినిధి, జయశంకర్ భూపాలపల్లి బ్యూరో

ప్రజావాణిలో ప్రజల నుంచి స్వీకరించిన అర్జీలను ఎటువంటి జాప్యం లేకుండా వెంటనే పరిష్కరించాలని జయశంకర్ భూపాలపల్లి జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ అధికారులను ఆదేశించారు. సోమవారం ఐడీఓసీ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ఆయన స్వయంగా ప్రజల నుంచి దరఖాస్తులను స్వీకరించారు. ఈ సందర్భంగా వివిధ సమస్యలపై మొత్తం 85 దరఖాస్తులు అందినట్లు కలెక్టర్ తెలిపారు. వచ్చిన ప్రతి అర్జీని అత్యంత ప్రాధాన్యతగా పరిగణించి, సంబంధిత శాఖల అధికారులకు ఎండార్స్ చేసినట్లు ఆయన పేర్కొన్నారు. ప్రజల సమస్యల పరిష్కారంలో అధికారులు ఎట్టి పరిస్థితుల్లోనూ నిరక్ష ్యం వహించరాదని, అలా చేస్తే శాఖాపరమైన కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. అర్జీల పరిష్కారానికి తీసుకున్న చర్యల వివరాలను ఎప్పటికప్పుడు ప్రజావాణి పోర్టల్‌లో తప్పనిసరిగా నమోదు చేయాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ పడాల అశోక్‌కుమార్, డీఆర్వో వసంత, ఆర్డీఓ హరికృష్ణ, శిక్షణా డిప్యూటీ కలెక్టర్ నవీన్ రెడ్డితో పాటు వివిధ శాఖల జిల్లా స్థాయి అధికారులు పాల్గొన్నారు.

## జర్నలిస్టులకు ఇంటి స్థలాలు కేటాయించాలి

కలెక్టర్ కలసిన వెంకటాపూర్ జర్నలిస్టులు

సానుకూలంగా స్పందించిన కలెక్టర్

వెంకటాపూర్ (రామప్ప) ప్రభాతవార్త :

ప్రభుత్వానికి ప్రజలకు మధ్య వారధిగా ఉండే జర్నలిస్టులకు ఇంటి స్థలాలు కేటాయించాలని వెంకటాపూర్ జర్నలిస్టులు ములుగు కలెక్టర్ హేమంత్ బొర్కడే వాసుదేవరావును కోరారు. ఈ మేరకు వెంకటాపూర్ జర్నలిస్టులు సోమవారం ములుగు కలెక్టర్ కార్యాలయానికి చేరుకొని కలెక్టర్ ను ప్రత్యేకంగా కలిశారు. గత కొన్నేళ్లుగా తాము మీడియా వృత్తిలో కొనసాగుతూ ప్రజా సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకువస్తున్నామని పేర్కొన్నారు. అలాంటి తాము 4 సంవత్సరాలుగా వెంకటాపూర్ మండలం పాలంపేట గ్రామ శివారులోని రెవిన్యూ భూమిలో గుడిసెలు వేసుకొని మోకా మీద ఉన్నామని ఆయనకి తెలిపారు. దీనికి కలెక్టర్ సానుకూలంగా స్పందించారు. జర్నలిస్టుల ఇంటి స్థలాల అంశంపై పూర్తి నివేదిక అందించాలని కలెక్టర్ అడిషనల్ కలెక్టర్ రెవిన్యూ మహేందర్ జీ కి సిఫారస్ చేసినట్లు జర్నలిస్టులు తెలిపారు.

## మంత్రులకు మండల కాంగ్రెస్ నేతలు కృతజ్ఞతలు

### 8న ఎమ్మెల్యే చే సిరిపురం మేజర్ కు నీరు విడుదల



తల్లాడ అక్టోబర్ 5 ప్రభాతవార్త

సీతారామ ప్రాజెక్టు ద్వారా ఎండుతున్న పంటలను కాపాడాలని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు భారీ నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ కుమార్ రెడ్డితో మాట్లాడి నీరు విడుదల చేయడం పట్ల మండల కాంగ్రెస్ అధ్యక్షుడు గొడుగునూరు లక్ష్మిరెడ్డి మాజీ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ దుండేటి వీరారెడ్డి హర్ష వెలిబుచ్చారు సోమవారం ఈ మేరకు విలేకరులతో మాట్లాడు తూ సిరిపురం మేజర్ కింద 11,000 ఎకరాలయకట్టు ఉండగా కాలువ పనులు చేపడుతున్నారని బిల్లుపాడు అన్నారుగూడెం రామచంద్రపురం గూడూరు తెలగారం అంజనాపురం రైతుల కోసం సీతారామ ప్రాజెక్ట్ నీరు ఎంతో ఉపయోగపడుతుందని గుర్తు చేశారు సీతారామ ప్రాజెక్టు ద్వారా విడుదలైన నీరు సిరిపురం మేజర్కు విడుదల చేయడం కోసం ఈ నెల 8వ తేదీన సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ మట్ట రాగమై దయానంద్ చేతుల మీదుగా నీరు విడుదల చేస్తారని ఈ విషయాన్ని రైతులు గమనించాలని కోరారు సిరిపురం మేజర్ లో చేపడుతున్న పనులు పూర్తయితే రైతులకు భవిష్యత్తులో ఎలాంటి ఇబ్బందులు ఉండవని గుర్తు చేశారు ఎమ్మెల్యే పాల్గొనే కార్యక్రమాన్ని రైతులు విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు ఈ కార్యక్రమంలో ప్రసాద్ తాళ్ల జోసెఫ్ పాల్గొన్నారు

## మాజీ ఎమ్మెల్యే సండ్ర పరామర్శ



తల్లాడ అక్టోబర్ 5 ప్రభాతవార్త

ఇటీవల మృతి చెందిన కాంగ్రెస్ పార్టీ మాజీ జిల్లా నాయకులు గువ్వల రామిరెడ్డి చిత్రపటానికి మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకట వీరయ్య నివాళులర్పించారు రామ్ రెడ్డి మరణానికి గల కారణాలను కుటుంబ సభ్యులు అడిగి తెలుసుకున్నారు సందర్భంగా కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు ఈ కార్యక్రమంలో దొడ్డ శ్రీనివాసరావు రెడ్డెం వీర మోహన్ రెడ్డి పెరిక నాగేశ్వరరావు జి ప్రభాకర్ డి వెంకట్ లాల్ కర్నాట లక్ష్మారెడ్డి దగ్గుల శ్రీనివాసరెడ్డి జి.వి.ఆర్ పాల్గొన్నారు

## వర్ధంతి సభను విజయవంతం చేయండి

తల్లాడ అక్టోబర్ 5 ప్రభాతవార్త

మండల పరిధిలోని అన్నారుగూడెం గ్రామంలో ఈనెల ఏడో తేదీన



దివంగత దొడ్డ కృష్ణయ్య వర్ధంతి సభను విజయ వంతం చేయాలని సోదరుడైన మాజీ ఎంపీపీ దొడ్డ శ్రీనివాసరావు విజ్ఞప్తి చేశారు సోమవారం రాత్రి గ్రామంలో కార్యకర్తలతో ఏర్పాటు చేసిన సన్నాహక కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఆరోజు మధ్యాహ్నం ద్విచక్ర వాహనాల ర్యాలీతోపాటు ప్రదర్శన ఉంటుందని కార్యకర్తలు నాయకులు అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు ఈ కార్యక్రమంలో సర్పంచ్ జీ ప్రభాకర్ దొడ్డ చిన్న శీను మారెళ్ళ దేవేందర్ తుమ్మలపల్లి అనంతరామయ్య తదితరులు పాల్గొన్నారు

## రాజీవ్ సాగర్ పైపుల చోరీ కేసులో ఆరుగురు అరెస్ట్

అశ్వాపురం,ప్రభాతవార్త అక్టోబర్ 05:



అశ్వాపురం పోలీస్ స్టేషన్ పరిధిలోని సర్వాయిపాడు గ్రామ శివారులో రాజీవ్ సాగర్ కాలువకు సంబంధించిన ఇనుప పైపుల చోరీ కేసులో ఆరుగురిని పోలీసులు అరెస్ట్ చేశారు.ఇరిగేషన్ శాఖ ఏఈ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు, సోమవారం ఉదయం అందిన విశ్వసనీయ సమాచారంతో అశ్వాపురం సీఐ ఎల్లయ్య ఆధ్వర్యంలో తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా అనుమానితులను అదుపులోకి తీసుకుని విచారించారు.పోలీసుల కథనం ప్రకారం పొడియం అనిల్ కుమార్, కురుసం రాంబాబు,బోళ్ల నరసయ్య,కారం నరేష్, కుంట శ్రీను,తడకమళ్ల ప్రసాద్ లను అదుపులోకి తీసుకున్నామని,విచారణలో సర్వాయిపాడు బంజారా గ్రామ శివారులోని రాజీవ్ సాగర్ ప్రాజెక్టుకు చెందిన పెద్ద ఇనుప పైపును గ్యాస్ కట్టర్‌తో కట్ చేసి, విడిభాగాలను దొంగతనంగా తరలించినట్లు వారు అంగీకరించినట్లు పోలీసులు తెలిపారు.అనంతరం నిందితులను పోలీస్ స్టేషన్‌కు తరలించి విచారణ పూర్తిచేసిన పోలీసులు రిమాండ్ నిమిత్తం మణుగూరు కోర్టుకు తరలించారు. కేసుపై తదుపరి దర్యాప్తు కొనసాగుతున్నట్లు అశ్వాపురం సీఐ సిహెచ్ ఎల్లయ్య తెలిపారు.

## 32 పోయిన మొబైల్ ఫోన్లు రికవరీ

### బాధితులకు అప్పగించిన డీఎస్పీ అరుణ్‌కుమార్



భద్రాచలం క్రైమ్, అక్టోబర్ 5(ప్రభాతవార్త)

వివిధ సందర్భాల్లో పోయిన 32 మొబైల్ ఫోన్లను సాంకేతిక పరిజ్ఞానంతో రికవరీ చేసి బాధితులకు అప్పగించినట్లు భద్రాచలం డీఎస్పీ ఎం.అరుణ్‌కుమార్ తెలిపారు. భద్రాచలం టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో మొబైల్ ఫోన్లు పోయినట్లు అందిన ఫిర్యాదుల మేరకు వివరాలను సీఈఐఆర్ (దిని।ళి) పోర్టల్‌లో నమోదు చేసి, సాంకేతికతను ఉపయోగించి వాటిని గుర్తించినట్లు పేర్కొన్నారు. రికవరీ చేసిన 32 మొబైల్ ఫోన్లను సోమవారం సంబంధిత బాధితులు, యజమానులకు అప్పగించారు.ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ.. రద్దీ ప్రాంతాలు, మార్కెట్లు, బస్సులు, రైల్వే స్టేషన్లు, ఇతర బహిరంగ ప్రదేశాల్లో మొబైల్ ఫోన్లను వినియోగించే సమయంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. మొబైల్ ఫోన్లను నిర్లక్ష్యంగా ఎక్కడపడితే అక్కడ ఉంచరాదన్నారు. ఫోన్ పోయినా, చోరీకి గురైనా వెంటనే పోలీసులకు సమాచారం అందించి, మొబైల్ ఐఎంఈఐ నంబర్‌తో పాటు ఇతర వివరాలను అందించాలని సూచించారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించి పోయిన మొబైల్ ఫోన్లను రికవరీ చేసేందుకు పోలీసులు నిరంతరం కృషి చేస్తున్నారని డీఎస్పీ తెలిపారు.

## టేకుల తండా జిపిఎస్ పాఠశాలకు సామాగ్రిని సరఫరా చేసిన ట్రైబల్ వెల్ఫేర్ కమిషనర్

కామేపల్లి, అక్టోబర్ 5 ప్రభాతవార్త :

ట్రైబల్ వెల్ఫేర్ కమిషనర్ హైదరాబాద్ నుండి కామేపల్లి మండలం టేకుల తండా ప్రభుత్వ గిరిజన సంక్షేమ ప్రాథమిక పాఠశాల కు 75 ఇంచెస్ ఎల్ జి స్క్రీన్ , ఎల్ జి స్టాండ్ ,పవర్ సప్లైయర్ సోమవారం రావడం జరిగింది.ఖమ్మం జిల్లాలో ట్రైబల్ వెల్ఫేర్ స్కూల్ లలో టేకుల తండా కు మాత్రమే ఇవి మంజూరు కావడం జరిగిందని ఉపాధ్యాయుడు సపావట్ కిషన్ తెలిపారు. ట్రైబల్ వెల్ఫేర్ అధికారులకు,ఐటిడి అధికారులకు పాఠశాల తరఫున విద్యార్థిని విద్యార్థులు వారి తల్లిదండ్రులు, గ్రామస్తులు, ఉపాధ్యాయులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.




## హత్యాయత్నం కేసులో నిందితుడికి ఏడాది కఠిన కారాగార శి క్ష

### డ్రైనేజీ చెత్త విషయంలో గొడవ.. పికాసితో తలపై దాడి

ఖమ్మం న్యాయవిభాగం, ప్రభాతవార్త:

ఖమ్మం కమిషనరేట్ పరిధిలోని కొణిజర్లలో నమోదైన హత్యాయత్నం కేసులో నిందితుడికి న్యాయస్థానం ఏడాది కఠిన కారాగార శిక్ష విధించింది. 2025 మార్చి 15న మల్లుపల్లి గ్రామంలో డ్రైనేజీ చెత్త విషయంలో బానోత్ బాలాజీతో దారావత్ సీతారాములు (48) గొడవపడ్డాడు. ఈ క్రమంలో సీతారాములు పికాసి పారతో బాలాజీ తలపై కొట్టడంతో తీవ్ర రక్తగాయమైంది. బాధితుడి ఫిర్యాదుతో కొణిజర్ల పోలీసులు క్రైం నంబర్ 66/2025 కింద తీవిళీ 109(1) సెక్షన్‌తో కేసు నమోదు చేశారు. విచారణలో నేరం రుజువు కావడంతో రెండో అదనపు జిల్లా, సెషన్స్ కోర్టు నిందితుడికి ఏడాది కఠిన కారాగార శిక్ష విధించింది. అదనంగా రూ.5 వేల జరిమానా, చెల్లించని పక్షంలో మరో మూడు నెలల జైలు శిక్ష అనుభవించాలని తీర్పునిచ్చింది. న్యాయమూర్తి వాసుకుల శ్రీనయ్య తీర్పు వెలువరించగా, ఏపీపీ పీవీడీ లక్ష్మి, కోర్టు సిబ్బంది కేసు పురోగతిలో సేవలందించారు. దర్యాప్తు అధికారి ఎస్సై జి.సూరజ్, కోర్టు లైజన్ ఎస్సై కె.శ్రీకాంత్, సిబ్బందిని పోలీసు అధికారులు అభినందించారు.

## గంజాయి కేసులో ముగ్గురికి మూడేళ్ల జైలు

### ఒక్కొక్కరికి రూ.10 వేల జరిమానా

ఖమ్మం న్యాయ విభాగం, అక్టోబర్ 5(ప్రభాతవార్త):

గంజాయి అక్రమ రవాణా కేసులో ముగ్గురు నిందితులకు మూడేళ్ల జైలు శిక్షతో పాటు ఒక్కొక్కరికి రూ.10 వేల జరిమానా విధిస్తూ ఖమ్మం మొదటి అదనపు జిల్లా, సెషన్స్ కోర్టు న్యాయమూర్తి డాక్టర్ పుల్లాభట్ల పోగడ కృష్ణార్జున్ సోమవారం తీర్పు వెలువరించారు.మధిర టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో 2024 ఆగస్టు 2న ఒడిశా నుంచి 2.5 కిలోల గంజాయిని అక్రమంగా తరలిస్తూ ముగ్గురు పట్టుబడ్డారు. ఈ ఘటనపై పోలీసులు క్రైమ్ నంబర్ 133/2024 కింద ఎన్‌డీపీఎస్ చట్టం1985లోని సెక్షన్ 8(సి) రెడ్‌విత్ 20(బి)()(బి) ప్రకారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.ఈ కేసులో మధిరకు చెందిన కల్యాణపు వంశీ (20), తమ్మిశెట్టి కిరణ్ (19), రెంటపల్లి మహేష్ ఆనంద్ (20) నిందితులుగా ఉన్నారు. నేరం రుజువు కావడంతో కోర్టు ముగ్గురికీ మూడేళ్ల జైలు శిక్ష, ఒక్కొక్కరికి రూ.10 వేల జరిమానా విధించింది. కాగా, ఒడిశా ప్రాంతానికి చెందిన మరో నిందితుడు హంతాల్ మధు పరారీలో ఉన్నట్లు పోలీసులు తెలిపారు.కేసు దర్యాప్తును ఇన్‌స్పెక్టర్లు దోమల రమేష్, డి.మధు నిర్వహించారు. అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ జమ్ముల శరత్‌కుమార్‌రెడ్డి కోర్టులో వాదనలు వినిపించారు. కేసు దర్యాప్తు, కోర్టు విధుల్లో సహకరించిన కోర్టు లైజన్ అధికారి ఎస్ఐ కె.శ్రీకాంత్, కోర్టు డ్యూటీ ఆఫీసర్ నాగేశ్వరరావు, హోంగార్డు అధికారి ఎం.డి.అయూబ్‌లను పోలీస్ కమిషనర్ సునీల్‌దత్ అభినందించారు.

## గోమాంసం అమ్ముతున్న వ్యక్తిపై బైండోవర్ కేసు

దుమ్ముగూడెం: ప్రభాతవార్త (అక్టోబర్ 5)

దుమ్ముగూడెం మండలంలోని నరసాపురం గ్రామంలో గోమాంసం విక్రయిస్తున్న వ్యక్తిపై బైండోవర్ కేసు నమోదయింది నిందితుడు ఖాజా మొయినుద్దీన్ ను దుమ్ముగూడెం తహసిల్దార్ ముందు హాజరు పరిచారు నరసాపురం గ్రామంలో ఆదివారం అక్రమంగా గోమాంసం అమ్ముతున్నారనే సమాచారంతో దుమ్ముగూడెం తహసిల్దార్ ఆదేశాల మేరకు రెవెన్యూ సిబ్బంది దాడి చేసి పట్టుకున్నారు నిందితున్ని పోలీసులకు అప్పగించగా బైండ్ ఓవర్ కేసు నమోదు చేసి తహసిల్దార్ ముందు హాజరుపరిచారు

## గంజాయి కేసులో ముగ్గురు నిందితులకు మూడేళ్లు జైలుశిక్ష, రూ.10,000 జరిమానా విధించిన కోర్టు

మధిర అక్టోబర్ 5 ప్రభాతవా ర్త

గంజాయి విక్రయిస్తూ వినియోగిస్తూ పట్టుబడిన ముగ్గురు నిందితులకు ఒక్కొక్కరికి 3 సంవత్సరాల జైలు శిక్ష తో పాటు రూ.10వేల జరిమానాను విధిస్తూ ఖమ్మం ఎక్సైజ్ మెజిస్ట్రేట్ తీర్పునిచ్చారు. ఈ మేరకు నిందితుల వివరాలను పట్టణ సీఐ దోమల రమేష్ వెల్లడించారు. మధిర పట్టణానికి చెందిన నిందితులు నిషేధిత గంజాయిని విక్రయించడంతోపాటు వినియోగిస్తున్న క్రమంలో వారిని గుర్తించి కేసు నమోదు చేసి కోర్టులో హాజరపరచడం జరిగిందని తెలిపారు. విచారణ అనంతరం సోమవారం నిందితులైన పట్టణంలోని రామాలయం రోడ్ లో నివాసం ఉంటూ పండ్ల వ్యాపారం చేసుకునే కళ్యాణపు వంశీ, శివ(20), బాలికల పాఠశాల ప్రాంతానికి చెంది ఫ్లెక్సీ కార్మికునిగా పనిచేస్తున్న తమ్మిశెట్టి కిరణ్ (19) ఆజాద్ రోడ్డు ప్రాంతానికి చెంది పెయింటింగ్ వర్క్ చేస్తున్న రెంటపల్లి మహేష్ ఆనంద్,(20) ఉన్నట్లు సిఐ దోమల రమేష్ తెలిపారు.




# గిరిజనుల అర్జీలకు సత్వర పరిష్కారం

**గడువులోగా సంక్షేమ**

**పథకాలు అందించాలి**

**ఐటీడీఏ పీవో రాహుల్**

భద్రాచలం, అక్టోబర్ 5(ప్రభాతవార్త): గిరిజనుల నుంచి స్వీకరించే ప్రతి దరఖాస్తును క్షుణ్ణంగా పరిశీలించి నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని ఐటీడీఏ పీవో బి.రాహుల్ అధికారులను ఆదేశించారు.సోమవారం ఐటీడీఏ సమావేశ మందిరంలో నిర్వహించిన గిరిజన దర్బార్‌లో ఆయన గిరిజనుల నుంచి అర్జీలు స్వీకరించారు.భూ సమస్యలు, పోడు పట్టాలు, సంక్షేమ పథకాలు, ఉపాధి, పింఛన్లు, గృహాలు, మౌలిక వసతులపై పలువురు వినతులు



సమర్పించారు.తక్షణమే పరిష్కరించగల సమస్యలను ఎలాంటి జాప్యం లేకుండా పరిష్కరించాలని పీవో సూచించారు.క్లిష్టమైన సమస్యలపై నిరంతరం పర్యవేక్షణ చేస్తూ బాధితులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలన్నారు.గిరి వికాసం ద్వారా సబ్సిడీపై బోర్లు, మోటార్లు, విద్యుత్ సౌకర్యం కల్పించాలని పలువురు కోరారు.మారుమూల గిరిజన గ్రామాలకు రోడ్లు, విద్యుత్, వితంతు, ఒంటరి మహిళల ఆసరా పింఛన్లు మంజూరు చేయాలని అర్జీలు అందాయి.స్వయం ఉపాధి, వ్యక్తిగత శిక్షణ, దీర్ఘకాలిక వ్యాధులకు వైద్య సాయం అందించాలని మరికొందరు విన్నవించారు. అధికారులు శాఖల మధ్య సమన్వయంతో పనిచేసి దరఖాస్తుల పరిష్కార స్థితిని ఎప్పటికప్పుడు సమీక్షి ంచాలని రాహుల్ ఆదేశించారు.గిరిజనులు అర్జీలతోపాటు సంబంధిత ఆధార పత్రాలు సమర్పిస్తే సమస్య పరిష్కారం మరింత వేగవంతమవుతుందని ఆయన తెలిపారు.

## ప్రధాన రహదారిపై గుంతలు పూడ్చివేత

దుమ్ముగూడెం: ప్రభాతవార్త (అక్టోబర్ 5)



భద్రాచలం చర్ల ప్రధాన రహదారి దుమ్ముగూడెం మండలం నరసాపురం గ్రామంలో ప్రధాన రహదారిపై ఉన్నటువంటి పెద్ద పెద్ద గుంతల్ని శ్రీ ద్వాదశ జ్యోతిర్లింగ మహాక్షేత్రం చిన్న అరుణాచలం ఆలయ వ్యవస్థాపకుడు శివనాగు స్వామి ఆధ్వర్యంలో సోమవారం గుంతలను పూడ్చారు సిమెంట్ ఇసుక మిశ్రమంతో పెద్ద పెద్ద గుంతలను పూడ్చారు ఈ సందర్భంగా శివ నాగ స్వామి మాట్లాడుతూ భద్రాచలం నుండి చర్ల వైపుకు వెళ్లే ప్రయాణికులు వాహనదారులతోపాటు వర్షశాల వచ్చే యాత్రికులు ఈ రహదారిపై తీవ్ర ఇబ్బంది పడుతున్నారని చిన్న అరుణాచలం ద్వారా నరసాపురం గ్రామం వద్ద ఉన్న కొన్ని గుంతలను పూడ్చే కార్యక్రమం చేయటం జరిగిందనీ ప్రభుత్వం త్వరితగతిన భద్రాచలం టు చెర్ల రహదారి పునర్నిర్మాణ పనులు చేపట్టి ప్రమాదాలు జరగకుండా నివారించాలని ఆయన విజ్ఞప్తి చేశారు

## రోడ్డున పడ్డ జీవాలకు 'విక్రమార్కుడి' అండ!

**రోడ్లపై మూగజీవాల దీనావస్థ గోశాల**

**ఏర్పాటుకు వ్యాపారవేత్త విక్రమ్ సంకల్పం**

**ఆహారం.. వైద్యం.. ఆశ్రయం కల్పించేందుకు ముందడుగు**

**జంతు ప్రేమికులు, ప్రజలు సహకరించాలని పిలుపు**

భద్రాచలం, ప్రభాతవార్త: రామయ్య కొలువైన పుణ్యక్షేత్రం వీధుల్లో ఆకలి, గాయాలతో అలమటిస్తున్న మూగజీవాల దీనావస్థ ఓ వ్యాపారవేత్త హృదయాన్ని కదిలించింది.వాహనాల కిందపడి కాళ్లు విరిగి, రక్తమోడుతూ రోడ్లపైనే ప్రాణాలు విడుస్తున్న గోవుల పరిస్థితిని చూసి విక్రమ్ సూపర్ మార్కెట్ అధినేత విక్రమ్ చలించిపోయారు.రోడ్లనే ఆవాసంగా చేసుకున్న నిరాశ్రయ గోవులు, మూగజీవులకు శాశ్వత రక్షణ కల్పించాలనే ఉద్దేశంతో భద్రాచలంలో గోశాల ఏర్పాటు చేయాలని సంకల్పించారు.ఈ విషయమై పట్టణంలోని జంతు ప్రేమికులతో కలిసి నిర్వహించిన మీడియా సమావేశంలో విక్రమ్ తన నిర్ణయాన్ని వెల్లడించారు.'ఆర్తనాదాలు వినిపిస్తున్నా. ఇక మౌనంగా ఉండలేం' అంటూ ఆయన ఆవేదన వ్యక్తం చేశారు .గోశాలలో మూగజీవాలకు నీడ, ఆహారం, తాగునీటితో పాటు అవసరమైన వైద్య చికిత్స అందించేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఒక్కరి ప్రయత్నంతో ఈ సేవా కార్యక్రమం సాధ్యం కాదని, పట్టణ ప్రముఖులు, వ్యాపారులు, స్వచ్ఛంద సంస్థలు, ప్రజలు, జంతు ప్రేమికులు చేయూతనివ్వాలని కోరారు.మూగజీవుల పట్ల చూపే కారుణ్యమే నిజమైన భక్తికి ప్రతిరూపమని పేర్కొన్నారు.పట్టణ ప్రజల సహకారంతో త్వరలోనే గోశాల నిర్మాణాన్ని పూర్తి చేసి రోడ్లపై తిరిగే ప్రతి జీవికీ భద్రత కల్పించాలన్నదే తన లక్ష్యమని స్పష్టం చేశారు. మూగజీవాలకు అండగా నిలిచే ఈ ప్రయత్నానికి పట్టణ ప్రజలు, భక్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.కార్యక్రమంలో సాగర్, శర్మ, లావణ్య పాల్గొన్నారు.



## గౌరారం ఆశ్రమ పాఠశాల విద్యార్థులకు పతకాల పంట

**జాతీయ, రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ పోటీలకు క్రీడాకారిణుల ఎంపిక**

దుమ్ముగూడెం: ప్రభాతవార్త (అక్టోబర్ 5)

దుమ్ముగూడెం మండల పరిధిలోని గౌరవరం గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాలకు చెందిన విద్యార్థులుఉమ్మడి ఖమ్మం జిల్లా స్థాయి అథ్లెటిక్స్ ఎంపిక పోటీలలో అద్భుత ప్రతిభ కనబరిచి పతకాల పంట పండించారు వివిధ అథ్లెటిక్స్ విభాగాల్లో ప్రతిభ చాటిన క్రీడాకారిణులు గోల్డ్ సిల్వర్ బ్రాంజ్ పతకాలు సాధించడంతో పాటు జాతీయ స్థాయి ఎస్‌జిఎఫ్ రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికై పాఠశాలకు గర్వకారణంగా నిలిచారు అండర్10 బాలికలుకె. అఖిలప్రియ - 6వ తరగతి 200 మీటర్ల పరుగు గోల్డ్, లాంగ్ జంప్ సిల్వర్‌పి. నైనిక శ్రీ 6వ తరగతి లాంగ్ జంప్ గోల్డ్, 200 మీటర్ల పరుగు సిల్వర్‌అండర్12 బాలికలుటి. అనూష 7వ తరగతి 300 మీటర్ల పరుగు గోల్డ్ లాంగ్ జంప్ గోల్డ్‌కె నవ్యశ్రీ 7వ తరగతి లాంగ్ జంప్ బ్రాంజ్‌టి. ప్రయోజశ్రీ 7వ తరగతి కిడ్స్ జావెలిన్ త్రో బ్రాంజ్‌అండర్14 బాలికలుకె. సంధ్య 9వ తరగతి కిడ్స్ జావెలిన్ త్రో బ్రాంజ్‌అండర్16 బాలికలుకె. శ్రీవల్లి10వ తరగతి షాట్‌పుట్ / ట్రయాథ్లాన్‌సి సిల్వర్ జాతీయ స్థాయి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థినులను పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మడకం మోతీరు వ్యాయామ ఉపాధ్యాయుడు రవీందర్ ఉపాధ్యాయ బృందం అభినందించారు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణిస్తూ గౌరారం పాఠశాల కీర్తిని జాతీయ స్థాయికి తీసుకెళ్లాలనీ భవిష్యత్తులో మరిన్ని పతకాలు సాధించాలి అని వారు ఆకాంక్షి ంచారు ఆశ్రమ పాఠశాల విద్యార్థినిలు సాధించిపతకాలే పాఠశాల ప్రతిభకు గుర్తింపనీ ఉపాధ్యాయ బృందం ఆనందం వ్యక్తం చేశారు.

## ఎస్టీ బాలుర వసతి గృహంలో ఏటిడిఓ విచారణ

దుమ్ముగూడెం: ప్రభాతవార్త (అక్టోబర్ 5)



దుమ్ముగూడెం గ్రామంలో ఉన్న ఎస్టీ బాలుర వసతి గృహంలో పనిచేస్తున్న వార్డెన్ వసతి గృహంలో ఉంటున్న విద్యార్థులను కొడుతున్నారని విద్యార్థులు ఆరోపించిన వార్తలు పత్రికల్లో రావడంతో భద్రాచలం ఐటిడిఏ కు సంబంధించిన ఏటిడిఓ రాధ సోమవారం వసతి గృహాన్ని సందర్శించి విచారణ చేశారు ఈ సందర్భంగా విద్యార్థులను జరిగిన సంఘటనలపై అడిగి తెలుసుకున్నారు అలాగే వసతి గృహంలో జరుగుతున్న సంఘటనలపై వార్డెన్ ని కూడా అడిగి తెలుసుకున్నారు అదే సమయంలో దుమ్ముగూడెం సర్పంచ్ పూనెం చిన్నక్క వైస్ సర్పంచ్ బైరెడ్డి సతీష్ కార్యదర్శి నరేష్ వసతి గృహానికి వచ్చి విద్యార్థులతో మాట్లాడారు విద్యార్థులు చెప్పిన వివరాలను నివేదిక తయారుచేసి ఐటిడిఏ ఉన్నతాధికారులకు పంపనున్నట్లు ఏటిడిఓ రాధ విలేకరులకు తెలిపారు



# కాంట్రాక్ట్ కార్మికులకు పెరిగిన బెనోవాలెంట్ ప్రయోజనాలు

**పదవీ విరమణ, మృతి**

**బెనోవాలెంట్ చెక్కుల పంపిణీ**

సారపాక, ప్రభాతవార్త: ఐటీసీ పీఎస్‌పీడీ యూనిట్ సారపాకలో కాంట్రాక్ట్ కార్మికుల సంక్షేమానికి మరో ముందడుగు పడింది. గుర్తింపు సంఘం టీఎన్‌టీయూసీ, మిత్రపక్షాల ఆధ్వర్యంలో కాంట్రాక్ట్ కార్మికుల పదవీ విరమణ, మృతి బెనోవాలెంట్ చెక్కుల పంపిణీ కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. గుర్తింపు సంఘం అధ్యక్షుడు కనకమేడల హరిప్రసాద్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో పెంచిన మొత్తాలతో కూడిన చెక్కులను అర్హులైన కార్మికులు, వారి కుటుంబ సభ్యులకు అందజేశారు.కాంట్రాక్ట్ కార్మికుల చందాలతో నిర్వహిస్తున్న బెనోవాలెంట్ నిధి కమిటీ నిర్ణయం మేరకు పదవీ విరమణ ప్రయోజనాన్ని రూ.1.50 లక్షల నుంచి రూ.2 లక్షలకు పెంచారు. అదేవిధంగా మృతి




బెనోవాలెంట్ నిధిని రూ.4 లక్షల నుంచి రూ.4.50 లక్షలకు పెంచారు. పెంచిన మొత్తాలకు సంబంధించిన చెక్కులను సంబంధిత లబ్ధిదారులకు అందజేశారు.కార్మికుల చందాలతో కొనసాగుతున్న బెనోవాలెంట్ నిధి ఆపద సమయంలో కార్మికుల కుటుంబాలకు ఆర్థిక భరోసాగా నిలుస్తోందని కార్యక్రమంలో పాల్గొన్న ప్రతినిధులు పేర్కొన్నారు. కార్మికుల పదవీ విరమణ సమయంలో అందే ప్రయోజనాన్ని పెంచడం ద్వారా వారికి అదనపు ఆర్థిక సహాయం లభిస్తుందని తెలిపారు. అలాగే కార్మికుడు మృతి చెందిన సమయంలో కుటుంబానికి అందే సహాయాన్ని పెంచడం వల్ల ఆ కుటుంబానికి కొంత ఆర్థిక భరోసా కలుగుతుందని పేర్కొన్నారు. కార్మికుల సంక్షేమమే లక్ష్యంగా బెనోవాలెంట్ నిధిని మరింత సమర్థవంతంగా నిర్వహించేందుకు కృషి చేస్తున్నట్లు నిధి కమిటీ సభ్యులు తెలిపారు. భవిష్యత్తులోనూ కార్మికులు, వారి కుటుంబాలకు అవసరమైన సమయంలో ఆర్థిక సహాయం అందించేలా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. పెంచిన బెనోవాలెంట్ ప్రయోజనాలపై కార్మికులు హర్షం వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో మానవ వనరుల విభాగం నిర్వాహకులు చాంద్ పాషా, వెంకట రామారావు, మురళి, సౌరబ్ ముఖర్జీ, నిధి కమిటీ సభ్యులు పాకాలపాటి దుర్గాప్రసాద్, పీవీ చందు, గాదె రామ కోటిరెడ్డి, సముద్రాల అనిల్ కుమార్‌తో పాటు గుర్తింపు సంఘం కార్యవర్గ సభ్యులు, కాంట్రాక్ట్ కార్మిక సంఘం నాయకులు నరేంద్ర, నిరంజన్, సోమిరెడ్డి, వెంకటరెడ్డి, సర్వేశ్వరరావు, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

# శ్రీ వెంకటేశ్వర దేవాలయ నిర్మాణానికి కొత్తగూడెం పేరు పెట్టాలని డిమాండ్

### అఖిలపక్ష నేతలు అదనపు కలెక్టర్ పి.శ్రీజకువినతి



**ఖమ్మం టౌన్,ప్రభాతవార్త,అక్టోబర్ 05 :** కొత్తగూడెం రెవెన్యూ పరిధిలో టీటీడీ ఆధ్వర్యంలో నిర్మిస్తున్న శ్రీ వెంకటేశ్వర స్వామి దేవాలయం, కళ్యాణ మండపం మరియు ఇతర నిర్మాణాలకుసంబంధించిన శిలాఫలకాలపై కొత్తగూడెం పేరు పెట్టాలని ఖమ్మం నగరంలోని కొత్తగూడెం ప్రాంతానికి చెందిన 14వ మరియు 15వ డివిజన్ల అఖిలపక్ష నేతలు. పగడాల మల్లేష్,యర్రబోయిన గోవిందరావు, చేతుల నాగేశ్వరరావు, మెర్రిమేకల కోటయ్య, రావుల హనుమంతరావు, డిమాండ్ చేస్తూ ఈరోజు ఖమ్మం జిల్లా అదనపు కలెక్టర్ డాక్టర్ టి. శ్రీజకు వినతి పత్రం అందజేశారు, ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ. కొత్తగూడెం రెవెన్యూ పరిధిలో తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) ఆధ్వర్యంలో శ్రీ వెంకటేశ్వర స్వామి వారి దేవాలయం,కళ్యాణ మండపం తదితర నిర్మాణాలు చేపడుతున్న విషయం విదితమే. అయితే, ఈ నిర్మాణాలకుసంబంధించి పత్రికా మరియు ఇతర ప్రచార మాధ్యమాలలో ఈ ప్రాంతాన్ని అల్లీపురం పేరుతో పేర్కొనడం స్థానిక ప్రజల దృష్టికి వచ్చిందని తెలిపారు. వాస్తవానికి, దేవాలయ నిర్మాణం జరుగుతున్న స్థలం, పి.బి. నగర్ ప్రాంతం మరియు సంబంధిత భూములు, సర్వే నంబర్లు అన్నీ కొత్తగూడెం రెవెన్యూ పరిధిలోనే ఉన్నాయన్నారు. అటువంటప్పుడు, కొత్తగూడెం ప్రాంతంలో నిర్మిస్తున్న ఇంతటి ప్రతిష్ఠాత్మకమైన ఆధ్యాత్మిక కట్టడాలకు అల్లీపురం పేరును మాత్రమే ప్రస్తావించడం వల్ల స్థానిక ప్రజలలో కొంత అసంతృప్తి నెలకొంటోంది ఆవేదన వ్యక్తం చేశారు. ఇది కొత్తగూడెం ప్రాంత ప్రజల మనోభావాలకు సంబంధించిన అంశంగా మారిందని ఈ ప్రాంత ప్రజల ఆకాంక్షలను మరియు వాస్తవ రెవెన్యూ పరిధిని పరిగణనలోకితీసుకొని, టీటీడీ ఆధ్వర్యంలో నిర్మిస్తున్న శ్రీ వెంకటేశ్వర స్వామి దేవాలయం, కళ్యాణ మండపంమరియు ఇతర నిర్మాణాలకు సంబంధించిన శిలాఫలకాలు, ప్రారంభోత్సవ ఫలకాలు, అధికారికార్డులు, ప్రచార ప్రకటనలు మరియు ఇతరత్రా అన్ని సందర్భాలలో ఖికొత్తగూడెంఖి లేదాఖికొత్తగూడెం అల్లీపురం రోడ్డుఖి అనే పేరును స్పష్టంగా పొందుపరచాలని డిమాండ్ చేశారు. ఈ విషయమై కొత్తగూడెం ప్రాంత ప్రజలు అఖిలపక్ష నాయకులు, ప్రజాప్రతినిధులు మరియు స్థానిక పెద్దల సమక్షంలో చర్చించి, ఏకాభిప్రాయంతో తీర్మానం చేయడం జరిగిందని గౌరవ మంత్రి వర్యులు ఈ విషయాన్ని ప్రత్యేకంగా పరిశీలించి, సంబంధిత అధికారులకు తగిన ఆదేశాలు జారీ చేసి,కొత్తగూడెం ప్రాంత ప్రజల మనోభావాలను గౌరవించే విధంగా చూడాలని కోరారు. ఈ కార్యక్రమంలో కొత్తగూడెం అఖిల పక్ష నాయకులు మాకెనబోయిన నాగేశ్వరరావు, పల్లెబోయిన పుల్లారావు, బొమ్మిశెట్టి లక్ష్మీ నర్సయ్య, పొదిల ఉపేందర్, యర్రబోయిన వెంకటయ్య, నాగటి శేషయ్య, పర్వత సైదులు, పొదిల రామారావు, బొమ్మిశెట్టి భాస్కర్, చామకూరి శంకర్, చిర్ర శంకర్, పడగాల వెంకటేశ్వర్లు, దంతాల నాగరాజు, షేక్.మీరా, జొన్నలగడ్డ వెంకటేశ్వర్లు, లింగనబోయిన దాసు, బండ్ల వెంకటేశ్వర్లు, కర్రి కృష్ణ,మెర్రిమేకల వెంకటనారాయణ, అమరయ్య, చిగంటి శ్రీను, పగడాల అనంతరాములు, తదితరులు పాల్గొన్నారు.

### విద్యుత్ కోతలను నివారించాలని

# అర్హులైన వారికి పెన్షన్లను వెంటనే మంజూరు చేయాలి

### కలెక్టరేట్ వద్ద మాస్ లైన్ ధర్నా



**ఖమ్మం టౌన్,ప్రభాతవార్త,అక్టోబర్ 05:** జిల్లాలో విద్యుత్ కోతలు పెరగటానికి, నిత్యావసరసరుకుల ధరలు విపరీతంగా పెరగడానికి, వేయి రోజుల పరిపాలన లో అర్హులందరికీ పెన్షన్లు ఇవ్వలేకపోవడానికి, కేంద్ర ప్రభుత్వ నూతన విద్యుత్ సవరణ చట్టం పేరుతో విద్యుత్ మీటర్లు బిగించడం లాంటి సమస్యల వలన ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవడానికి రాష్ట్ర ప్రభుత్వమే బాధ్యత వహించాలని సిపిఐ ఎంఎల్ మాస్ లైన్ జిల్లా కార్యదర్శి సి వై.పుల్లయ్య విమర్శించారు. సోమవారం జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద పార్టీ రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు నిరసన ధర్నా ను జిల్లా కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా డి పుల్లయ్య మాట్లాడుతూ, జిల్లాలో మునుపెన్నడూ లేనివిధంగా విద్యుత్ కోతలు పెరగటం వలన ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, కరెంటు కోతల వలన నీరు లేక రైతాంగం వేసిన పంటలు నిండిపోతున్నాయని, కౌలు రైతులు పెట్టిన పెట్టుబడులు రాక అప్పుల పాలై ఆత్మహత్యలు చేసుకుంటున్నారనారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారానికి రావడానికి ముందు ఓట్ల కోసం ప్రజలకు 420 వాగ్దానాలు చేశారని, పెన్షన్లు ఇవ్వడంలో విఫలమైనారని, అర్హులైన వృద్ధులు, వికలాంగులు, వితంతువులు, తల సేమియా బాధితులు, అనాధలందరికి పెన్షన్లు ఇస్తానని సంవత్సరాల తరబడి కాలయాపన చేస్తూ ఇబ్బందులు పెడుతున్నారని ఆయన విమర్శించారు. నిత్యావసర సరుకుల ధరలు నేడు ఆకాశాన్ని అంటే విధంగా పెంచడం వలన సామాన్య, మధ్యతరగతి ప్రజలు తమకు వచ్చే అల్పాదాయంతో కొనలేని అర్థాకలి తో జీవించాల్సిన స్థితి దా పురించిందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వం తీసుకొస్తున్న నూతన విద్యుత్ సవరణ చట్టం లో భాగంగా వినియోగదారుల ఇండ్లకు మీటర్ల బిగించే విధానం వలన అధికంగా చార్జీల భారం మోపి,బలవంతంగా వసూలు చేసే చర్యలకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు పూను కోవటం దారుణమని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజలపై భారాలు మోపడం, ప్రజా సమస్యలను గాలికి వదిలేయడం చేస్తూ పోతే ప్రజలు తగిన బుద్ధి చెప్తారని ఆయన హెచ్చరించారు. అనంతరం జిల్లా జాయింట్ కలెక్టర్ శ్రీజ గారికి సమస్యలతో కూడిన వినతి పత్రం ఇవ్వడం జరిగింది, ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఆవుల వెంకటేశ్వర్లు, జి.రామయ్య,బందెల వెంకయ్య,ఆవుల అశోక్, జిల్లా నాయకులు సిహెచ్ శిరోమణి, ఎస్ కె లాల్ మియా,తిమ్మిడి హనుమంతరావు, టీ ఝాన్సీ,పి శోభ, కె శ్రీనివాస్,సోమనపల్లి వెంకటేశ్వర్లు, రెంటాల ల యాదగిరి,బానోత్ శంకర్, గుడుమట్టూ మాధవరావు, ,గోగుల సోములు, సత్తార్ మియా, పరికపల్లి మధు, బొమ్మకంటి రమేష్, కొత్తపల్లి చిన్నశివ పాల్గొన్నారు.




# యువతలో ఆత్మవిశ్వాసం అవసరం

### ప్రియదర్శిని విద్యాసంస్థల చైర్మన్ కాటేపల్లి నవీన్ బాబు

### ప్రియదర్శిని లో వ్యక్తిత్వ వికాస అవగాహన కార్యక్రమం

**ఖమ్మం అక్టోబర్ 5, ప్రభాత వార్త:**




ప్రియదర్శిని గ్రూప్ ఆఫ్ ఇన్స్టిట్యూషన్స్ ఆధ్వర్యంలో "ఇన్స్పైర్ ఇగ్నైట్ – ఇన్స్పైరింగ్ మైండ్స్ – ఇగ్నైటింగ్ సోల్స్" అనే యువత రూపాంతర కార్యక్రమంలో భాగంగా విద్యార్థినుల కోసం వ్యక్తిత్వ వికాస కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసం, నాయకత్వ లక్షణాలు, కమ్యూనికేషన్ నైపుణ్యాలు, సానుకూల ఆలోచనా విధానం, లక్ష్య సాధనపై అవగాహన కల్పించడం కార్యక్రమం ప్రధాన ఉద్దేశ్యంగా నిలిచింది. ఈ సందర్భంగా కళాశాల చైర్మన్ కాటేపల్లి నవీన్ బాబు మాట్లాడుతూ, విద్యార్థులు కేవలం విద్యా పరంగా మాత్రమే కాకుండా వ్యక్తిత్వ వికాసం, నైతిక విలువలు, నాయకత్వ లక్షణాలు, సామాజిక బాధ్యత వంటి అంశాల్లోనూ అభివృద్ధి చెందాలని అన్నారు. ప్రతి విద్యార్థిలోనూ ప్రత్యేకమైన ప్రతిభ దాగి ఉంటుందని, దానిని గుర్తించి సరైన దిశలో వినియోగించుకున్నప్పుడు జీవితంలో ఉన్నత స్థాయికి చేరుకోవచ్చని పేర్కొన్నారు. "ఆత్మవిశ్వాసంతో ముందడుగు వేస్తే అవకాశాలు మనకు అనుకూలంగా మారుతాయి" అని అన్నారు. ప్రిన్సిపాల్ డా. బి. గోపాల్ మాట్లాడుతూ, ప్రస్తుత పోటీ ప్రపంచంలో అకడమిక్ ప్రతిభతో పాటు వ్యక్తిత్వ వికాసం ఎంతో అవసరమని తెలిపారు. కమ్యూనికేషన్ స్కిల్స్, సమస్య పరిష్కార సామర్థ్యం, టీమ్ వర్క్, సమయపాలన, నిర్ణయాలు తీసుకునే నైపుణ్యం వంటి అంశాలను విద్యార్థులు నిరంతరం అభివృద్ధి చేసుకోవాలని సూచించారు. ప్రతి అవకాశాన్ని నేర్చుకునే అవకాశంగా తీసుకుని, తమలోని ప్రతిభను వెలికితీసుకోవాలని అన్నారు. సుధాకర్ దిండి మాట్లాడుతూ, విద్యార్థులు తమలోని ప్రతిభను గుర్తించి నిరంతరం అభివృద్ధి చేసుకోవాలని అన్నారు. కమ్యూనికేషన్, ప్రెజెంటేషన్, నాయకత్వం వంటి నైపుణ్యాలను అభ్యసించడం ద్వారా ఉద్యోగ అవకాశాలను మరింతగా పెంచుకోవచ్చని తెలిపారు. రంజిత్ దాసరి ,శ్రీ రామ్ ఉప్పు ,అకడమిక్ డైరెక్టర్ ఏ. వెంకట రమణ , ఇన్స్టిట్యూషన్స్ విభాగా ధిపతులు, అధ్యాపకులు, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు .



### రఘునాథపాలెం పోలీస్ స్టేషన్ సీఐగా కరుణాకర్ బాధ్యతల స్వీకరణ

**రఘునాథపాలెం,ప్రభాతవార్త అక్టోబర్ 5:**



రఘునాథపాలెం పోలీస్ స్టేషన్ సీఐ గా కరుణాకర్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. సోమవారం జరిగిన సీఐ ల బదిలీల్లో ఖమ్మం వన్ టౌన్ సిఐ గా ఉన్న ఆయనను ఉన్నతాధికారులు రఘునాథపాలెం పోలీస్ స్టేషన్ కు కేటాయించారు. సోమవారం బాధ్యతలు స్వీకరించిన అనంతరం ఆయన పోలీస్ కమిషనర్ సునీల్ దత్ ను మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు.

# కోర్టు తీర్పునిచ్చిన భూమిలోనూ అక్రనిర్మాణాలు

**రఘునాథపాలెం, ప్రభాతవార్త అక్టోబర్ 5:** మండల కేంద్రంలోని చింతగుర్తి గ్రామ పరిధిలోని వివాదాస్పద భూమికి సంబంధించి కోర్టు వారు తీర్పు ఇచ్చినప్పటికీ, ఆ భూమిలో అక్రమ నిర్మాణాలు యథేచ్ఛగా సాగుతున్నాయని చింతగుర్తి గ్రామానికి చెందిన బాధితుడు వల్లూరి సాయి నందన్ ఆవేదన వ్యక్తం చేశారు. చింతగుర్తి గ్రామ పరిధిలోని సర్వే నెం. 220/3 లో ఒక ఎకరం, 220/6 లో 1ఎకరం, 20 కుంటల భూమి తమకు వారసత్వంగా వచ్చిందని, దానిని కొందరు కబ్జా చేయగా 2022 మే నెలలో కోర్టును ఆశ్రయించామని తెలిపారు. కేసు నెం



వీతీ.వ్చి. 594/2022 కు సంబంధించి కోర్టు వారు 24072026 తేదీన తీర్పు వెల్లడించారని, ఆ తీర్పు ప్రకారం ఈ భూమి తమకు మాత్రమే చెందుతుందని కోర్టు స్పష్టం చేసిందని బాధితుడు తెలిపారు. అయితే కోర్టు తీర్పు వచ్చిన తర్వాత కూడా దౌర్జన్యంగా ఆ భూమిలో ఇళ్లు, రోడ్లు తదితర అక్రమ నిర్మాణాలు జరుగుతున్నాయని, వాటిని వెంటనే ఆపేలా చర్యలు తీసుకోవాలని కోరుతూ రఘునాథపాలెం మండల ఎంపీడీవో గారికి లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశారు. కోర్టు తీర్పు కాపీని ఫిర్యాదుకు జత చేశారు. ఈ విషయమై తాను చింతగుర్తి గ్రామ పంచాయతీ కార్యదర్శికి ఫిర్యాదు కాపీలు ఇవ్వగా, ఆయన తీసుకొనుటకు నిరాకరించారని తెలిపారు. కారణాలేమిటో తెలుసుకొని ఈ విషయంపై తగిన చర్యలు తీసుకుని తమకు న్యాయం చేయాలని బాధితుడు కోరుతున్నాడు.




# సింగరేణి లాభాల వాటా వెంటనే ప్రకటించాలి

## 36 శాతం కార్మికుల వాటాగా చెల్లించాలి: టీబీజీకేఎస్

**రుద్రంపూర్, అక్టోబర్ 5 ప్రభాతవార్త:**



సింగరేణి 2025–26 వార్షిక నికర లాభాలను వెంటనే వెల్లడించి, అందులో 36 శాతం కార్మికుల వాటాగా చెల్లించాలని టీబీజీకేఎస్ రాష్ట్ర ముఖ్య ప్రధాన కార్యదర్శి కాపు కృష్ణ డిమాండ్ చేశారు. సోమవారం కొత్తగూడెం ఏరియాలోని గనులు, వివిధ విభాగాల మేనేజర్లు, డిపార్ట్‌మెంట్ హెడ్‌లకు సంఘం ఆధ్వర్యంలో వినతిపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా కాపు కృష్ణ మాట్లాడుతూ.. కార్మికులు రక్తాన్ని చిందించి సాధించిన బొగ్గు విక్రయాల ద్వారా వచ్చిన నికర లాభాలను వెంటనే ప్రకటించాలని కోరారు. కాంగ్రెస్ ప్రభుత్వం గత రెండేళ్లలో లాభాల వాటా విషయంలో కార్మికులకు అన్యాయం చేసిందని ఆరోపించారు. సుమారు రూ.6,300 కోట్లను సంస్థ అభివృద్ధి కోసం పక్కన పెట్టినట్లు చెబుతున్నప్పటికీ, వాటి వివరాలపై అనేక అనుమానాలు ఉన్నాయన్నారు. గనుల్లో రక్షణ పరికరాల కొరత ఉందని, డ్రిల్ బిట్లు, డ్రిల్ రాడ్లు, రూఫ్ బోల్టింగ్ సామగ్రి అందుబాటులో లేకపోవడంతో కార్మికుల భద్రతకు ముప్పు ఏర్పడుతోందని ఆరోపించారు. శవల్స్, దంపర్లు, డోజర్లు వంటి అవసరమైన యంత్రాలను కొత్తగా కొనుగోలు చేయకపోవడంతో ఉత్పత్తిపై ప్రభావం పడుతోందన్నారు. మెడికల్ బోర్డుల నిర్వహణలోనూ కార్మికులకు అన్యాయం జరుగుతోందని పేర్కొన్నారు. లాభాల వాటా చెల్లింపు తేదీని తక్షణమే ప్రకటించకపోతే సింగరేణి కార్పొరేట్ కార్యాలయంతో పాటు ప్రజాభవన్‌ను ముట్టడిస్తామని కాపు కృష్ణ హెచ్చరించారు. కార్మిక సంఘాలు పరస్పర విమర్శలు మానుకుని, సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వంపై సంఘటితంగా ఒత్తిడి తీసుకురావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో టీబీజీకేఎస్ కొత్తగూడెం ఏరియా వైస్ ప్రెసిడెంట్ గడప రాజయ్యతో పాటు కాగితపు విజయ్‌కుమార్, బూర్గుల రవికుమార్, బోరింగ్ శంకర్, ఎంటెక్ మహేందర్, నమల్ల వెంకటేశ్వర్లు, గోల్కొండ నవీన్, అలీమ్, అజీజ్, దేవ్‌సింగ్, వెంకట్రావు, సంతోష్, రాజ్‌కుమార్, తిరుపతి, పాషా, నిశాంత్, ప్రవీణ్, శివ, సందీప్, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

## సకాలంలో హాజరైన 22 శాఖల మండల స్థాయి అధికారులు

**పాల్వంచ,అక్టోబర్ 5,ప్రభాత వార్త:**



పాల్వంచ మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన మండల ప్రజావాణి కార్యక్రమానికి అన్ని శాఖల అధికారులు సకాలంలో హాజరయ్యారు. మొత్తం 22 మంది మండల స్థాయి అధికారులు ఈ కార్యక్రమంలో పాల్గొని, ప్రజల నుంచి వచ్చిన సమస్యలు, వినతులను స్వీకరించారు. ప్రజావాణిలో మండల పంచాయతీ అధికారికు ఒక దరఖాస్తు అందగా, సంబంధిత వినతుల పరిష్కారానికి తగిన చర్యలు తీసుకుంటామని అధికారులు హాజరైన వారికి హామీ ఇచ్చారు. ప్రజల సమస్యలను సత్వరమే పరిష్కరించేందుకు శాఖలన్నీ సమన్వయంతో పనిచేయాలని ఈ సందర్భంగా అధికారులు సూచించారు. ప్రజావాణి ద్వారా ప్రభుత్వ శాఖల సేవలు ప్రజలకు మరింత చేరువవుతున్నాయని వారు పేర్కొన్నారు.

## అమ్మ అంటే నడిచే దైవం దుర్గమ్మతల్లి

### దసరా నవరాత్రుల కర్ర పూజల్లో పాల్గొన్న కొత్వాల దంపతులు

**పాల్వంచ టౌన్, అక్టోబర్ 5 ప్రభాతవార్త:**



అమ్మ అంటే నడిచే దైవం దుర్గమ్మతల్లి అని డీసీఎంఎస్ మాజీ ఛైర్మన్, రాష్ట్ర మార్క్‌ఫెడ్ మాజీ డైరెక్టర్, పాల్వంచ కోఆపరేటివ్ సొసైటీ ఛైర్మన్ కొత్వాల శ్రీనివాసరావు అన్నారు. శ్రీదేవి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా సోమవారం పాల్వంచలోని పలు ప్రాంతాల్లో నిర్వహించిన కర్ర పూజల్లో ఆయన, 46వ డివిజన్ కార్పొరేటర్ కొత్వాల విమలాదేవితో కలిసి పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. బొల్లోరిగూడెంలోని భద్రకాళి యూత్, వెంగళరావు కాలనీ, చాకలి బజార్ యూత్ ఆధ్వర్యంలో, హైస్కూల్ రోడ్డులో నిర్వహించిన పూజల్లో పాల్గొన్న కొత్వాల మాట్లాడుతూ.. భక్తులు నియమనిష్ఠలతో అమ్మవారిని పూజించి ఆమె కృపాకటాక్షాలు పొందాలని ఆకాంక్షి ంచారు. డిప్యూటీ మేయర్ సిరిపురపు లలితకుమారి, కార్పొరేటర్లు డాక్టర్ బీఎస్ రావు, సీరపు సుగుణారెడ్డి, నూకల సరిత, మాలంపాటి భవిత, హోళి శ్రీనివాసరావు, దాంతేబోయిన నరేష్, నాయకులు చింతా నాగరాజు, బాడిశ శంకర్‌రావు పాల్గొన్నారు.

## 25 ఏళ్లుగా మౌలిక వసతులకు దూరం

**సారపాక, ప్రభాతవార్త:**



మోతె గ్రామపంచాయతీ శివారు చింతకుంట గిరిజన గ్రామంలో సుమారు 40 కుటుంబాలు 25 ఏళ్లుగా నివసిస్తున్నా రోడ్డు, విద్యుత్, అంగన్‌వాడీ వంటి కనీస సౌకర్యాలు అందలేదని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేశారు. సమస్యలపై పలుమార్లు అధికారులకు దరఖాస్తులు ఇచ్చినా పరిష్కారం కాలేదన్నారు. విద్యుత్ లేక రాత్రివేళ చీకట్లోనే జీవనం సాగిస్తున్నామని, విద్యార్థులు చదువుకోవడానికి సుమారు ఏడు కిలోమీటర్లు వెళ్లాల్సి వస్తోందని తెలిపారు. చింతకుంటను సందర్శించిన సీపీఐ జిల్లా సమితి సభ్యులు పేరాల శ్రీనివాసరావు గ్రామస్థుల సమస్యలను తెలుసుకున్నారు. అధికారులు తక్షణమే స్పందించి మౌలిక వసతులు కల్పించాలని డిమాండ్ చేశారు. సమస్యలు పరిష్కరించకపోతే సీపీఐ ఆధ్వర్యంలో దశలవారీగా ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు.

## I ఆఫ్ 70 చట్టాన్ని పకడ్బందీగా అమలు చేయాలి

### ప్రజావాణిలో డీఆర్‌డీఓకు సేవాలాల్ బంజారా సంఘం వినతి

**చుంచుపల్లి, అక్టోబర్ 5 ప్రభాతవార్త:**



ఏజెన్సీ ప్రాంతాల్లో 1/70 చట్టాన్ని పకడ్బందీగా అమలు చేయాలని కోరుతూ సేవాలాల్ బంజారా సంఘం ఆధ్వర్యంలో సోమవారం జిల్లా కలెక్టరేట్‌లోని ప్రజావాణిలో డీఆర్‌డీఓ విద్యాచందనకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లావుడియా ప్రసాద్ నాయక్ మాట్లాడుతూ.. చుంచుపల్లి మండలం విద్యానగర్ గ్రామపంచాయతీ పరిధిలో ఏజెన్సీ చట్టాల అమలులో నిరక్ష ్యం జరుగుతోందని ఆరోపించారు. పంచాయతీ అనుమతులు లేకుండానే జీ+3, జీ+4 బహుళ అంతస్తుల నిర్మాణాలు జరుగుతున్నాయని, దీనిపై పలుమార్లు ఫిర్యాదులు చేసినా చర్యలు తీసుకోవడం లేదని పేర్కొన్నారు. ఏజెన్సీ ప్రాంతాల్లో అమలులో ఉన్న 1/70 చట్టాన్ని కఠినంగా అమలు చేసి, నిబంధనలకు విరుద్ధంగా జరుగుతున్న నిర్మాణాలపై విచారణ చేపట్టాలని కోరారు. విద్యానగర్ పెట్రోల్ బంక్ ఎదురుగా ఉన్న వి–2 బహుళ అంతస్తు నిర్మాణంపై కూడా చర్యలు తీసుకోవాలని వినతిపత్రంలో కోరారు. కార్యక్రమంలో సేవాలాల్ బంజారా సంఘం జిల్లా అధ్యక్షుడు నూనావత్ రాంబాబు నాయక్, అనిల్ నాయక్, రవి నాయక్, శ్రీను నాయక్ తదితరులు పాల్గొన్నారు.

## అంగన్‌వాడీ ఆయా పోస్టులకు పదో తరగతి అర్హతే ఉండాలి

### ప్రజావాణిలో డీఆర్‌డీఓకు గోర్ బంజారా పోరాట సమితి వినతి

**కొత్తగూడెం టౌన్, అక్టోబర్ 5 ప్రభాతవార్త:**



అంగన్‌వాడీ ఆయా పోస్టులకు విద్యార్హతను పదో తరగతిగా మాత్రమే నిర్ణయించాలని కోరుతూ భారతీయ గోర్ బంజారా పోరాట సమితి ఉమ్మడి ఖమ్మం జిల్లా అధ్యక్షుడు బానోత్ దుర్గాప్రసాద్ నాయక్ ఆధ్వర్యంలో సోమవారం కలెక్టరేట్‌లో జరిగిన ప్రజావాణిలో డీఆర్‌డీఓ విద్యాచందనకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా దుర్గాప్రసాద్ నాయక్ మాట్లాడుతూ.. అంగన్‌వాడీ టీచర్ పోస్టుకు ఇంటర్మీడియట్ అర్హత ఉండగా, ఆయా పోస్టుకు కూడా అదే అర్హత నిర్ణయించడం వల్ల పేద గిరిజన మహిళలకు అన్యాయం జరుగుతుందని అన్నారు. ఏజెన్సీ ప్రాంతాల్లో అనేక మంది గిరిజన మహిళలు పదో తరగతి వరకు మాత్రమే చదువుకున్నారని, ఇంటర్మీడియట్ అర్హత విధిస్తే వారికి ఉద్యోగ అవకాశాలు దూరమవుతాయని పేర్కొన్నారు. పేద గిరిజన మహిళల పరిస్థితులను పరిగణనలోకి తీసుకుని అంగన్‌వాడీ ఆయా పోస్టులకు పదో తరగతినే కనీస విద్యార్హతగా నిర్ణయించాలని కోరారు. తమ వినతిపై డీఆర్‌డీఓ సానుకూలంగా స్పందించినట్లు దుర్గాప్రసాద్ నాయక్ తెలిపారు. కార్యక్రమంలో గిరిజన మహిళలు పాల్గొన్నారు.

# సింగరేణి కార్మికుల పండుగ అడ్వాన్స్ పెంచాలి

### జీఎంకు ఐఎన్‌టీయూసీ వినతి

**రుద్రంపూర్ అక్టోబర్ 5 ప్రభాతవార్త :**



సింగరేణి కార్మికులకు ప్రస్తుతం ఇస్తున్న రూ.25 వేల పండుగ అడ్వాన్స్‌ను పెంచాలని కోరుతూ ఐఎన్‌టీయూసీ కొత్తగూడెం ఏరియా వైస్ ప్రెసిడెంట్ ఎం.డి. రజాక్ ఆధ్వర్యంలో యూనియన్ నాయకులు ఏరియా జనరల్ మేనేజర్ సీహెచ్. వెంకటరమణకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రజాక్ మాట్లాడుతూ.. నిత్యావసరాలు, పండుగ వస్త్రాల ధరలు పెరిగిన నేపథ్యంలో ప్రస్తుత రూ.25 వేల అడ్వాన్స్ కార్మికుల అవసరాలకు సరిపోవడం లేదన్నారు. ఈ మొత్తాన్ని కార్మికుల నెలసరి జీతాల నుంచి రికవరీ చేస్తున్నందున అడ్వాన్స్‌ను పెంచాలని కోరారు. పెరిగిన అడ్వాన్స్‌తో కార్మికులు కుటుంబాలతో పండుగను సంతోషంగా జరుపుకోవడంతో పాటు సంస్థ అభివృద్ధికి మరింత ఉత్సాహంతో పనిచేస్తారని పేర్కొన్నారు. వినతిపై జీఎం వెంకటరమణ సానుకూలంగా స్పందించి, ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చినట్లు రజాక్ తెలిపారు. కార్యక్రమంలో ఎస్ఓటూజీఎం గోవిందరావు, ఏజీఎం (ఈఅండ్ఎం) వి. రామకృష్ణ, పీవీకే గ్రూప్ ఏజెంట్ రామ్ బరోస్ మహతోతో పాటు ఐఎన్‌టీయూసీ నాయకులు పాల్గొన్నారు.

# ఆర్టీసీని కాపాడుకుంటూ హక్కుల సాధనే ఈయూ కూటమి లక్ష్యం

## మధిరలో కూటమి నాయకుల ఎన్నికల ప్రచారం

మధిర అక్టోబర్ 5 ప్రభాతవార్త





కార్మికుల సంక్షేమం ఉద్యోగ భద్రత హక్కుల సాధన తో పాటు ఆర్టీసీ సంస్థను ప్రభుత్వంలో విలీనం చేసే లక్ష్యంతో ఎంప్లాయిస్ యూనియన్ కూటమి ఎన్నికల్లో పోటీ చేస్తున్నదని నాయకులు పేర్కొన్నారు. సోమవారం ఆర్టిసి ఎన్నికల ప్రచారంలో భాగంగా మధిర డిపో వద్ద నిర్వహించిన ఎన్నికల ప్రచార సభలో ఈయు రాష్ట్ర అధ్యక్షులు ఎస్. బాబు, నేషనల్ మజ్దూర్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.డి. మోలానా, ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి పాటి అప్పారావు, ఖమ్మం రీజియన్ కార్యదర్శి పిల్లి రమేష్, అధ్యక్షులు బి.ఎస్. రెడ్డి, సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు బెజవాడ రవిబాబు, ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి తోట రాంజనేయులు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, గత కొంతకాలంగా ఆర్టీసీ కార్మికుల సమస్యల పరిష్కారం కోసం ఎంప్లాయిస్ యూనియన్ నాయకత్వంలో జేఏసీ ఆధ్వర్యంలో అనేక పోరాటాలు నిర్వహించామని తెలిపారు. కార్మికుల హక్కులు, సంక్షేమం, ఉద్యోగ భద్రత, ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయాలనే డిమాండ్, పెండింగ్ సమస్యల పరిష్కారం వంటి అంశాలపై తమ కూటమి నిరంతరం పోరాడుతోందని పేర్కొన్నారు. అదేవిధంగా, గత పదేళ్ల కాలంలో ఆర్టీసీ కార్మికుల సమస్యలపై తమ నాయకత్వం నిర్వహించిన పోరాటాలను పక్కనపెట్టి, ఎన్నికల సమయంలో మాత్రమే కొత్త హామీలతో కార్మికుల ముందుకు వస్తున్న సంఘాలపై నాయకులు విమర్శలు చేశారు. గతంలో కార్మికుల సమస్యల పరిష్కారానికి వారు చేసిన కృషిపై కార్మికులు ప్రశ్నించాల్సిన అవసరం ఉందని అన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్న సమయంలో ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయడం, కార్మికుల దీర్ఘకాలిక సమస్యలను పరిష్కరించడం వంటి అంశాలపై మరింత స్పష్టమైన చర్యలు ఉండాల్సిందని వారు అభిప్రాయపడ్డారు. కూటమికి భారీ మెజార్టీతో గెలిపించాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు తిమ్మినేని రామారావు, అరుణకుమారి, రామచంద్ర రావు, ఎల్.ఆర్.కె. రావు,. తిరుపతిరావు, ఆళ్ల శంకర్రావు , డిపో కార్యదర్శి కె.ఉపేందర్ రెడ్డి , రామిరెడ్డి మధిర డిపో అధ్యక్ష కార్యదర్శులు ఎం. వెంకటేశ్వర్లు, నాగుల్ మీరా, రామకృష్ణ, సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

# ఓటు తొలగింపు జరక్కుండా చూడండి

## అఖిల పక్షం ఆధ్వర్యంలో తహసిల్దార్ కు వినతి పత్రం

## ఈసీ జ్ఞానేశ్ కుమార్ రాజీనామాకు డిమాండ్

## సర్ ప్రజాస్వామ్యానికే గొడ్డలిపెట్టు

పెనుబల్లి, అక్టోబర్ 5, ప్రభాతవార్త:



ఏ ఒక్కరి ఓటు కూడా తొలగింపుకు గురికాకుండా చూడాలని కోరుతూ పెనుబల్లి మండలం అఖిల పక్షం నాయకులు పెనుబల్లి తహసీల్దార్ ను కోరారు. మండల పరిషత్ కార్యాలయ ముందు సోమవారం ధర్నా నిర్వహించి తహసీల్దారుకు వినతి పత్రం అందచేశారు. ప్రత్యేక సమగ్ర సవరణ ( సర్ ) ను రద్దు చేయాలని, ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేసి తప్పుకోవాలని డిమాండ్ చేశారు. ఎన్నికల కమిషన్ అధికారు లఎంపిక కమిటీలో గతంలో మాదిరిగా సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తిని నియమించాలన్నారు. ఈ సందర్భంగా కాంగ్రెస్, సీపీఎం, సీపీఐ, సిపిఐ ( ఎం.ఎల్) మాస్ లైన్ రాజకీయ పార్టీల నాయకులు, పౌర హక్కుల సంఘం, రైతు సంఘం ప్రతినిధులు మాట్లాడుతూ దేశ పౌరులకు ఓటు హక్కు లేకుండా ప్రజాస్వామ్యం మనుగడ సాధ్యం కాదని అన్నారు. ప్రత్యేక సమగ్ర సవరణ పేరుతో కేంద్ర ప్రభుత్వం సృష్టిస్తున్న గందరగోళం వలన ప్రజల ఆందోళన చెందుతున్నారని, ఇప్పటికే సర్ మూలంగా 20 రాష్ట్రాల్లో 13 కోట్ల మంది ఓటు హక్కు కోల్పోయారని విమర్శించారు. ప్రధాన ఎన్నికల అధికారి జ్ఞానేశ్ కుమార్ ఏకపక్ష నిర్ణయాలు మూలంగా రాజ్యాంగం పౌరులకు కల్పించిన హక్కులకు భంగం కలుగుతుందని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షులు పంది వెంకటేశ్వరరావు, సీపీఎం, మాస్ లైన్ , సీపీఐ జిల్లా నాయకులు చలమాల విఠల్ రావు, బీరెల్లి లాజర్, పొదిల భాస్కర్, కాంగ్రెస్ నాయకులు చీకటి రామారావు, కీసర శ్రీనివాసరెడ్డి ,రాజబోయిన కోటేశ్వర రావు, గూడూరు మాధవరెడ్డి, ఈడా కమలాకర్ రావు, గంగదేవి పాడు సర్పంచ్ రాధాకృష్ణ, మిట్టపల్లి కిరణ్ కుమార్, మేకతొట్టి కాంతయ్య, వంగా నిరంజన్, గోదా చెన్నారావు, పౌర హక్కుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కాటినేని శ్రీనివాసరావు, రైతు సంఘం జిల్లా నాయకులు చిట్టి మోదుల కృష్ణ, నల్లమల అరుణ ప్రతాప్ తదితరులు పాల్గొన్నారు.

# పచ్చదనం పెంపొందించడమే లక్ష్యం

## ఇంటింటికీ మొక్కల పంపిణీ

## ప్రతి ఇంటా మొక్కలు నాటాలి

ప్రభాత వార్త ఖమ్మం రూరల్:



ఎదులాపురం మున్సిపాలిటీ పరిధిలోని 9వ వార్డులో ఇంటి ఆవరణ మొక్కల (హోమ్‌స్టెడ్ ప్లాంట్స్) పంపిణీ కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. వార్డులో పచ్చదనం పెంపొందించడం తోపాటు పర్యావరణ పరిరక్షణపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. 9వ వార్డు కౌన్సిలర్ కందుకూరి శేషమ్మ వెంకటనారాయణ సమన్వయంతో వార్డు అధికారులు, రిసోర్స్ పర్సన్స్ (ఆర్‌పీలు), పారిశుధ్య సిబ్బంది సహకారంతో ఇంటింటికీ మొక్కలను పంపిణీ చేశారు. ప్రజలకు మొక్కలను అందజేసి వాటి పెంపకం, సంరక్షణపై సూచనలు చేశారు. ఇంటి ఆవరణలో మొక్కలు నాటడం వల్ల పచ్చదనం పెరగడంతోపాటు పరిసరాలు ఆహ్లాదకరంగా మారుతాయని వివరించారు. ఈ సందర్భంగా కౌన్సిలర్ శేషమ్మవెంకటనారాయణ మాట్లాడుతూ.. పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని, ప్రతి ఇంటి ఆవరణలో మొక్కలు నాటి వాటిని సంరక్షించాల్సిన అవసరం ఉందని అన్నారు. మొక్కలు నాటడంతోనే బాధ్యత పూర్తికాదని, వాటికి క్రమం తప్పకుండా నీరు పోస్తూ సంరక్షించాలని సూచించారు. వార్డులో పచ్చదనం పెంపొందించేందుకు ప్రజల భాగస్వామ్యం ఎంతో అవసరమని తెలిపారు. మొక్కలను స్వీకరించిన వార్డు ప్రజలు వాటిని తమ ఇళ్ల ఆవరణలో నాటి క్రమం తప్పకుండా నీరు పోసి సంరక్షిస్తామని తెలిపారు. ప్రతి ఇంటిలో మొక్కలు పెంచేలా ప్రజలను ప్రోత్సహించడంతో వార్డును పచ్చదనంతో నింపేందుకు కృషి చేస్తున్నట్లు కౌన్సిలర్ పేర్కొన్నారు. కార్యక్రమంలో వార్డు అధికారులు, రిసోర్స్ పర్సన్స్, పారిశుధ్య సిబ్బంది, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.




# ఓటు చోరీని అరికట్టాలి.

## ఎన్నికల కమిషనర్ రాజీనామా చేయాలి

## ముదిగొండలో అఖిలపక్ష సమావేశం..

## 8న ఖమ్మంలో నిరసన ర్యాలీని విజయవంతం చేయాలని పిలుపు



ముదిగొండ, ప్రభాతవార్త:

ముదిగొండ మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీ కార్యాలయంలో సోమవారం కాంగ్రెస్, సీపీఎం, సీపీఐ, టీడీపీ పార్టీల ఆధ్వర్యంలో అఖిలపక్ష సమావేశం నిర్వహించారు. కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ఆధ్వర్యంలో ఓటు చోరీ జరుగుతోందని ఆయా పార్టీల నాయకులు ఆరోపించారు. ఈ తరహా చర్యలను అరికట్టేందుకు ఇండియా కూటమిలోని అన్ని పార్టీలు ఐక్యంగా ఉద్యమించాలని సమావేశంలో పిలుపునిచ్చారు. కేంద్ర ఎన్నికల సంఘం ప్రధాన కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలని సమావేశంలో డిమాండ్ చేశారు. ఈ నెల 8న ఖమ్మం పట్టణంలో ఇండియా కూటమి ఆధ్వర్యంలో నిర్వహించనున్న భారీ నిరసన ర్యాలీని విజయవంతం చేయాలని సమావేశం తీర్మానించింది. ప్రజాస్వామ్య పరిరక్షణ, ఓటు హక్కు రక్షణ కోసం రాజకీయ పార్టీలన్నీ సమన్వయంతో ముందుకు సాగాలని నాయకులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమం లో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు గుడిపూడి బుచ్చిరామయ్య, సీపీఎం మండల కార్యదర్శి బట్టు పురుషోత్తం, సీపీఐ మండల కార్యదర్శి రావులపాటి శ్రీనివాసరావు, టీడీపీ కార్యదర్శి బొడ్డు రామారావు, ముదిగొండ సర్పంచ్ కట్టకూరు ఉపేందర్, సువర్ణాపురం సర్పంచ్ పసుపులేటి నాసరయ్య, మధిర పీసీసీ ఇన్‌ఛార్జి మల్లెల అజయ్, ఉసికల రమేష్, మాజీ వైస్ ఎంపీపీ మంకెన దామోదర్, కొమ్ము నరసింహారావు, మందరపు వెంకన్న, మందరపు శ్రీనివాసరావు, పోతురాజు పురుషోత్తం, కోరుట్ల పద్మ, పసుపులేటి రమ తదితరులు పాల్గొన్నారు.

## సీపీఎస్ ఉపాధ్యాయులకు సంఘంలో ప్రాతినిధ్యం కల్పించాలి

## పిఆర్టియు రాష్ట్ర నాయకత్వానికి వినతి

కూసుమంచి, అక్టోబర్ 5 (ప్రభాతవార్త ) :



ప్రభుత్వ పాఠశాలల్లో సిపిఎస్ ఉద్యోగుల సంఖ్య గణనీయంగా పెరిగినందున ఓపిఎస్ పునరుద్ధరణతో పాటుగా పిఆర్టియు లో సిపిఎస్ ఉపాధ్యాయులకి ప్రాతినిధ్యం ఇవ్వాలని సిపిఎస్ బృందం ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పింగళి శ్రీపాల్ రెడ్డి, పిఆర్టియు జిల్లా అధ్యక్షుడు కట్టా శేఖర్ కి ఉపాధ్యాయులు సోమవారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సిపిఎస్ రద్దు, ఓపిఎస్ పునరుద్ధరణతో పాటు ఉపాధ్యాయుల సమస్యలను సంఘం ప్రధాన ఎజెండాలో చేర్చి, ప్రభుత్వంపై మరింత ఒత్తిడి తీసుకురావాలని కోరారు. ఈ కార్యక్రమంలో కూసుమంచి మండల అధ్యక్షులు శీలం ఆంజనేయులు, తల్లాడ మండల ప్రధాన కార్యదర్శి గోపాలకృష్ణ, వైరా మండల అధ్యక్షులు వెలిశెట్టి నరసింహారావు, ప్రధాన కార్యదర్శి గోవర్ధన్ రెడ్డి, బాధ్యులు బత్తుల ఉపేందర్ రావు, ముత్యాల ఆనంద్ బాబు, తదితరులు పాల్గొన్నారు.

# ఆర్అండ్‌బి రహదారిపై దుమ్ము తుఫాన్..!

**గుంతలలో పోసిన మట్టి ప్రయాణికులకు శాపంగా..**

**నరకప్రాయంగా మారిన ఆర్ అండ్ బి రహదారి**

**దుమ్ముతో ముందున్న వాహనమే కనిపించని దుస్థితి..**

**ప్రమాదాలకు గురవుతున్న వాహనదారులు.**

**ట్యాంకర్‌తో నీళ్లు చల్లుతూ పంచాయతీ తాత్కాలిక ఉపశమనం.**

**అరగంట దాటితే మళ్లీ అదే పరిస్థితి**

**శాశ్వత మరమ్మతులు చేపట్టాలని ప్రయాణికులు, డిమాండ్**



అశ్వాపురం, ప్రభాతవార్త

ఒకవైపు రహదారిపై భారీ గుంతలు, మరోవైపు ఆ గుంతలను పూడ్చేందుకు పోసిన మట్టి, వాహనాలు రాకపోకలు సాగిస్తున్న కొద్దీ ఎగసిపడుతున్న దుమ్ము, ముందున్న వాహనం కూడా కనిపించని పరిస్థితి, దీంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని ప్రయాణికులు బిక్కుబిక్కుమంటూ ప్రయాణించాల్సిన దుస్థితి నెలకొంది. అశ్వాపురం మండల పరిధిలోని సీతారాంపురం నుంచి మొండికుంట వరకు ఉన్న ఆర్ అండ్ బి రహదారి ప్రస్తుతం ప్రయాణికులకు తీవ్ర ఇబ్బందులు కలిగిస్తోంది. కొత్తగూడెం నుంచి మణుగూరు వైపు వెళ్లే ఈ ప్రధాన రహదారి నిత్యం వేలాది వాహనాల రాకపోకలకు ప్రధాన మార్గంగా ఉంది. ఉద్యోగులు, విద్యార్థులు, వ్యాపారులు, ద్విచక్ర వాహనదారులు, ఆర్టీసీ బస్సులు, బొగ్గు రవాణా, ఇసుక రవాణా, బిటిపిఎస్ కు, సింగరేణికి, హెవీ వాటర్ ప్లాంట్ కు సరకు రవాణా వాహనాలు, ఆసియాలోనే అత్యంత ప్రసిద్ధి కలిగిన మేడారం సమ్మక్క, సారక్క తల్లుల దర్శనానికి వెళ్లే భక్తులు వెళ్లే వాహనాలుఈ మార్గంలో నిత్యం ప్రయాణిస్తుంటాయి. ఇంతటి ప్రాధాన్యత ఉన్న ఆర్ అండ్ బి రహదారి ప్రస్తుతం గుంతలు, దుమ్ముతో ప్రయాణికులకు చుక్కలు చూపిస్తోంది.

### వర్షాలకు గుంతలు.. గుంతలకు మట్టి.. మట్టితో దుమ్ము

ఇటీవల కురిసిన వర్షాల కారణంగా ఆర్ అండ్ బి రహదారిపై పలుచోట్ల భారీ గుంతలు ఏర్పడ్డాయి. గుంతల్లో వర్షపు నీరు నిలిచిపోవడంతో రహదారిపై ప్రయాణించే వాహనదారులకు గుంతల లోతు అర్థం కాక ప్రమాదాలు చోటుచేసుకున్నాయి. ముఖ్యంగా ద్విచక్ర వాహనదారులు అదుపుతప్పి కిందపడిన సందర్భాలు అనేకం ఉన్నాయని స్థానికులు చెబుతున్నారు. ఈ సమస్యను తాత్కాలికంగా పరిష్కరించేందుకు సంబంధిత అధికారులు పలుమార్లు గుంతల్లో మట్టిని పోసి పూడ్చారు. అయితే అతివృష్టి, అనావృష్టి అన్న రీతిలో వర్షాలు తగ్గి ఎండలు పెరగడంతో పరిస్థితి మరో రూపం దాల్చింది. రహదారిపై పోసిన మట్టి ఎండిపోవడంతో వాహనాలు వేగంగా వెళ్లిన ప్రతిసారీ పెద్ద ఎత్తున దుమ్ము లేస్తోంది. ఎడారిలో ఇసుక తుఫాను ను తలపిస్తున్న ఈ దుమ్ము తుఫాన్‌తో ప్రయాణికులు తీవ్రమైన అవస్థలు పడుతున్నారు. ఆర్ అండ్ బి రహదారిపై ఒక్క వాహనం వెళ్లినా దాని వెనుక భారీగా దుమ్ము మేఘంలా కమ్ముకుంటోంది. వరుసగా వాహనాలు ప్రయాణించే సమయంలో పరిస్థితి మరింత దారుణంగా మారుతోంది. దుమ్ము కారణంగా వెనుక నుంచి వస్తున్న వాహనాలకు ముందు ఉన్న వాహనాలు కనిపించకపోవడంతో ప్రమాదాల ముప్పు పెరుగుతోంది.

ముఖ్యంగా ద్విచక్ర వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. దుమ్ము కళ్లలోకి వెళ్లడంతో రహదారిని సరిగా చూడలేకపోతున్నామని వారు వాపోతున్నారు. వాహనదారులు ముక్కుకు, నోటికి గుడ్డలు కట్టుకుని ప్రయాణించాల్సిన పరిస్థితి నెలకొంది.

### రహదారి వెంట ఉన్న ప్రజలు, వ్యాపారులకు తిప్పలు

రహదారిపై ఎగసిపడుతున్న దుమ్ము కేవలం ప్రయాణికులకే పరిమితం కాలేదు. రహదారి వెంట ఉన్న ఇళ్లు, దుకాణాలు, వ్యాపార సంస్థలపై కూడా దుమ్ము పేరుకుపోతోంది. ఉదయం నుంచి రాత్రి వరకు వాహనాల రాకపోకలతో దుమ్ము లేస్తుండటంతో స్థానిక ప్రజలు, వ్యాపారులు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు.

దుకాణాల ముందు నీళ్లు చల్లినా కొద్దిసేపటికే పరిస్థితి మళ్లీ మొదటికి వస్తోందని వ్యాపారులు చెబుతున్నారు. ప్రతిరోజూ ఇదే సమస్యను ఎదుర్కోవాల్సి వస్తోందని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. హోటల్లు, ఫాస్ట్ ఫుడ్ సెంటర్ల నిర్వాహకులు పడే బాధ వర్ణనాతీతంగా మారింది. ఎన్ని జాగ్రత్తలు ఎగసిపడుతున్న దుమ్ముతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని తద్వారా వ్యాపారం లో నష్టాలు కూడా వాటిల్లుతున్నాయని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

### పంచాయతీ ట్యాంకర్‌తో తాత్కాలిక ఉపశమనం

సంబంధిత శాఖల నుంచి శాశ్వత పరిష్కారం కనిపించకపోవడంతో సమస్య తీవ్రతను గుర్తించిన మొండికుంట గ్రామపంచాయతీ స్పందించింది. పంచాయతీ సిబ్బందితో ట్యాంకర్ ద్వారా రహదారిపై నీళ్లు చల్లుతూ దుమ్మును కొంతవరకు అదుపు చేసేందుకు చర్యలు చేపడుతోంది.

పంచాయతీ సిబ్బంది చేస్తున్న ఈ ప్రయత్నానికి స్థానికులు అభినందనలు తెలుపుతున్నప్పటికీ, ఇది శాశ్వత పరిష్కారం కాదని వారు అంటున్నారు. ఒకసారి నీళ్లు చల్లిన తర్వాత మండుతున్న ఎండ కారణంగా కొద్దిసేపటికే రహదారి మళ్లీ ఎండిపోయి దుమ్ము లేస్తోందని చెబుతున్నారు.

### అధికారుల దృష్టికి వెళ్లినా.. స్పందన ఏది?

ఆర్ అండ్ బి రహదారి దుస్థితిపై స్థానికులు పలుమార్లు సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లినట్లు చెబుతున్నారు. రహదారి సమస్యపై వివిధ వార్తాపత్రికలు, సోషల్ మీడియా వేదికల ద్వారా కూడా కథనాలు వెలువడుతున్నప్పటికీ శాశ్వత పరిష్కారం దిశగా చర్యలు కనిపించకపోవడంపై ప్రజలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ప్రజల రాకపోకలకు కీలకమైన ప్రధాన రహదారిపై ప్రయాణికుల భద్రతకు ప్రాధాన్యత ఇవ్వాల్సిన అధికారులు సమస్యను ఎందుకు పట్టించుకోవడం లేదని వారు ప్రశ్నిస్తున్నారు. ప్రతి రోజూ లక్షలాది మంది ప్రయాణించే రహదారిపై ప్రమాదం జరిగిన తర్వాత స్పందించడంకంటే ముందుగానే చర్యలు తీసుకోవడం మంచిదని స్థానికులు సూచిస్తున్నారు. తాత్కాలిక మరమ్మతులు కాదని, శాశ్వత పరిష్కారం కావాలని, గుంతల్లో మట్టి పోయడం, దుమ్ము లేస్తే నీళ్లు చల్లడం వంటి తాత్కాలిక చర్యలతో సమస్యకు పరిష్కారం లభించదని ప్రయాణికులు అంటున్నారు. గుంతలు ఏర్పడిన ప్రాంతాలను పూర్తిస్థాయిలో పరిశీలించి, ఆర్ అండ్ బి రహదారికి అవసరమైన శాశ్వత మరమ్మతులు చేపట్టాలని డిమాండ్ చేస్తున్నారు. రహదారి నాణ్యత, భద్రతపై సంబంధిత శాఖ ఉన్నతాధికారులు ప్రత్యేక దృష్టి సారించి, ప్రమాదాలకు కారణమవుతున్న ప్రాంతాలను గుర్తించి తక్షణమే మరమ్మతులు చేపట్టాలని కోరుతున్నారు.

### తీరు మారదా.. తిప్పలు తప్పవా..?

ప్రతిరోజూ ఈ మార్గంలో ప్రయాణించే ప్రజలకు ప్రస్తుతం ఇదే ప్రశ్న వేధిస్తోంది. గుంతలు పూడ్చేందుకు పోసిన మట్టితోనే దుమ్ము సమస్య ఏర్పడితే, ఆ సమస్యను శాశ్వతంగా పరిష్కరించేందుకు అధికారులు ఇంకెంతకాలం వేచి చూస్తారని ప్రయాణికులు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికే ప్రమాదాల ముప్పుతో ప్రయాణిస్తున్న ప్రజలకు దుమ్ము సమస్య మరింత ప్రమాదకరంగా మారిందని, చిన్నపాటి నిర్లక్ష్యం కూడా ప్రాణనష్టానికి దారితీసే అవకాశం ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత అధికారులు ఇకనైనా స్పందించి సీతారాంపురం–మొండికుంట మధ్య ఆర్ అండ్ బి రహదారిపై శాశ్వత మరమ్మతులు చేపట్టి ప్రయాణికులకు భద్రమైన ప్రయాణాన్ని అందించాలని ప్రజలు కోరుతున్నారు.

# రాజకీయాలను దిగజారుస్తున్న..

# బజారు భాష

**సమస్యల మళ్లింపుకే ఆస్తుల ఆరోపణలు**

**ప్రజల పాత్ర లేని దిశగా ప్రజాస్వామ్యం**

**ఐక్య కార్యాచరణ తర్వాతే ఐక్యత**

**అధికారం ఉన్నప్పుడు భూములు పంచేందుకు జంకేందుకు...?**

**ఐజెయు మీట్ ద ప్రెస్లో సిపిఎం నేత తమ్మినేని**



ఖమ్మం బ్యూరో, ప్రభాతవార్త

రాష్ట్రంలో అధికార, విపక్ష నేతలు వాడుతున్న బజారు భాష రాష్ట్ర రాజకీయాలను దిగజారుస్తుందని సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు, మాజీ ఎంపి తమ్మినేని వీరభద్రం తెలిపారు. గౌరవనీయ భాష ప్రయోగించకుండా నీచ పదజాలం రాజకీయాల్లో సరైంది కాదని ఆయన తెలిపారు. ప్రజా సమస్యలను పక్కదారి పట్టించుకే భూ కబ్జాలు, ఆక్రమణల వ్యవహారాన్ని తెరపైకి తెస్తున్నారని ఆయన అభిప్రాయపడ్డారు. సోమవారం టియుడబ్ల్యూజె (ఐజేయు) ఆధ్వర్యంలో తమ్మినేనితో మీట్ ద ప్రెస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. టియుడబ్ల్యూజె (ఐజెయు) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె. రాంనారాయణ సమన్వయ కర్తగా వ్యవహరించగా టియుడబ్ల్యూజె (ఐజెయు) జిల్లా అధ్యక్షులు ఏనుగు వెంకటేశ్వరరావు అధ్యక్షులుగా వ్యవహరించారు.

ఈ కార్యక్రమంలో తమ్మినేని మాట్లాడుతూ నేతల భాష ఆక్షేపణీయమని ఈ భాష సరైంది కాదన్నారు. విమర్శించడానికి ఈ పద్ధతి తగదని ఆయన కాంగ్రెస్, బిఆర్ఎస్లకు సూచించారు. రాష్ట్రంలో రెండు పార్టీల మధ్య భూ ఆక్రమణలు, అక్రమ సంపాదనలకు సంబంధించి పరస్పర విమర్శల పర్వం సాగుతుందని కేవలం ప్రజా సమస్యలను పక్కదారి పట్టించడానికే పథకం ప్రకారం రెండు పార్టీలు వ్యవహరిస్తున్నాయని ఆయన ఆరోపించారు. పాపాలు చేయడంలో రెండు పార్టీలు సమానమేనని రేవంత్రెడ్డి కుటుంబ సభ్యుల భూ వ్యవహారాలకు సంబంధించి బిఆర్ఎస్ కేవలం ఆరోపణలకే పరిమితం అవుతుండగా అధికారం చేతిలో ఉన్న కాంగ్రెస్ కూడా కేవలం ఆరోపణలు మాత్రమే చేస్తుందని ఈ వ్యవహారం పలు అనుమానాలకు తావిస్తుందన్నారు. కాంగ్రెస్ భూ ఆక్రమణలపై బిఆర్ఎస్ కార్యాచరణ చేపట్టదని బిఆర్ఎస్ భూ ఆక్రమణలపై అధికార పార్టీ చర్యలకు పూనుకోదని ఈ విషయం ప్రజలకు కూడా తెలుసునన్నారు. అధికారం చేతిలో ఉన్నప్పుడు భూములు పంచేందుకు జంకేందుకని తమ్మినేని ప్రశ్నించారు.

హామీలు అమలు పరచలేని కాంగ్రెస్ వల్ల కార్యాచరణ లేని బిఆర్ఎస్ వల్ల ఈ రాష్ట్ర ప్రజలకు ఒరిగింది ఏమి లేదన్నారు. ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్య దేశంగా చెప్పుకునే భారతదేశంలో ప్రజల పాత్ర క్రమేపి తగ్గిపోతుందన్నారు. ఒకప్పుడు రిగ్గింగులు, ఓట్ల కొనుగోలు, ఇప్పుడు గెలిచిన అభ్యర్థులను కొనుగోలు చేయడం ఏకంగా ఓటింగ్ మిషన్ల ద్వారా ఓట్లను సానుకూలంగా వేయించుకునే పద్ధతికి తెరలేపారన్నారు. ఎన్నికల ఫలితాలను ప్రజల అభిప్రాయాలకు భిన్నంగా తీసుకు వచ్చే ప్రయత్నంలో బిజెపి 2024లోనే సఫలీకృతమైనట్లు అనేక సర్వేలు చెబుతున్నాయన్నారు. భారత రాజ్యాంగం ప్రకారం పాలన సాగడం లేదని ప్రజల విమర్శకు కనీసం సమాధానం చెప్పే స్థితిలో కేంద్ర ప్రభుత్వం లేదన్నారు. ఎవరైనా విమర్శిస్తే దేశ ద్రోహులుగా ముద్రిస్తున్నారని తమ్మినేని ఆరోపించారు.

ఎన్నికల కమిషన్ ఎంపికే తప్పని పద్ధతి ప్రకారం జరగని ఎన్నికల కమిషన్ ఎంపికతో అధికారానికి ఎన్నికల కమిషనర్ దాసోహం అన్నారని ఆయన తప్పనిసరిగా రాజీనామా చేయాల్సిందేనని తమ్మినేని స్పష్టం చేశారు.

దేశంలో ప్రజాస్వామ్య వ్యతిరేక శక్తులు పెత్తనం చేసే ప్రయత్నం చేస్తున్నాయని ఆ క్రమంలోనే దిమాగినక్సల్స్ పదాన్ని తెరపైకి తెచ్చారన్నారు. నక్సల్స్ పేరుతో అడవుల్లోని సాయుధులను హతమార్చినట్లు ఆలోచించగలిగి సమాజం కోసం పనిచేసే వారిని దిమాగి నక్సల్స్ పేరుతో హతమారుస్తారా అని ప్రశ్నించారు. బిజెపి గ్రాఫ్ పడిపోతుందని 2014లో సంక్షేమం, ఆర్థిక ప్రణాళికతో ముందుకు వచ్చిన బిజెపి 2024 నాటికి మతాన్ని ఎజెండాగా చేసిందని బిజెపి కేవలం టిడిపి, ఇతర మిత్ర పక్షాల మద్దతుతోనే అధికారంలోకి రాగలిగిందన్నారు. అమెరికాకు మోడీ దాసోహం అంటుండగా అమెరికాలో తీవ్ర ఆర్థిక సంక్షోభం నెలకొందని అక్కడి ప్రజలు పెరుగుతున్న నిత్యావసర వస్తువుల ధరల పట్ల నిరసన వ్యక్తం చేస్తున్నారని తమ్మినేని తెలిపారు.

# అభివృద్ధి, పేదల సంక్షేమమే ధ్యేయం

**రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార, చేనేత జౌళి శాఖల మంత్రి తుమ్మల..**

**అర్హులైన ప్రతి నిరుపేదకూ ప్రభుత్వ సంక్షేమ ఫలాలు అందాలి**

**విద్యా, వైద్య రంగాలకు ప్రత్యేక ప్రాధాన్యత**

**నగరంలోని 48వ డివిజన్ లో 1.80 కోట్ల రూపాయల వ్యయంతో బీటీ రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేసిన మంత్రి**





ఖమ్మం టౌన్, ప్రభాతవార్త అక్టోబర్ 5

రాష్ట్రంలో రేవంత్‌రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం పేదల సంక్షేమం, సమగ్ర అభివృద్ధే ధ్యేయంగా పనిచేస్తోందని రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార, చేనేత, జౌళి శాఖామాత్యులు తుమ్మల నాగేశ్వరరావు అన్నారు.!! సోమవారం నగరపాలక సంస్థ పరిధిలోని ఎఫ్ సిఐ బైపాస్ రోడ్డు దానవాయిగూడెం ఫిల్టర్ బెడ్ నుండి ఎంబి గార్డెన్స్ వరకు రూ. 180.00 లక్షల మునిసిపల్ సాధారణ నిధులతో చేపట్టనున్న బీటీ రోడ్డు నిర్మాణ పనులకు మంత్రి శంకుస్థాపన చేశారు.!! ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, అర్హులైన నిరుపేదలకు కళ్యాణలక్ష్మి, సీఎం రిలీఫ్ ఫండ్, తెల్ల రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇళ్లు, ఉచిత గ్యాస్ సిలిండర్లు వంటి ప్రభుత్వ పథకాలు ఖచ్చితంగా అందాలని అన్నారు. ఇళ్లు కేటాయించేటప్పుడు గుడిసెలలో నివసించే నిరుపేదలకు మొదటి ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు.!!డివిజన్‌లో ప్రజలకు అవసరమైన డ్రెయిన్లు, పార్కులు, రోడ్లు, మంచినీటి వసతి, విద్యుత్ లైన్ల వంటి మౌళిక వసతుల పనులను వెంటనే మంజూరు చేయించి వేగవంతంగా పూర్తి చేయాలని తెలిపారు. పేదరికం నుండి శాశ్వత విముక్తి పొందేందుకు చదువు ఒక్కటే మార్గమని మంత్రి అన్నారు. ఖమ్మంలో ముఖ్యమంత్రి సహకారంతో మోడల్ స్కూళ్లు, ఇంటిగ్రేటెడ్ స్కూళ్లతో పాటు కొత్తగా తెలంగాణ పబ్లిక్ స్కూళ్లు కూడా ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. ఒక్కో విద్యార్థిపై ప్రభుత్వం రూ.1.25 లక్షలు వెచ్చించి ఉచితంగా ఇంగ్లీష్ మీడియం విద్య, వసతి, పుస్తకాలు, దుస్తులు అందిస్తోందని అన్నారు. నగరంలో కబ్జాలు, దౌర్జన్యాలు, పోలీస్ కేసుల ఇబ్బందులు లేకుండా ప్రజలందరూ సుఖ సంతోషాలు, ప్రశాంత తతతో జీవించాలన్నదే తమ ఆకాంక్ష అని మంత్రి స్పష్టం చేశారు.!!రాబోయే దసరా పండుగ సందర్భంగా మహిళలకు ముఖ్యమంత్రి కానుకగా చిలకపచ్చ చీరల పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. అభివృద్ధికి ప్రజలందరూ బాధ్యతాయుతంగా తమ వంతు కృషి చేయాలని మంత్రి అన్నారు. ఈ కార్యక్రమంలో పోలీస్ కమిషనర్ సునీల్ దత్, సుడా చైర్మన్ పువ్వాళ్ల దుర్గాప్రసాద్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మహ్మద్ ఖాదర్ బాబా, ఖమ్మం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ హన్మంతరావు, పబ్లిక్ హెల్త్ ఎస్ఈ రంజిత్, ఖమ్మం ఆర్డీవో ఎన్. శ్రీనివాస్, ఖమ్మం అర్బన్ మండల తహసీల్దార్ జయచందర్, అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# భద్రాచలం ఆస్పత్రికి రూ.15 లక్షల విలువైన వైద్య పరికరాలు

భద్రాచలం, అక్టోబర్ 5(ప్రభాతవార్త)



నాలుగు రాష్ట్రాల సరిహద్దు ప్రాంతాల నుంచి వచ్చే పేద ప్రజలకు వైద్య సేవలందిస్తున్న భద్రాచలం ప్రభుత్వ ఏరియా ఆస్పత్రికి ఐటీడీఏ నిధులతో రూ.15 లక్షల విలువైన ఆధునిక వైద్య పరికరాలను సమకూర్చారు. భద్రాచలం ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు, ఐటీడీఏ పీవో బి.రాహుల్ సోమవారం ఆస్పత్రి సూపరింటెండెంట్ రాజశేఖర్‌రెడ్డికి పరికరాలను అందజేశారు. కంటి పరీక్షల పరికరం, బ్లడ్ టెస్టింగ్ మిషన్, ఈసీజీ మిషన్, ఏసీలు, రిఫ్రిజిరేటర్లు, ట్రేలు, ఆక్సిజన్ సిలిండర్లు తదితర పరికరాలను అందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఆధునిక వైద్య పరికరాల అందుబాటుతో పేద, మధ్యతరగతి ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందుబాటులోకి వస్తాయని అన్నారు. భద్రాచలం ప్రభుత్వ ఆస్పత్రిని మరింత అభివృద్ధి చేసి, నాలుగు రాష్ట్రాల సరిహద్దు ప్రాంతాల నుంచి వచ్చే ప్రజలకు నాణ్యమైన వైద్యం అందేలా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. పరికరాలను సద్వినియోగం చేసుకుని రోగులకు మెరుగైన సేవలందించాలని వైద్యులు, సిబ్బందికి సూచించారు. ఐటీడీఏ పీవో బి.రాహుల్ మాట్లాడుతూ ప్రభుత్వ ఆస్పత్రుల్లో మౌలిక వసతులు, వైద్య సదుపాయాల మెరుగుదలకు ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందన్నారు. భద్రాచలం ఏరియా ఆస్పత్రికి సమకూర్చిన పరికరాలతో రోగులకు మరింత మెరుగైన వైద్య సేవలు అందించే అవకాశం కలుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో అడిషనల్ డీఎంహెచ్‌వో సైదులు, ఐసీయూ ఇన్‌చార్జి డాక్టర్ జగదీష్, డాక్టర్ మల్లేష్, ఆస్పత్రి వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రతి ఫిర్యాదు దరఖాస్తును పరిశీలించి

# చర్యలు తీసుకోవాలి

**స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డాక్టర్ శ్రీజ**

**ప్రజావాణిలో ప్రజల అర్జీలు స్వీకరించిన అదనపు కలెక్టర్**



ఖమ్మం కలెక్టరేట్ అక్టోబర్ 05: (ప్రభాతవార్త)

ప్రతి ఫిర్యాదు దరఖాస్తును పరిశీలించి త్వరగా పరిష్కరించాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డాక్టర్ పి.శ్రీజ జిల్లా అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డాక్టర్ పి. శ్రీజ ప్రజల అర్జీలను స్వీకరించారు. తిరుమలాయపాలెం మండలం హస్నాబాద్ గ్రామ పంచాయతీకి చెందిన మాజీ సర్పంచ్ బొబ్బిలి భరత్ చంద్ర తనకు పంచాయతీ నుంచి 17 లక్షల 3 వేల 450 రూపాయల బిల్లులు పెండింగ్ ఉన్నాయని వీటిని త్వరగా చెల్లించాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా, జిల్లా పంచాయతీ అధికారికి రాస్తూ పరిశీలించి అక్టోబర్ 10 నాటికి విచారణ నివేదిక సమర్పించాలని అదనపు కలెక్టర్ ఆదేశించారు. తెలంగాణ రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ, బీసీ డాక్టర్ బి. ఆర్ అంబేద్కర్ సేవా సంఘం ప్రతినిధులు ప్రైవేట్ పాఠశాలలు ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా కొనసాగిస్తున్నారని వీటిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా, జిల్లా విద్యాశాఖ అధికారికి రాస్తూ అవసరమైన చర్యలు తీసుకోవాలని అన్నారు. ఖమ్మం జిల్లాకు చెందిన బోడ యమున తాను బీటెక్ పూర్తి చేశానని, కుటుంబ పరిస్థితుల కారణంగా తనకు ఖమ్మం జిల్లాలో లేదా సమీప ప్రాంతాలలో ఏదైనా ఉద్యోగం కల్పించాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా, జిల్లా ఉపాధి అధికారికి రాస్తూ అవకాశం మేరకు చర్యలు తీసుకోవాలని అన్నారు. తిరుమలాయపాలెం మండలం హస్నాబాద్ గ్రామ పంచాయతీకి చెందిన మామిడాల అనసూర్య తన కోడలు నుంచి జీవనభృతి ఇప్పించాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా, జిల్లా సంక్షేమ అధికారికి రాస్తూ అవసరమైన చర్యలు చేపట్టాలని అన్నారు. జి. వెంకటస్వామి (కాక) జయంతి సందర్భంగా అదనపు కలెక్టర్ డాక్టర్ పి. శ్రీజ నివాళులు:జి. వెంకటస్వామి (కాక) జయంతి సందర్భంగా సోమవారం ఖమ్మం కలెక్టరేట్‌లో ప్రజావాణి కార్యక్రమం ప్రారంభానికి ముందు అదనపు కలెక్టర్ డాక్టర్ పి. శ్రీజ వారి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా జి. వెంకటస్వామి (కాక) సేవలను, పేదలు, అట్టడుగు వర్గాల అభ్యున్నతికి చేసిన కృషిని స్మరించుకున్నారు. మంత్రిగా, వివిధ కీలక పదవుల్లో పనిచేస్తూ ప్రజల సమస్యల పరిష్కారానికి, పేదల సంక్షేమానికి జి. వెంకటస్వామి విశేష కృషి చేశారని అదనపు కలెక్టర్ పేర్కొన్నారు. కార్మికులు, పేదలు, అట్టడుగు వర్గాల సంక్షేమం కోసం వారు అందించిన సేవలు చిరస్మరణీయమని అన్నారు. మహనీయుల ఆశయాలు, సేవా స్ఫూర్తిని ఆదర్శంగా తీసుకుని ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందించాలని ఈ సందర్భంగా జిల్లా అధికారులకు అదనపు కలెక్టర్ సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# జూలూరుపాడు "పొలిమేర రోడ్డు ఆక్రమణ"

**నర్సరీ నీళ్లతో డొంక ఆగమాగం**

**మోకాళ్లలోతు బురదతో అవస్థలు**

**ముళ్ళ చెట్లతో మూసుకుపోయిన రోడ్డు**

**రాకపోకలకు ప్రజలు తీవ్ర అవస్థలు**



జూలూరుపాడు, ప్రభాతవార్త, అక్టోబర్ 5:

మండల కేంద్రమైన జూలూరుపాడు పొలిమేర పెద్ద రోడ్డు ఆక్రమణలు, అధ్వాన పరిస్థితులతో కనుమరుగయ్యే దుస్థితికి చేరుకుంది. తరతరాలుగా రైతులు, రైతు కూలీలు, పశువుల రాకపోకలకు ప్రధాన మార్గంగా ఉన్న ఈ విశాలమైన డొంక ప్రస్తుతం పిచ్చిరొట్ట, ముళ్లకంపలు, నీటి నిల్వలతో రాకపోకలకు ఇబ్బందికరంగా మారింది. రహదారికి ఇరువైపులా ఆక్రమణలు పెరగడంతో క్రమంగా మార్గం ఇరుకుగా మారుతున్నా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ మార్గం వెంట వ్యవసాయ భూములు ఉండటంతో నిత్యం రైతులు, వ్యవసాయ కూలీలు రాకపోకలు సాగిస్తుంటారు. అంతేకాక గ్రామం నుంచి వందల సంఖ్యలో పశువులను మేత కోసం అటవీ ప్రాంతం వైపు తోలుకెళ్లేందుకు కూడా ఇదే మార్గాన్ని వినియోగిస్తుంటారు. అయితే రోడ్డుకు ఇరువైపులా దట్టంగా పెరిగిన పిచ్చిరొట్ట, ముళ్లకంపలు రహదారిపైకి విస్తరించడంతో నడిచేందుకు కూడా ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఇదిలా ఉండగా పొలిమేర రోడ్డుకు ఆనుకుని ఏర్పాటు చేసిన నర్సరీల్లో మిరప మొక్కల పెంపకానికి వినియోగించే మిగులు నీటిని కొందరు నిర్వాహకులు రోడ్డు డొంకలోకి వదులుతున్నారనే ఆరోపణలు ఉన్నాయి. దీంతో ఎండాకాలంలోనూ పలుచోట్ల నీరు నిలిచి మోకాళ్లలోతు బురద ఏర్పడుతోంది. చిన్నపాటి వర్షం కురిసినా పరిస్థితి మరింత దారుణంగా మారి రాకపోకలు స్తంభించే పరిస్థితి నెలకొంటోంది. నీటి నిల్వలు, బురద కారణంగా రైతులు తమ పొలాలకు వెళ్లేందుకు, వ్యవసాయ కూలీలు పనులకు వెళ్లేందుకు ఇబ్బందులు పడుతున్నారు. పశువులను మేతకు తోలుకెళ్లే సమయంలోనూ అవస్థలు తప్పడం లేదని స్థానికులు వాపోతున్నారు. ఒకవైపు రహదారి ఆక్రమణలు, మరోవైపు నర్సరీల నుంచి వస్తున్న నీరు, ఇంకోవైపు రోడ్డుపైకి విస్తరించిన చెట్ల పొదలతో ఈ మార్గం తన ఉనికినే కోల్పోయే పరిస్థితి ఏర్పడిందని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. తరాల నాటి పొలిమేర రోడ్డుకు సంబంధిత అధికారులు వెంటనే హద్దులు గుర్తించాలని స్థానికులు కోరుతున్నారు. రహదారి స్థలాన్ని ఆక్రమించిన ప్రాంతాలను గుర్తించి తొలగించడంతో పాటు, రాకపోకలకు అడ్డుగా మారిన చెట్లు, ముళ్లకంపలు, పొదలను యంత్రాలతో తొలగించాలని డిమాండ్ చేస్తున్నారు. అలాగే నర్సరీల నుంచి మిగులు నీరు రోడ్డుపైకి చేరకుండా చర్యలు తీసుకోవాలని, రహదారి దుస్థితికి కారణమవుతున్న వారిపై నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

# బాలుడి వైద్యానికి జనం కోసం మనం అపన్నహస్తం

## నిరుపేద తల్లిదండ్రులకు అండగా నిలిచిన స్వచ్ఛంద సంస్థ

అశ్వాపురం,ప్రభాతవార్త, అక్టోబర్ 05:

ప్రమాదవశాత్తు తలకు తీవ్ర గాయమై ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న 14 ఏళ్ల బాలుడి వైద్య ఖర్చులకు జనం కోసం మనం స్వచ్ఛంద సంస్థ ఆపన్నహస్తం అందించింది. అశ్వాపురం మండలంలోని బుడుగు బజార్‌కు చెందిన సాయిని శ్రీను కుమారుడు సాయిని రోహిత్ (14) ఇటీవల ప్రమాదవశాత్తు తలకు బలమైన గాయం కావడంతో తీవ్ర అస్వస్థతకు గురయ్యాడు.ప్రస్తుతం రోహిత్ ఖమ్మంలోని ఆరోగ్య ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. బాలుడి పరిస్థితి విషమంగా ఉందని వైద్యులు కుటుంబ సభ్యులకు తెలిపారు.తలకు శస్త్రచికిత్స చేయాల్సి ఉందని, ఇందుకు సుమారు రూ.10 లక్షల వరకు వైద్య ఖర్చులు అయ్యే అవకాశం




ఉందని వైద్యులు పేర్కొన్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.దినసరి కూలి పనులకు వెళ్తూ కుటుంబాన్ని పోషించుకునే ఆ నిరుపేద కుటుంబానికి వైద్య ఖర్చులు భారం కావటంతో కుమారుడి ప్రాణాలను కాపాడేందుకు అవసరమైన చికిత్స అందించాల్సి ఉన్నప్పటికీ,భారీగా ఖర్చు అవుతుండటంతో కుటుంబం ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొంటోంది.ఈ విషయం మణుగూరు పట్టణానికి చెందిన జనం కోసం మనం స్వచ్ఛంద సంస్థ సభ్యుల దృష్టికి వెళ్లడంతో వారు మానవతా దృక్పథంతో స్పందించారు.రూ.15 వేల ఆర్థిక సహాయం అందించారు.బాలుడి పరిస్థితిని తెలుసుకున్న సంస్థ సభ్యులు దుబాకుల మహేష్, గడిపూడి నవీన్ ఖమ్మంలోని ఆరోగ్య ఆసుపత్రికి వెళ్లి రోహిత్ ఆరోగ్య పరిస్థితిని పరిశీలించారు. కుటుంబ సభ్యులను పరామర్శించి, బాలుడి చికిత్సకు సంబంధించిన వివరాలను అడిగి తెలుసుకున్నారు.అనంతరం రూ.15 వేల ఆర్థిక సహాయాన్ని బాలుడి కుటుంబ సభ్యులకు అందించారు.ఆపద సమయంలో తమకు అండగా నిలిచిన జనం కోసం మనం సంస్థ సభ్యులకు కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.మానవత్వమే మహోన్నత సేవ గా భావించి ఆపదలో ఉన్న కుటుంబాలకు తమ వంతు సహాయం అందిస్తూ జనం కోసం మనం స్వచ్ఛంద సంస్థ చేస్తున్న సేవలను పలువురు అభినందించారు.చిన్నారి ప్రాణాలను కాపాడేందుకు మరింత ఆర్థిక సహాయం అవసరమని, దాతలు,స్వచ్ఛంద సంస్థలు,సేవా భావం ఉన్నవారు ముందుకు వచ్చి రోహిత్ కుటుంబానికి అండగా నిలవాలని స్థానికులు కోరుతున్నారు.

# సేవ్ డెమోక్రసీ మార్చ్ ఫాస్ట్‌ను విజయవంతం చేయాలి

## .అశ్వాపురంలో అఖిలపక్ష పార్టీల సమావేశం

అశ్వాపురం,ప్రభాతవార్త, అక్టోబర్ 5,

సర్ పేరుతో ఓటర్ల హక్కులకు భంగం కలిగించే చర్యలను వ్యతిరేకిస్తూ అఖిలపక్ష పార్టీల ఆధ్వర్యంలో ఈ నెల 8న నిర్వహించనున్న సేవ్ డెమోక్రసీ మార్చ్ ఫాస్ట్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని అఖిలపక్ష నాయకులు పిలుపునిచ్చారు.ఈ సందర్భంగా అశ్వాపురం మండల కాంగ్రెస్ పార్టీ కార్యాలయం ఒరుగంటి వీరయ్య భవన్‌లో సోమవారం అఖిలపక్ష సమావేశం నిర్వహించారు.కాంగ్రెస్, తెలుగుదేశం,సీపీఐ,సీపీఎం, టీజేఎస్,తెలంగాణ రాజ్యాధికార పార్టీ నాయకులు సమావేశంలో



పాల్గొన్నారు.ఈ నెల 8న జిల్లా కలెక్టర్ కార్యాలయం నుంచి అఖిలపక్ష పార్టీల ఆధ్వర్యంలో నిర్వహించనున్న సేవ్ డెమోక్రసీ మార్చ్ ఫాస్ట్ లో అన్ని పార్టీల నాయకులు,కార్యకర్తలు, ప్రజాస్వామ్యవాదులు అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.ఓటు ప్రతి భారతీయుడి ప్రాథమిక హక్కు అని,ఓటర్ల జాబితాలో పారదర్శకత,ఓటు హక్కు రక్షణ, ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం ప్రజలు పెద్దఎత్తున భాగస్వాములు కావాలని నాయకులు పిలుపు నిచ్చారు.ఓటర్ల హక్కులకు భంగం కలిగించే చర్యలను ప్రజాస్వామ్య పద్ధతిలో ప్రతిఘటించాల్సిన అవసరం ఉందన్నారు.ఈ సమావేశంలో అశ్వాపురం మండల కాంగ్రెస్ అధ్యక్షుడు ఒరుగంటి రమేష్ బాబు,కాంగ్రెస్ సీనియర్ నాయకుడు గాదె కేశవరెడ్డి,టీడీపీ మండల కార్యదర్శి జజ్జవరపు వాసు,ఏఐటీయూసీ మండల అధ్యక్షుడు రాయపూడి రాజేష్, ఏడేల్లి కమలాకర్,తెలంగాణ రాజ్యాధికార పార్టీ మండల అధ్యక్షుడు విలాసాగరపు కోటేశ్వరరావు,ఎస్సీ సెల్ అధ్యక్షుడు గద్దల నాగేశ్వరరావు,సీపీఎం కార్యవర్గ సభ్యుడు మండేపూడి సాంబశివరావు,టీజేఎస్ మండల అధ్యక్షుడు పగడాల కరుణాకర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

# ఖాళీ డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను అర్హులకు కేటాయించాలి.

అశ్వాపురం,ప్రభాతవార్త, అక్టోబర్ 05;




అశ్వాపురం మండ లంలోని అమెర్ధ గ్రామంలో ఖాళీగా ఉన్న డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను అర్హులైన నిరుపే దలకు కేటా యించాలని కోరుతూ సోమవారం మండల కేంద్రంలోని రైతువేదిక లో నిర్వహించిన ప్రజావాణిలో అమ్మెర్ధ గ్రామ పంచాయతీ ఉప సర్పంచ్ మేకల అంజిబాబు అధికారులకు వినతిపత్రం అందచేశారు.ఖాళీగా ఉన్న డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను గుర్తించి,అర్హత కలిగిన పేద కుటుంబాలకు కేటాయించాలని వారు కోరారు.ఈ కార్యక్రమంలో కోర్స వారిగూడెం గ్రామానికి చెందిన మర్మం అనిల్,కోర్స సతీష్ తదితరులు పాల్గొన్నారు.

# ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం

కల్లూరు,అక్టోబర్ 05, ప్రభాతవా ర్త

సత్తుపల్లి నియోజకవర్గ ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి, జిల్లా కలెక్టర్ ఆదేశాలతో మండల పరిధిలోని లింగాల గ్రామంలో సోమవారం డీసీఎంఎస్ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. జిల్లా సహకార శాఖ మార్కెటింగ్ ద్వారా ఏర్పాటైన ఈ కార్యక్రమంలో రైతులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# సింగరేణి కార్మికులకు 36శాతం పైగా లాభాల వాటా ఇవ్వాలి



మణుగూరు, ప్రభాతవార్త, అక్టోబర్ 05:

సింగరేణి సంస్థ సాధించిన వాస్తవ లాభాల్లో ఎలాంటి మినహాయింపులు లేకుండా కార్మికులకు 36 శాతం పైగా లాభాల వాటాను వెంటనే ప్రకటించి, వారి ఖాతాల్లో జమ చేయాలని టీబీజీకేఎస్ మణుగూరు ఏరియా వైస్ ప్రెసిడెంట్ నాగెల్లి వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. టీబీజీకేఎస్ గౌరవ అధ్యక్షులు కొప్పుల ఈశ్వర్, రాష్ట్ర అధ్యక్షులు మిర్యాల రాజిరెడ్డి పిలుపు మేరకు సోమవారం మణుగూరు ఏరియాలోని గనులు, డిపార్ట్‌మెంట్లలో అధికారులకు వినతిపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత రెండేళ్లలో రూ.6,300 కోట్లను అభివృద్ధి పేరుతో పక్కనబెట్టి కార్మికులకు అన్యాయం చేశారని, ఆ నిధుల ఖర్చుపై శ్వేతపత్రం విడుదల చేయాలన్నారు. 2025-26 లాభాల్లో ఎలాంటి కోతలు లేకుండా వాటా చెల్లించాలని, మంగళవారం ఏరియా జీఎంకు వినతిపత్రం ఇవ్వనున్నట్లు తెలిపారు. ఆలస్యమైతే ఆందోళనలు తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు బంగారి పవన్ కుమార్, మునిగేల నాగేశ్వర రావు, సుద్దాల సంపత్, జంగం రాజ్ కుమార్, చిరుత వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.




# జానంపేటలో ఆధార్ క్యాంప్.

పినపాక, ప్రభాత వార్త, అక్టోబర్ 05.

మండల పరిధిలోని జానంపేటలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆధార్ క్యాంప్ ఏర్పాటు చేశారు.ఆధార్ క్యాంప్ ఆపరేటర్ ఆధ్వర్యంలో నిర్వహించిన శిబిరంలో విద్యార్థులకు, స్థానికులకు ఆధార్ నమోదు,వివరాల సవరణ,చిరునామా మార్పు,మొబైల్ నంబర్ అప్‌డేట్ తదితర సేవలు అందించనున్నారు. ఆధార్‌కు సంబంధించిన పనుల కోసం దూర ప్రాంతాలకు వెళ్లాల్సిన అవసరం లేకుండా పాఠశాలలోనే సేవలు అందుబాటులోకి రావడంతో విద్యార్థులు, తల్లిదండ్రులు, స్థానికులు ఈ అవకాశాన్ని వినియోగించుకున్నారు.

# కేంద్ర ఎన్నికల ప్రధాన అధికారి జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలి

## మణుగూరులో అఖిలపక్షం ఆధ్వర్యంలో నిరసన ర్యాలీ

మణుగూరు, ప్రభాతవార్త, అక్టోబర్ 05:



రాజ్యాంగ హక్కులు, ఓటు హక్కు పరిరక్షణ కోసం ఎన్నికల స ం ఘ ం పారదర్శకంగా వ్యవహరించాలని డిమాండ్ చేస్తూ మణుగూరులో అఖిలపక్ష పార్టీల ఆధ్వర్యంలో సోమవారం భారీ నిరసన ర్యాలీ నిర్వహించారు. ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియలో అవకతవకలు జరుగుతున్నాయని ఆరోపిస్తూ కేంద్ర ఎన్నికల ప్రధాన అధికారి జ్ఞానేశ్ కుమార్ తక్షణమే రాజీనామా చేయాలని నాయకులు డిమాండ్ చేశారు. ఇండియా కూటమి పిలుపుమేరకు కాంగ్రెస్, సిపిఐ, సిపిఎం, సిపిఐ (ఎంఎల్) మాస్ లైన్ పార్టీలు ఐక్యంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు.



మణుగూరు సెంటర్ నుంచి అంబేద్కర్ సెంటర్ వరకు సాగిన ఈ ర్యాలీ అనంతరం అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేశారు. అర్హులైన ప్రతి పౌరుడి ఓటు హక్కును కాపాడాలని, ఎలాంటి అక్రమాలకు తావులేకుండా ప్రక్రియను నిర్వహించాలని నాయకులు కోరారు. ఈ కార్యక్రమంలో కపీరినాకి నవీన్, కురం రవి , సరెడ్డి పుల్లారెడ్డి, నెల్లూరి నాగేశ్వరరావు, జక్కుల రాజబాబు, సత్రపల్లి సాంబశివరావు, స్థానిక ప్రజాప్రతినిధులు, కార్మిక సంఘాల నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# అంబేద్కర్ ఓపెన్ డిగ్రీ లో చేరుటకు ఈనెల 13 చివరి తేదీ.

.. సత్తుపల్లి సెప్టెంబర్ 5 ప్రభాతవా ర్త

జెవిఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలోనిర్వహించబడుతున్న అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ స్టడీ సెంటర్ నందు 202627 విద్యా సంవత్సరానికి గాను బీఏ, బీకాం, బీఎస్సీ ప్రవేశాల నిమిత్తం గడువు ఈ నెల 13 వరకు కలదని కోఆర్డినేటర్ డా. చీపు పూర్ణచంద్రరావు ఒక ప్రకటనలో తెలియజేశారు. డిగ్రీలో అడ్మిషన్ పొందుటకు ఇంటర్, పాలిటెక్నిక్, ఐటిఐ, ఓపెన్ ఇంటర్,డిప్లొమా పాసైన విద్యార్థులుఅర్హులని ఆయనఅన్నారు.అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ లో చదవాలనుకునే ఎస్.టి కోయ, చెంచు, గోండు, దివ్యాంగులు, ట్రాన్స్ జెండర్స్ విద్యార్థులకు ఉచిత డిగ్రీ విద్యను అందిస్తున్నట్లు తెలిపారు. రెగ్యులర్ డిగ్రీ చేయలేనివారు ముఖ్యంగా ప్రభుత్వ ప్రైవేటు ఉద్యోగాలు చేసేవారు, గృహిణులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. దూరవిద్యలో పొందిన డిగ్రీకి రెగ్యులర్ విద్యలో పొందిన డిగ్రీతో సమానమైన అవకాశాలు ఉంటాయని వివరించారు. డిగ్రీ రెండవ మూడవ సంవత్సరం చదువుతున్న విద్యార్థులు ట్యూషన్ ఫీజు ఈనెల13 లోపు చెల్లించాలనితెలిపారు.మరిన్నివివరాలకు9491881910, 8187837058 నంబర్లను సంప్రదించాలని అన్నారు.

# రైతు భూములకు హక్కులే లక్ష్యం

**మామిడిగుండాల భూ సమస్య పరిష్కారమే ధ్యేయం**
**4,200 ఎకరాలపై సమగ్ర సర్వేకు శ్రీకారం**
**2,400 ఎకరాల అసైన్డ్ భూములపై అర్హత పరిశీలన**
**ఇల్లందు ఎమ్మెల్యే కోరం కనకయ్య చొరవతో కదిలిన యంత్రాంగం**

**ఇల్లందు, అక్టోబర్ 5, ప్రభాతవార్త:**

భూమిని నమ్ముకుని జీవిస్తున్న



మామిడిగుండాల రైతుల చిరకాల భూ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపే దిశగా ప్రభుత్వం చేపడుతున్న చర్యలు స్థానిక రైతుల్లో కొత్త ఆశలు రేకెత్తిస్తున్నాయి. ఏళ్లుగా సాగు చేసుకుంటున్న భూములకు చట్టబద్ధమైన హక్కులు కల్పించాలనే రైతుల ఆకాంక్షకు అనుగుణంగా రెవెన్యూ అధికారులు సమగ్ర చర్యలకు పూనుకున్నారు. గ్రామంలోని సుమారు 4,200 ఎకరాల భూములపై సమగ్ర సర్వే చేపడుతుండగా, అందులోని 2,400 ఎకరాల అసైన్డ్ భూములపై అర్హులైన అనుభవదారులను గుర్తించే ప్రక్రియకు శ్రీకారం చుట్టారు. సోమవారం మామిడిగుండాల గ్రామంలో ప్రత్యేకంగా నిర్వహించిన రైతు సభలో



ఇల్లందు శాసనసభ్యులు కోరం కనకయ్య, ఆర్డీవో మధు, తహసీల్దార్ ఖాసీం పాల్గొని రైతుల సమస్యలను నేరుగా అడిగి తెలుసుకున్నారు. భూ సమస్యలకు పారదర్శక పరిష్కారం చూపేందుకు అనుసరించాల్సి న కార్యాచరణపై రైతులతో క్షేత్రస్థాయిలో చర్చించారు. రైతులకు పూర్తి న్యాయం జరగాలి ఎమ్మెల్యే కోరం కనకయ్య సందర్భంగా ఎమ్మెల్యే కోరం కనకయ్య మాట్లాడుతూ.. మామిడిగుండాల భూ సమస్యను పరిష్కరించేందుకు రెవెన్యూ యంత్రాంగం నిబద్ధతతో కృషి చేయాలని ఆదేశించారు. "తరతరాలుగా భూములను సాగు చేసుకుంటున్న పేద రైతులకు హక్కుల విషయంలో స్పష్టత రావలసిన అవసరం ఉంది. సర్వే నిర్వహించే సమయంలో క్షేత్రస్థాయి వాస్తవాలను, సాగుదారుల పరిస్థితిని ప్రధానంగా పరిగణనలోకి తీసుకోవాలి. ఒక్క అర్హుడైన రైతుకు కూడా అన్యాయం జరగకుండా చర్యలు తీసుకోవాలి" అని పేర్కొన్నారు. రైతుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి, వారికి హక్కు పత్రాలు లభించే వరకు తన వంతు సహకారం అందిస్తానని భరోసా ఇచ్చారు. క్షేత్రస్థాయి వాస్తవాల ఆధారంగానే సర్వే ఆర్డీవో మధుభూ సమస్య పరిష్కారంలో క్షేత్రస్థాయి పరిశీలనే ప్రామాణికమని ఆర్డీవో మధు స్పష్టం చేశారు. కేవలం రికార్డులను మాత్రమే కాకుండా, భూముల వాస్తవ పరిస్థితులు, ప్రత్యక్ష సాగు అనుభవాన్ని సమగ్రంగా తనిఖీ చేసి అర్హతను నిర్ధారిస్తామని వివరించారు. రైతులు తమ వద్ద ఉన్న భూ సంబంధిత పత్రాలను అందుబాటులో ఉంచుకుని, సర్వే అధికారులకు పూర్తి స్థాయిలో సహకరించాలని కోరారు. అర్హులైన అనుభవదారుల గుర్తింపు తహసీల్దార్ ఖాసీంషాతహసీల్దార్ ఖాసీంషా మాట్లాడుతూ.. మామిడిగుండాల పరిధిలోని సుమారు 2,400 ఎకరాల అసైన్డ్ భూములపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నట్లు వెల్లడించారు. మొదటి దశలో ప్రభుత్వ కార్యాలయాలు, రహదారులు, దేవాలయాలు మరియు గ్రామ అవసరాలకు కేటాయించిన భూములను సరిచూస్తామని, ఆ తర్వాత మిగిలిన భూముల్లో అర్హులైన అనుభవదారులను గుర్తించి నిబంధనల ప్రకారం చర్యలు తీసుకుంటామని చెప్పారు. హక్కుల పత్రాలపైనే రైతుల ఆశలుమామిడిగుండాల రైతులకు భూమి కేవలం ఆస్తి మాత్రమే కాదని, అది వారి జీవనాధారమని గ్రామస్థులు పేర్కొన్నారు. సమగ్ర సర్వే



పారదర్శకంగా జరిగి, అర్హులైన ప్రతి ఒక్కరికీ పట్టాలు అందజేస్తేనే ఈ సర్వేకు పూర్తి ప్రయోజనం చేకూరుతుందని ఆశిస్తున్నారు. ప్రజాప్రతినిధులు, అధికారులు నేరుగా గ్రామానికి వచ్చి చర్చించడం సమస్య పరిష్కారంపై సానుకూల వాతావరణాన్ని నింపింది. ఈ కార్యక్రమంలో డి.ఎస్.పి యు. వెంకన్న, ఎంపీడీవో ధన్సింగ్, డిప్యూటీ తహసీల్దార్, సర్వేయర్లు, పంచాయతీ అధికారులు, సర్పంచులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు రైతులు పాల్గొన్నారు.

# ఈ సారైనా..పేదోడి సొంతింటి కల నెరవేరేనా...?

**నిజమైన లబ్ధిదారుడికి ఇందిరమ్మ ఇండ్లు వచ్చేనా..?**
**నాయకుల చేతివాటానికి కళ్లెంపడేనా..?**
**అధికారుల పారదర్శక సర్వే అమలు జరిగేనా..?**
**అర్హత ఉన్న లబ్ధిదారులకు ఇండ్లు ఇచ్చి న్యాయం చేయాలని వేడుకోలు..**

**కొణిజర్ల అక్టోబర్ 05 ప్రభాత వార్త:**

భారతదేశానికి స్వాతంత్రం వచ్చి 80 ఏళ్ల కాలంలో అనేక రాజకీయ పార్టీలు పాలకుల రాజ్యాలు వస్తూ కాలం గడుస్తున్నా .. నేటికీ సంపన్నులు సంపన్నుల్లాగే ..పేదలు .పేదల్లాగే ఉన్నారనడంలో సందేహం లేదనడానికి నిలువెత్తు సాక్షయమే.. నేటికీ అనేక గ్రామాల్లో, పట్టణాల్లో సంవత్సరాల తరబడి నివసిస్తున్న నిరుపేదలకు ఆశించిన మేర ప్రభుత్వ పథకాల సాయం అందక పోవడంతో .. ఇప్పటికీ సరైన ఇల్లు ,కూడా లేక తడికల పాకలల్లోనే ముక్కి మూలుగుతూ జీవనం సాగిస్తున్న దుర్భర దౌర్భాగ్యం పేద బతుకులది. ఇట్టి దుస్తుతిని పారదోలాలనే సంకల్పంతో నేటి



కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం బృహత్తరమైన ముంద డుగు వేసి పేదోడి సొంతింటి కల నెరవేర్చాలనే లక్ష్యాన్ని అమలుకు శ్రీకారం చుట్టింది.. కొనిజర్ల మండలంలో గ్రామాల్లో మొదటి విడతలో ఇందిరమ్మ ఇండ్లు పంపిణీ చేసింది. కానీ అట్టి ఇళ్ల ఎంపికలో ఇందిరమ్మ కమిటీల నాయ కుల కనుసనల్లో చేతివాటం ప్రదర్శించి , అర్హత ఉన్న అనేక మంది లబ్ధిదారులకి మొండి చేయి చూపడంతో నిరాశే మిగిలడంతో . రగిలిపోయిన లబ్ధిదారులు స్థానిక అధికారులు, నాయకులను నిలదీ యడం, కొన్ని గ్రామాల్లో అయితే ఏకంగా జిల్లా కలెక్టర్కు ఫిర్యాదులు కూడా చేయడం గమనార్హం.

అట్టి సమస్యను పరిష్కారం చూపడం కోసం త్వరలో రెండో విడత ఇందిరమ్మ ఇండ్లు వస్తాయని అప్పుడు అందరికి న్యాయం చేస్తామని హామీ ఇచ్చి సర్ది చెప్పడం జరిగింది. కానీ నేడు అదే రెండో విడత ఇండ్ల మంజూరు చేసిన శుభ వార్త ప్రకటించింది. అందులో భాగంగా కొనిజర్ల మండలానికి 250 ఇండ్లతోపాటు, రూఫ్ రీప్లేస్మెంట్ కోసం అదనంగా మరో 107 ఇండ్లు మంజూరు చేసింది. అట్టి లబ్ధిదారుల ఎంపిక ఆయా స్థానిక అధికారుల సమక్షంలో ఇందిరమ్మ కమిటీలు సర్పంచులకు ఎంపిక పక్రియ అప్పగించింది. దీంతో గ్రామస్థాయిలో అధికారులు ఎంపిక చేయబడ్డ లబ్ధిదారులకు ఆశించిన మేర ప్రభుత్వం ఇందిరమ్మ ఇండ్లు కేటాయించకపోవడంతో, కోసరేసినట్లు ఇవ్వడం కేటాయించడంతో ఉన్న లబ్ధిదారుల్లో ఎవరికి ఇవ్వాలనే సందిగ్గం పడ్డారు. మరోపక్క లబ్ధిదారుల్లో ఓ పక్క హర్షం ప్రకటిస్తూనే మరో ప్రక్క .. ఎంపిక ప్రక్రియ గ్రామ స్థాయిలో ఉన్న నాయకులు ,ఇందిరమ్మ కమిటీ సభ్యులు ఎవరెవరిని ఎంపిక చేస్తారన్న అనుమాన భయం లబ్ధిదారులను వెంటాడుతుంది. బాగా ఇట్టి ఇందిరమ్మ ఇండ్ల ఎంపిక ఉన్నతాధికారుల పర్యవేక్షణలో పారదర్శకంగా నిర్వహిస్తే.. ఇల్లు లేని నిజమైన పేద లబ్ధిదారులకు పెద్ద ఊరట లభిస్తుంది. ఒకవేళ అలా జరగక ఈసారి కూడా రాజకీయ నాయకులు, సర్పంచులు, ఇందిరమ్మ కమిటీలు వారి వారి పార్టీల కనుసన్నల్లో ఉన్న వారికే ఇందిరమ్మ ఇల్లు ఇచ్చి లబ్ధిదారులుగా ఎంపిక చేసి పట్టం కడితే.. ఇల్లు లేని అర్హత కలిగిన అభాగ్యుల పొట్ట కొట్టిన వారు అవుతారనేది సత్యం. కావున సంబంధిత గ్రామాల అధికారులు,సర్పంచులు ,ఇందిరమ్మ కమిటీల సభ్యులు ఇందిరమ్మ ఇండ్ల ఎంపికలో అత్యంత పారదర్శకంగా వ్యవహరించి నిజమైన ఇల్లు లేని లబ్ధిదారులని ఎంపిక చేసి పేదల సొంతింటి కలఖను నెరవేర్చాలని లబ్ధిదారులు ముక్తకంఠంతో వేడుకొనుచున్నారు ..




## జీతాలు చెల్లించి ఆదుకోవాలి

**ప్రజావాణిలో అధికారులకు విన్నవించిన మిషన్ భగీరథ కార్మికులు**



**కామేపల్లి, అక్టోబర్ 5 ప్రభాతవార్త :**

తమకు రావలసిన జీతాలను వెంటనే చెల్లించి ఆదుకోవాలని కోరుతూ మిషన్ భగీరథ కార్మికుల అసోసియేషన్ ఆధ్వర్యంలో కార్మికులు సోమవారం కామేపల్లి మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో అధికారుల కు విన్నవించారు. నెలల తరబడి జీతాలు చెల్లించకపోవడంతో తాము నానా అవస్థలు పడుతున్నా మని వాపోయారు. వేతనాలు పెంచి చెల్లించాలని, ప్రతి నెల ఒకటో తేదీనే జీతాలను బ్యాంక్ ఎకౌంట్ ద్వారా చెల్లించాలని కోరారు. కామేపల్లి సిపిడబ్ల్యుఎస్ స్కీం కింద పని చేస్తున్న తమను ఇల్లందు సెగ్మెంట్ లోని గ్రిడ్ విభాగంలో చేర్చాలని అన్నారు. ఈ మేరకు వినతి పత్రం ను ఎంపీడీవో ధరావత్ సోంలాల్, తాసిల్దార్ కె వి శ్రీనివాసరావు, మిషన్ భగీరథ గ్రిడ్ కామేపల్లి ఏఈ డి.బాలజీ లకు అందజే శారు. దీంతో వారు స్పందిం చి ఆయా సమస్యల పరిష్కారానికి కృషి చేయడం జరుగుతుందన్నారు. తొలుత కార్మికులు మండల పరిషత్ కార్యాలయం ఎదుట ఆందోళన కూడా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మిషన్ భగీరథ కార్మికుల అసోసియేషన్ మండల అధ్యక్షులు గోకినేపల్లి నాగరాజు, ఉపాధ్యక్షులు చల్లా లక్ష్మయ్య, కోశాధికారి కనికరపు వినయ్, సహాయ కార్యదర్శి గుడిమెట్ల శేఖర్, అసోసియేషన్ సభ్యులు బత్తుల మల్లయ్య, దేవేండ్ల కొండ, తమ్మిశెట్టి సంపత్ కుమార్, చిల్ల కోటేశ్వరరావు, కనికరపు సంపత్, వాంకుడోత్ శ్రీకాంత్, దొంగల పవన్ కుమార్, పుట్టల వెంకటేష్, బొరిగొర్ల వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

## రగ్బీ పోటీల్లో రాణించిన ఎంజేపీ విద్యార్థులు

**కూసుమంచి, అక్టోబర్ 5 (ప్రభాతవార్త ) :**



ఖమ్మంలోని సర్దార్ పటేల్ స్టేడియంలో జరిగిన జిల్లా స్థాయి రగ్బీ అండర్ 14, అండర్ 17, త్రయ త్లాన్ విభాగంలో నాయకునిగూడెం లోని మహాత్మ జ్యోతిబా పూలే విద్యార్థులు అత్యంత ప్రతిభని కనబరిచినట్లు ప్రిన్సిపాల్ మల్లయ్య తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అండర్ 17 విభాగం లో ఏ. నాగరాజు 10వ తరగతి , ఎస్. అశ్వంత్ 9వ తరగతి అండర్ 14 విభాగం లో కె.యశ్వంత్, మహేష్, ఎం.యశ్వంత్ , ఆలాగే కె. యశ్వంత్ అండర్ 14 త్రాయతన్ లో రాష్ట్ర స్థాయికి ఎంపికయినట్లు తెలిపారు. విజయం సాధించిన విద్యార్థులను ఖమ్మం జిల్లా బిసి గురుకులాల ఆర్సిఒ సి.హెచ్. రాంబాబు , ప్రిన్సిపాల్ పి. మల్లయ్యా, ఏటీపీ ప్రేమలత, వ్యాయామ ఉపాధ్యాయులు బి. నరసింహ, టి.భాస్కర్ పాఠశాల సిబ్బంది అభినందించారు. ఈ సందర్భంగా విద్యార్థుల తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేసారు.




# 100శాతం ఉత్తీర్ణత సాధించిన పాఠశాలల హెచ్ఎంలకు సన్మానం

**దమ్మపేట, అక్టోబర్ 5 ప్రభాతవార్త:**



నియోజకవర్గంలో గత విద్యాసంవత్సరంలో పదో తరగతి పరీక్షల్లో 100 శాతం ఉత్తీర్ణత సాధించిన పాఠశాలల ప్రధానోపాధ్యాయులను ఎమ్మెల్యే జారె ఆదినారాయణ ఆధ్వర్యంలో గండుగులపల్లి మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో సోమవారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ విద్యార్థులు మంచి ఫలితాలు సాధించడం వెనుక ఉపాధ్యాయుల కృషి అంకితభావం ఎంతో కీలకమని అన్నారు. విద్యార్థులకు పాఠ్యాంశాలు బోధించడంతో పాటు వారిలో క్రమశిక్షణ ఆత్మవిశ్వాసం ఉన్నత లక్ష్యాలను పెంపొందించడంలో ఉపాధ్యాయుల పాత్ర ఎంతో గొప్పదని పేర్కొన్నారు. ప్రపంచ ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా విద్యార్థుల భవిష్యత్తు కోసం నిరంతరం శ్రమిస్తున్న ఉపాధ్యాయుల సేవలను గుర్తించి గౌరవించడం మనందరి బాధ్యత అన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులు కూడా ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా మంచి ఫలితాలు సాధిస్తున్నారని ఇందుకు ఉపాధ్యాయుల కృషి ప్రధాన కారణమని తెలిపారు. అశ్వారావుపేట నియోజకవర్గంలో విద్యకు విద్యార్థుల భవిష్యత్తుకు మరింత ప్రాధాన్యత ఇస్తామని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. ప్రతి విద్యార్థి ఉన్నతంగా ఎదగాలనే లక్ష్యంతో పాఠశాలల్లో అవసరమైన వసతుల కల్పనకు విద్యా ప్రమాణాల పెంపునకు తన వంతు సహకారం అందిస్తున్నానని ఇంకా అందిస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో దమ్మపేట ఎంఈఓ జగపతి రావు, ములకలపల్లి ఎంఈఓ సత్యనారాయణ, అశ్వరావుపేట ఎంఈఓ ప్రసాద్ రావు, చంద్రుగొండ ఎంఈఓ సూరయ్య, మాజీ ఎంఈఓ కీసరి లక్ష్మీ, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

## నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

**దమ్మపేట, రూరల్ అక్టోబర్ 5 ప్రభాత వార్త :**

33 కేవీ మందలపల్లి లైన్‌లో మెయింటెనెన్స్ పనులు చేపడుతున్నందున మంగళవారం 06102026 ఉదయం 8:30 గంటల నుంచి మధ్యాహ్నం 1:00 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడనుందని విద్యుత్ శాఖ అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు. మందలపల్లి, రంగువారిగూడెం, గాంధీనగరం ఫీడర్ల పరిధిలోని రైతులకు ఈ సమయంలో త్రీఫేస్ విద్యుత్ సరఫరా నిలిచిపోతుందని పేర్కొన్నారు. వినియోగదారులు, రైతులు ఈ విషయాన్ని గమనించి విద్యుత్ శాఖ సిబ్బందికి సహకరించాలని అధికారులు కోరారు.

## పోగొట్టుకున్న సెల్‌ఫోన్ రికవరీ చేసిన పోలీస్‌లు

**అశ్వారావుపేట రూరల్, అక్టోబర్ 5 ప్రభాతవార్త:**




ఓ వ్యక్తి పోగొట్టుకున్న మొబైల్‌ను పోలీస్‌లు సిఐఐఆర్ నెంబర్ ద్వారా గుర్తించి బాధిత వ్యక్తికి అందజేశారు. వివరాలు ఇలా ఉన్నాయి. మండల కేంద్రం అశ్వారావుపేటకు చెందిన ఉపాధ్యాయుల వరలక్ష్మి ఈనెల 19న తన యొక్క ఫోన్‌ను పోగొట్టుకున్నారు. ఈ క్రమంలో ఆమె పోలీస్‌లను సంప్రదించగా సిఈఐఆర్ పోర్టల్ ద్వారా అట్టి ఫోన్‌ను రికవరీ చేసి బాధితునికి స్థానిక పోలీస్ స్టేషన్‌లో సోమవారం అందజేశారు.

## కేశప్పగూడెంలో ఘనంగా పోషకాహార వారోత్సవాలు

**అశ్వారావుపేట టౌన్, అక్టోబర్ 5 ప్రభాతవార్త:**



ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలోని కేశప్పగూడెం గ్రామంలో పోషకాహార వారోత్స వాల కార్యక్రమాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలోని తల్లులు, గర్భిణులు, బాలింతలకు పోషకాహారం యొక్క ప్రాముఖ్యతపై అధికారులు, నిర్వాహకులు సమగ్రంగా అవగాహన కల్పించారు. రోజువారీ ఆహారంలో సరిపడా పోషక విలువలు ఉన్న ఆహారాన్ని తీసుకోవడం వల్ల ఆరోగ్యంగా ఉండవచ్చని వివరించారు. గర్భిణీలు, బాలింతలు అంగన్‌వాడీ కేంద్రాల్లో అందించే పోషకాహారాన్ని తప్పనిసరిగా తీసుకోవాలని, తద్వారా ఆరోగ్యవంతమైన బిడ్డకు జన్మనివ్వవచ్చని తెలిపారు. తక్కువ ఖర్చుతో లభించే ఆకుకూరలు, స్థానిక కూరగాయలు, తృణధాన్యాల ద్వారా ఎక్కువ పోషక విలువలను పొందే విధానాలను వివరించారు. గ్రామ పంచాయతీ కార్యదర్శి సతీష్ కుమార్, పాఠశాల హెచ్.ఎం రాము, అంగన్‌వాడీ టీచర్లు లక్ష్మీకుమారి, నర్సమ్మ, వెంకాయమ్మ, సుధ తదితరులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్సీ ఓటును నమోదు చేసుకోవాలి

**అశ్వారావుపేట రూరల్, అక్టోబర్ 5 ప్రభాతవార్త:**



అర్హులైన వారందరూ గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఓటును నమోదు చేసుకోవాలని బిఆరఎస్ పార్టీ మండల కోఆర్డినేటర్ జూపల్లి రమణారావు కోరారు. సోమవారం గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఓటరు నమోదు కార్యక్రమం పై అవగాహన కల్పించారు. ఉన్నత నాయకత్వం ఆదేశాల మేరకు రానున్న గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని 2023 అక్టోబర్ నాటికి నాటికి డిగ్రీ, డిప్లమో పూర్తి చేసిన ప్రతి ఒక్కరు ఎమ్మెల్సీ ఓటుకు అర్హులనీ వీరందరినీ పట్టభద్రులను ఓటరుగా నమోదు చేయించేందుకు మండల పార్టీ ఆధ్వర్యంలో అవగాహన కల్పిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ జల్లిపల్లి శ్రీరామమూర్తి, సంక ప్రసాద్, యూఎస్ ప్రకాష్ రావు, చిప్పనపల్లి శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

## పర్యావరణ పరిరక్షణకు మొక్కలు దోహదం: ఎమ్మెల్యే జారె

**అశ్వారావుపేట రూరల్, అక్టోబర్ 5 ప్రభాతవార్త:**



ప్రధాన రహదారుల వెంట మొక్కలు పెంచడం వల్ల పట్టణ సుందరీకరణతో పాటు పర్యావరణ పరిరక్షణకు కూడా కొంతమేర దోహదపడుతుందని ఎమ్మెల్యే జారె ఆదినారాయణ పేర్కొన్నారు. సెంట్రల్ డివైడర్లలో మొక్కలను నాటే కార్యక్రమాన్ని సోమవారం ఎమ్మెల్యే జారె ప్రారంభించారు. ఈ క్రమంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ పట్టణంలో అభివృద్ధి పనులతో పాటు పచ్చదనం, పారిశుధ్యం, రహదారుల సుందరీకరణకు ప్రాధాన్యత ఇవ్వాల్సిన అవసరం ఉందని అన్నారు. పట్టణంలోకి వచ్చే ప్రజలకు, స్థానికులకు ఆహ్లాదకరమైన వాతావరణం కల్పించేలా ప్రధాన రహదారులను మరింత సుందరంగా తీర్చిదిద్దేందుకు చర్యలు కొనసాగుతున్నాయని తెలిపారు. ప్రభుత్వ సంస్థలు, మున్సిపాలిటీ, ప్రజలు సమన్వయంతో పనిచేస్తే పట్టణంలో పచ్చదనాన్ని మరింత పెంచవచ్చని అన్నారు. మొక్కలు నాటడం ఒక్కటే కాకుండా వాటిని సంరక్షించడం ప్రతి ఒక్కరి బాధ్యతగా తీసుకోవాలని సూచించారు. మొక్కలు పెరిగి పచ్చదనం విస్తరించినప్పుడు పట్టణానికి ప్రత్యేక ఆకర్షణ ఏర్పడుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ జూపల్లి రమేష్, నాయకులు చెన్నంశెట్టి సత్యనారాయణ, సుంకవల్లి వీరభద్రం, తుమ్మ రాంబాబు, కౌన్సిలర్‌లు, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## మంత్రి తుమ్మల ను కలిసిన పలువురు ప్రముఖులు

**దమ్మపేట, అక్టోబర్ 5 ప్రభాతవార్త:**

దమ్మపేట మండల పరిధిలోని గండుగులపల్లి గ్రామంలో సోమవారం ఉదయం రాష్ట్రవ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావును అశ్వారావుపేట, సత్తుపల్లి నియోజకవర్గాల సీనియర్ నాయకులు తుమ్మల అభిమానులు పలువురు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా రెండు నియోజకవర్గాల నుంచి ప్రజలు అధిక సంఖ్యలో వారి సమస్యల పరిష్కారానికై మంత్రి తుమ్మలకి వినతి పత్రాలు సమర్పించారు. స్థానిక శాసనసభ్యుల సహకారంతో ప్రజల సమస్యలను పరిష్కరించడమే ప్రభుత్వ లక్ష్యమని అంతేకాకుండా జిల్లాను అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడమే తన లక్ష్యమని మంత్రి తుమ్మల తెలిపారు.



## ఈనెల 7న అన్నపురెడ్డిపల్లిలో విద్యుత్ సమస్యల పరిష్కార వేదిక

### విద్యుత్ శాఖ ఇంజనీర్ రత్నకుమార్

**జూలూరుపాడు, ప్రభాతవార్త, అక్టోబర్ 5:**



విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కారం కోసం వినియోగదారుల ఫిర్యాదుల పరిష్కార వేదిక (సీజీఆర్ఎఫ్ -1, వరంగల్) ఆధ్వర్యంలో ఈనెల 7వ తేదీన అన్నపురెడ్డిపల్లిలో ప్రత్యేక సమావేశం నిర్వహిస్తున్నట్లు జూలూరుపాడు విద్యుత్ శాఖ ఇంజనీర్ రత్నకుమార్ సోమవారం విలేకరులకు తెలిపారు. అన్నపురెడ్డిపల్లి, చంద్రుగొండ, జూలూరుపాడు, సుజాతనగర్ మండలాల పరిధిలోని విద్యుత్ వినియోగదారులు తమ సమస్యల పరిష్కారం కోసం ఈ సమావేశంలో ఫిర్యాదు చేయవచ్చని తెలిపారు. అన్నపురెడ్డిపల్లిలోని 33/11 కేవీ సబ్‌స్టేషన్‌లో ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు సమావేశం జరుగుతుందని తెలిపారు. విద్యుత్ బిల్లులు, మీటర్ సమస్యలు, విద్యుత్ సరఫరాలో అంతరాయాలు, కొత్త విద్యుత్ కనెక్షన్లు, కనెక్షన్‌కు సంబంధించిన ఇతర సమస్యలు, విద్యుత్ సేవలపై ఫిర్యాదులను సమావేశంలో స్వీకరించనున్నట్లు తెలిపారు. ఫిర్యాదుదారులు తమ సమస్యలకు సంబంధించిన వివరాలు, అవసరమైన పత్రాలను వెంట తీసుకురావాలని సూచించారు. మండల పరిధిలోని ప్రజాప్రతినిధులు, వివిధ సంఘాల నాయకులు ఈ సమావేశంపై ప్రజలకు అవగాహన కల్పించి, విద్యుత్ సమస్యలు ఎదుర్కొంటున్న మండల వినియోగదారులు పెద్ద సంఖ్యలో హాజరయ్యేలా సహకరించాలని కోరారు.

## కార్మికులకు 40 శాతం లాభాల వాటా ఇవ్వాలి

### జెన్‌కో, ట్రాన్స్‌కో బకాయిలు వసూలు చేయాలి..

### మెటీరియల్ కొరత తీర్చాలి: ఏఐటీయూసీ

**రుద్రంపూర్, అక్టోబర్ 5 ప్రభాతవార్త:**

2025-26 ఆర్థిక సంవత్సరానికి సింగరేణి వార్షిక లాభాలను వెంటనే ప్రకటించి కార్మికులకు 40 శాతం లాభాల వాటా చెల్లించాలని ఏఐటీయూసీ అదనపు ప్రధాన కార్యదర్శి మిరియాల రంగయ్య డిమాండ్ చేశారు. సోమవారం సింగరేణి గనులు, డిపార్ట్‌మెంట్ల వద్ద వినతిపత్రాలు సమర్పించారు. కార్మికుల రక్షణకు అవసరమైన మెటీరియల్, పరికరాల కొరతను తక్షణమే తీర్చాలని కోరారు. అక్టోబర్, నవంబర్‌లో చెల్లించాల్సిన పండుగ అడ్వాన్స్, బోనస్, లాభాల వాటా, పీఎల్ఆర్ఎస్‌లను సకాలంలో చెల్లించాలని అన్నారు. జెన్‌కో, ట్రాన్స్‌కో నుంచి సింగరేణికి రావాల్సిన సుమారు రూ.59 వేల కోట్ల బకాయిలను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే ఇప్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ నాయకులు, కార్మికులు పాల్గొన్నారు. కత్తెర్ల రాములు, క్రిస్టోఫర్, సహాయ కార్యదర్శి రాము, ఆఫీస్ బ్యారర్స్ గుమ్మడి వీరయ్య, హీరాలాల్, హుమాయూన్, ఎస్ నాగేశ్వరరావు, నాగయ్యా, నితిన్, పిట్ కార్యదర్శిలు భుక్య రమేష్, మధు కృష్ణ, కమల్, సురేందర్, మెంగన్ రవి, కోటి, నరేష్, సుధీర్, అనంత లక్ష్మి, రమేష్, మల్లికార్జున్, శ్యాం కిరణ్,నాయకులు రామచందర్ సందీప్, సాయిపవన్, మురళి, ఓదెలు, శ్రీనివాస్, అవినాష్, రాజాలపూడి సాంబమూర్తి, రమేష్, కరుణాకర్, గుమ్మడి మురళి, సురేందర్ రెడ్డి, కుమార్ రావు, సందీప్ తదితరులు పాల్గొన్నారు.




# లాభాల్లో కార్మికులకూ వాటా ఇవ్వాలి

**40 శాతం లాభాల వాటా ప్రకటించి చెల్లించాలి**

**ఏఐటీయూసీ**

సత్తుపల్లి అక్టోబర్5 ప్రభాతవార్త

కార్మికుల శ్రమతో సింగరేణి సాధిస్తున్న లాభాల్లో వారికి తగిన వాటా కల్పించాలని సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ ఏఐటీయూసీ డిమాండ్ చేసింది. 2025-26 ఆర్థికసంవత్సరానికి సంబంధించిన వార్షిక లాభాలను వెంటనే ప్రకటించి, కార్మికులకు 40 శాతం లాభాల వాటాను చెల్లించాలని కోరింది. కార్మికుల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని కోరుతూ సోమవారం సింగరేణి వ్యాప్తంగా అన్ని గనులు, డిపార్ట్మెంట్ల వద్ద వినతిపత్రాలు సమర్పించారు. ఇందులో భాగంగా సత్తుపల్లి ఏరియాలో వినతిపత్రాలు అందజేశారు. ఈసందర్భంగాఏఐటీయూసీ నాయకులు మాట్లాడుతూ సింగరేణి అభివృద్ధికి, బొగ్గు ఉత్పత్తికి కార్మికుల సేవలు కీలకమన్నారు. వారి శ్రమతో సంస్థకు లాభాలు వస్తున్నప్పుడు ఆ లాభాల్లో కార్మికులకు తగిన వాటా అందించడం యాజమాన్యం బాధ్యతఅనిపేర్కొన్నారు.గతంలో కొనసాగిన సంప్రదాయాన్నిఅనుసరించి గుర్తింపు పొందిన కార్మిక సంఘంతో చర్చించి లాభాల



వాటాను ప్రకటించాలని డిమాండ్చేశారు. సింగరేణిలో ఉత్పత్తి, కార్మికుల రక్షణకు అవసరమైన మెటీరియల్, పరికరాల కొరత ఏర్పడుతోందని కార్మికులు ఆందోళన వ్యక్తంచేస్తున్నారని నాయకులు తెలిపారు. మెటీరియల్ కొనుగోలుకు నిధుల కొరత ఉందని యాజమాన్యం పేర్కొనడం ఆందోళనకరమన్నారు. ఉత్పత్తి లక్ష్యాల సాధనతో పాటు కార్మికుల ప్రాణ రక్షణకు అవసరమైన పరికరాలు, మెటీరియల్‌ను తక్షణమే అందుబాటులోకి తేవాలని కోరారు.అక్టోబర్, నవంబర్ నెలల్లోకార్మికులకు చెల్లించాల్సిన పండుగ అడ్వాన్స్, లాభాల వాటా, దీపావళిబోనస్ ,పీఎల్ఆర్ఎస్ తదితర ఆర్థిక ప్రయోజనాలను సకాలంలో అందించాలని డిమాండ్ చేశారు. చెల్లింపుల్లో జాప్యం జరిగితే కార్మికులు, వారి కుటుంబాలు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొనే అవకాశంఉందన్నారు.రూ.59 వేల కోట్ల బకాయిలు వసూలు చేయాలి తెలంగాణ జెన్కో, ట్రాన్స్‌కో సంస్థల నుంచి సింగరేణికి సుమారు రూ.59 వేల కోట్ల బకాయిలు రావాల్సి ఉన్నాయని ఏఐటీయూసీ నాయకులుపేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చొరవ తీసుకుని ఆ బకాయిలను వెంటనే సింగరేణికి ఇప్పించాలనికోరారు.బకాయిలు అందితే సంస్థ ఆర్థిక పరిస్థితిని బలోపేతం చేయడంతో పాటు ఉత్పత్తి, రక్షణకు అవసరమైన మెటీరియల్ కొనుగోలు, కార్మికుల ఆర్థికప్రయోజనాల చెల్లింపులకు అవకాశం ఏర్పడుతుందని తెలిపారు. బ్రాంచ్ కార్యదర్శి సముద్రాల సుధాకర్,వైస్ ప్రెసిడెంట్ దార.భీమయ్య, పిట్ కార్యదర్శి జి.నరసింహారావు, జేవీఆర్ సీ హెచ్ పి డి.ప్రసాద్, జి.శ్రీనివాస్,టీ.ఉపేంద్రచారి, వి.వినయ్ కుమార్, మురళి, బుగ్గ సుధాకర్, జి.బాలసుబ్రహ్మణ్యం, బి.మధుకుమార్, భరత్ శ్రీను, రామకృష్ణ, తిరుపతి, శంకర్, రామ్‌మోహన్, కొండల్, శ్రవణ్, గంజా వెంకటేశ్వర్లు, జయరాజు, నాజర్, యాకూబ్, ఉపేందర్, రవి తదితరులు పాల్గొన్నారు. మేనేజర్ బెజ్జంకి రాజేశ్వరరావుకు వినతిపత్రం అందజేశారు.

# ఖాదర్ బాబా కుటుంబానికి రూ 20, వేలుచెక్కు అందించిన ఐసిడిఎస్ శాఖ

సత్తుపల్లి అక్టోబర్ 5 ప్రభాతవార్త



సత్తుపల్లి మున్సిపాలిటీ పరిధిలోని రాజీవ్ నగర్ కు చెందిన సీనియర్ జర్నలిస్ట్ ఎస్ కే ఖాదర్ బాబా సతీమణి అంగనవాడి టీచర్ జక్కుల ఉషారాణి ఆదివారం రాత్రి హైదరాబాద్లో ప్రైవేటు హాస్పిటల్లో చికిత్స పొందుతూ మృతి చెందారు. ఈ విషయం తెలుసుకున్న ఖమ్మం జిల్లా మహిళా అభివృద్ధి అధికారిని ప్రమీల సూచనల మేరకు ఐసిడిఎస్ శాఖ నిబంధన ప్రకారం దహన సంస్కారాలకు రూ 20,000 వేల రూపాయలను సత్తుపల్లి ఐసిడిఎస్ ప్రాజెక్టు అధికారిని భవిరిశెట్టి సత్యవతి ద్వారా సోమవారం మృతురాలి భర్త ఖాదర్ బాబా, కుమారుడు రాహుల్ మున్నికి చెక్కు అందజేయడం జరిగింది. సోమవారం ఉదయం రాజీవ్ నగర్ కాలనీలోని వారి నివాసానికి వెళ్లి ఉషారాణి మృతదేహానికి ప్రాజెక్టు అధికారిని బి సత్యవతి, సూపర్వైజర్లు సుజాత, రమాదేవి, రజిని, మహాలక్ష్మి , పలువురు టీచర్లు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.

**ఉషారాణికి నివాళులర్పించిన మాజీ ఎమ్మెల్యే**



మున్సిపాలిటీ పరిధిలోని రాజీవ్ నగర్ కాలనీ చెందిన సీనియర్ జర్నలిస్టు ఎస్కే ఖాదర్ బాబా సతీమణి ఉషారాణి మృతి చెందిన విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకట వీరయ్య, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ అధ్యక్షులు కొత్తూరు ఉమామహేశ్వరరావు లు సోమవారం వారి స్వగృహానికి వెళ్లి మృతదేహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. భర్త ఖాదర్ బాబా, కుమారుడు రాహుల్ మున్నిని మృతి గల కారణాలు అడిగి తెలుసుకొని, వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. వారి వెంట పార్టీ నాయకులు షేక్ చాంద్ పాషా, రామిశెట్టి కృష్ణ, తదితరులు ఉన్నారు.

# జర్నలిస్ట్ ఖాదర్ బాబా సతీమణి ఉష మృతికి ఎమ్మెల్యే దంపతులు సంతాపం

సత్తుపల్లి అక్టోబర్ 5 ప్రభాతవార్త

సత్తుపల్లి పట్టణానికి చెందిన సీనియర్ జర్నలిస్ట్ ఖాదర్ బాబా సతీమణి ఉషారాణి హైదరాబాద్‌లోని ఓ ఆస్పత్రిలో ఆదివారం రాత్రి మృతి చెందారు.ఈ విషయం తెలుసుకున్న సత్తుపల్లి ఎమ్మెల్యే డా మట్టారాగమయి దయానంద్ , రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు డా. మట్టా దయానంద్, మున్సిపల్ చైర్ పర్సన్ మహమ్మద్ రెహానా కమలపాషా,జాతీయ బీసి సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు నారాయణ వరపు శ్రీనివాస్, కాంగ్రెస్ నాయకులు మహమ్మద్ కమల్ పాషా లు సత్తుపల్లిలోని ఖాదర్ బాబా నివాసానికి సోమవారం వెళ్లి ఉషారాణి పార్థివ దేహాన్ని సందర్శించి



పూలమాలవేసినివాళులర్పించి, కుమారుడు రాహుల్ మున్ని, భర్త ఖాదర్ బాబాను పరామర్శించి మృతి గల కారణాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఖాదర్ బాబా కుటుంబ సభ్యులను పరామర్శించి తమ ప్రగాఢ సానుభూతిని తెలిపారు.ఈ విషాద సమయంలో కుటుంబ సభ్యులకు మనోధైర్యం కలగాలని, ఉష ఆత్మకు శాంతి చేకూరాలని ఎమ్మెల్యే దంపతులు ప్రార్థించారు. అనంతరం ఖాదర్ బాబా కుటుంబ సభ్యులందరికీ ప్రగాఢ సానుభూతి తెలిపారు. సత్తుపల్లి జర్నలిస్టులు సైబుద్దీన్, బీవీ రామారావు, బాలకృష్ణ నిమ్మగడ్డ శ్రీకాంత్ చక్ర పు త్రిమూర్తులు, గురవయ్య , రామకృష్ణ, సురేష్, పాష, తదితరులు పార్థివ దేహాన్ని సందర్శించే పూలమాలు వేసి ఘనంగా నివాళులర్పించి ఖాదర్ బాబా కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు.

# ఆసుపత్రి కార్మికులు కు పెండింగ్ వేతనాలు చెల్లించాలని ధర్నా

**ఏఐటియుసి**

కల్లూరు,అక్టోబర్ 05, ప్రభాతవార్త

ఆసుపత్రి కార్మికులకు గత మూడు నెలలుగా చెల్లించాల్సిన పెండింగ్ వేతనాలను వెంటనే చెల్లించాలని కోరుతూ ధర్నా నిర్వహించి కల్లూరు సబ్ కలెక్టర్ అజయ్ యాదవ్ కు ఆసుపత్రి కార్మికులు ఏఐటీయూసీ ఆధ్వర్యంలో సోమవారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా తెలంగాణ మెడికల్ కాంట్రాక్ట్ అండ్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు వేము రాంబాబు మాట్లాడుతూ గత మూడు నెలలుగా కల్లూరు లోని ప్రభుత్వ ఆసుపత్రిలో పనిచేస్తున్న ఆసుపత్రి కార్మికులు పేషంట్ కేర్, శానిటేషన్, సెక్యూరిటీ ,కార్మికులకు వేతనాలు అందక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ప్రతి నెల మొదటి వారంలో ఇవ్వాల్సిన వేతనాలు ఇవ్వకుండా ప్రభుత్వం ఇబ్బంది పెడుతుందని పేర్కొన్నారు. వేతనాలు పెంపు, ప్రతి నెల ఒకటో తేదీన కార్పొరేషన్ ద్వారావేతనాలు చెల్లింపు, కార్మిక చట్టాల అమలు తదితర డిమాండ్లతో కూడిన తెలంగాణ మెడికల్ కాంట్రాక్ట్ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ ఏఐటీయూసీ ఆధ్వర్యంలో సబ్ కలెక్టర్ కార్యాలయం ముందు ఆందోళన కార్యక్రమం నిర్వహించి సబ్ కలెక్టర్ అజయ్ యాదవ్ కు వినతిపత్రం అందజేశారు. ఆసుపత్రి కార్మికుల జిల్లా కార్యదర్శి వంశీ నాయక్, కార్మికులు ప్రమోద్ ,జాన్ బి, రమాదేవి, నాగమణి సురేంద్ర ,తదితరులు పాల్గొన్నారు.

# పెనుబల్లి మండలంలో మాజీ ఎమ్మెల్యే సండ్ర పరామర్శలు

పెనుబల్లి, అక్టోబర్ 05, ప్రభాతవార్త



మండల పరిధిలోని కర్రాలపాడు, కొండ్రుపాడు గ్రామాలలో సోమవారం మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకట వీరయ్య పలువురిని పరామర్శించారు. తొలుత కర్రాలపాడు గ్రామానికి చెందిన బీఆర్ఎస్ పార్టీ నాయకుడు ఆళ్ల రాంబాబు తండ్రి ఆళ్ల ముత్తయ్య, ఇటీవలే చనిపోయిన కొండ్రుపాడు గ్రామానికి చెందిన యలమంచిలి రామచంద్రయ్య చిత్ర పటానికి నివాళ్లు అర్పించి కుటుంబ సభ్యులను పరామర్శించారు. మండల అధ్యక్షులు కనగాల వెంకట్రావు, మాజీ జెడ్పిటిసి చెక్కిలాల మోహన్ రావు లక్కినేని వినీల్ బాబు, మండదపు అశోక్ కుమార్, మాజీ కోప్షన్ సభ్యులు గౌస్, మాజీ సర్పంచ్ తావు నాయక్, టీవీ రామారావు, మాజీ సర్పంచ్ మల్లయ్య, వలదాసు రవి, వేము గోవింద్, కాకా సీతారాములు, కన్నె పోగు నాగరాజు, ఆళ్ల రంగా, బానోత్ శ్రీను, ఆళ్ల జగన్, గడ్డిపాటి వీరభద్రరావు, కొలికపోగు ప్రతాప్, నల్లమోతు వెంకటేశ్వరావు, తడికమళ్ళ శేఖర్, రేగుముడి అప్పయ్య, మూడు భాష నాగేశ్వరావు తదితరులు పాల్గొన్నారు.

# పంచెల వేడుకకు హాజరైన మట్టా దయానంద్

కల్లూరు,అక్టోబర్ 05, ప్రభాతవార్త



కల్లూరు మున్సిపాలిటీలో రామానగర్ కాలనీ నందు దుర్గారావు కృష్ణవేణి దంపతుల కుమారుడు చిరంజీవి హేమ కిరణ్ కు పంచెల వేడుకకు హాజరైన రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు డాక్టర్ మట్టా దయానంద్ విజయకుమార్ హేమ కిరణ్ ని ఆశీర్వదించి ఆయురారోగ్యాలు నిండా నూరేళ్ల సంతోషంగా ఉండాలని దీవించారు. కుటుంబ సభ్యులతో, ఫోటోలు దిగి మండల నాయకులతో కార్యకర్తలతో మాట్లాడి, కల్లూరు మండల సమస్యలు గురించి తెలుసుకొని, కొన్నిసూచనలు ఇచ్చారు. అనంతరం బత్తులపల్లి తులసమ్మ పెద్దకర్మకి హాజరైనారు.ఈ కార్యక్రమంలో మున్సిపాలిటీ చైర్మన్ మోహన్ నాయక్ గారు పసుమర్తి చంద్రరావు, మండల పార్టీ అధ్యక్షులు పొట్టు అర్జున్ రావు, భాగం నీరజ, ఆళ్ళకుంట నర్సింహారావు, పాపబత్తిని నగేష్ , ఏనుగు సత్యంబాబు, పెద్దబోయిన శ్రీనివాసరావు, బైర్ల కాంతారావు, మట్టా రామకృష్ణ, పరిమి భరత్, తురాబ్ అలీ, శివ నాయక్, యాస శ్రీకాంత్, ఉబ్బన రాంబాబు, అభిలాష్,ఎస్.కె మైబు వెంకటేశ్వరరావు ,దినాకర్, పంతులునాయక్, పుల్లాచారి, భూక్యకృష్ణ, బాలయ్య, దామలరాజు, కొర్ర నరసింహ పాల్గొన్నారు.

## ఆర్ అండ్ బి అధికారుల పని తీరు పై ప్రజావాణిలో ఫిర్యాదుల పరంపర

**నేలకొండపల్లి, అక్టోబర్ 5 ప్రభాతవార్త:**

ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన మండల స్థాయి ప్రజావాణిని పలు శాఖల అధికారులు అంతగా పట్టించుకోవటం లేదు. సోమవారం నేలకొండపల్లి మండల పరిషత్ కార్యాలయంలో తహశీల్దార్ పి.రాంప్రసాద్, ఎంపీడీవో యం.యర్రయ్య ల ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రజావాణికి మండల స్థాయి అధికారులు దుమ్మా కొట్టారు. కింది స్థాయి సిబ్బందిని గ్రీవెన్స్ కు పంపించి చేతులు దులుపుకుంటున్నారనే విమర్శలు వినవస్తున్నాయి. మండల వ్యవసాయాధికారి తప్ప మిగతా శాఖల అధికారులు అంతా కూడ రాకుండా వారి సిబ్బందిని పంపించారు. మరి కొన్ని శాఖల



అధికారులు కనీసం వారు సిబ్బందిని కూడ పంపించలేదు. మరి కొంత మంది సమయ పాలన పాటించకుండా ఏదో వచ్చామనే భావన కలిగేలా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు వినవస్తున్నాయి. ఆర్అండ్ బి అధికారుల తీరు పై ప్రతీ ప్రజావాణి లో తాము ఫిర్యాదు చేసిన పట్టించుకోవటం లేదని కనీసం సమాచారం అడిగేందుకు జేఈ అధికారి కూడ రావటం లేదని కొత్తకొత్తూరు గ్రామానికి చెందిన పాగర్తి సుధాకర్ అధికారులకు ఫిర్యాదు చేశారు. నేలకొండపల్లి, కొత్తకొత్తూరు, తిరుమలాపురం పంచాయతీల రహదారి డివైడర్ మధ్యలో వేసిన లైట్లు వెలగటం లేదని పలుమార్లు ఫిర్యాదు చేసిన పట్టించుకోవటం లేదని ఆరోపించారు. కనీసం లైట్ల ను పంచాయతీలకు అప్పగించిన నిర్వహ ణ బాధ్యత పంచాయతీలు వారు చూసుకుంటారని వెంటనే చర్యలు తీసుకోకపోతే ప్రత్యక్ష ఆందోళన చేస్తామని హెచ్చరించారు. ఈ విషయంను జిల్లా అధికారుల దృష్టికి తీసుకెళ్తామని ఎంపీడీవో హామీ ఇచ్చారు. వివిధ సమస్యల పై దరఖాస్తులు అందించారు. ఈ ప్రజావాణి కార్యక్రమంలో పలువురు పాల్గొన్నారు.




## మిర్చి తోటను ధ్వంసం చేసిన ఘటనపై పోలీస్ స్టేషన్ లో కేసు నమోదు.



**తిరుమలాయపాలెం ప్రభాత వార్త అక్టోబర్ 5**

.తిరుమలాయపాలెం మండలం లోని బచ్చోడు గ్రామంలో రైతుల మిర్చి తోటను అర్ధరాత్రి ధ్వంసం చేసిన ఘటన చోటుచేసుకుంది. రైతులు ఎన్నబోయిన ఉప్పయ్య, లింగయ్యలకు చెందిన మిర్చి తోట పూతకొచ్చిన దశలో ఉండగా, వారు ఎవరూ లేని సమయంలో తాటికొండ సనాతన చారి అనే వ్యక్తి అర్ధరాత్రి తోటలోకి ప్రవేశించి మిర్చి మొక్కలను పీకి వేసినట్లు రైతులు ఆరోపించారు. ఈ ఘటనతో రైతులకు దాదాపు రూ.1 లక్ష వరకు ఆస్తి నష్టం వాటిల్లినట్లు తెలిపారు. పంట చేతికొచ్చే సమయంలో మిర్చి మొక్కలను ధ్వంసం చేయడంతో తీవ్రంగా నష్టపోయామని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ఘటనపై రైతుల ఫిర్యాదు మేరకు తిరుమలాయపాలెం పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ రాజయ్య తెలిపారు. అంతేకాకుండా, నిందితుడు వివిధ రకాలుగా బెదిరింపులకు పాల్పడుతున్నాడని రైతులు ఆరోపిస్తూ, తమకు రక్షణ కల్పించాలని రైతులు పోలీసులను కోరారు. పంటను ధ్వంసం చేసి రైతులకు నష్టం కలిగించిన ఘటనపై సమగ్రంగా దర్యాప్తు చేసి, బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఎస్సై రాజయ్య తెలిపారు.

## అమెరికాలో రోడ్డు ప్రమాదంలో సింహాద్రి నగర్ నివాసి సుప్రియ మృతి చెందడం పట్ల మంత్రి పొంగులేటి తీవ్ర విచారం..

**మృతదేహాన్ని త్వరగా ఇండియా తీసుకొచ్చేందుకు..కృషి చేస్తున్నట్లు వెల్లడి .. మంత్రి సూచనలతో మృతురాలి నివాసానికి వెళ్లి.. కుటుంబ సభ్యులను ఓదార్చిన క్యాంప్ కార్యాలయ ఇన్ చార్జ్ దయాకర్ రెడ్డి**

**ప్రభాత వార్త ఖమ్మం రూరల్**

ఏదులాపురం మున్సిపాలిటీ పరిధిలోని సింహాద్రి నగర్‌కు చెందిన దారం సుప్రియ అమెరికాలో జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందడం పట్ల రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తీవ్ర విచారం వ్యక్తం చేశారు. సుప్రియ మృతిచెందిన విషయం తెలుసుకుని ఆమె కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. మృతదేహాన్ని వీలైనంత త్వరగా భారత్‌కు తీసుకొచ్చేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు మంత్రి తెలిపారు. ఈ



విషయాన్ని ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి, అవసరమైన చర్యలు వేగవంతం చేసేందుకు కృషి చేస్తున్నట్లు వెల్లడించారు. మృతురాలి కుటుంబ సభ్యులకు ఈ విషాదాన్ని తట్టుకునే మనోధైర్యాన్ని భగవంతుడు ప్రసాదించాలని ఆకాంక్షించారు. మృతురాలి కుటుంబ సభ్యులకు దయాకర్ రెడ్డి పరామ ర్శమంత్రి పొంగులేటి సూచనల మేరకు ఖమ్మం క్యాంప్ కార్యాలయ ఇన్‌చార్జ్ తుంబూరు దయాకర్‌రెడ్డి సోమవారం సింహాద్రినగర్‌లోని సుప్రియ నివాసానికి వెళ్లారు. కుటుంబ సభ్యులను పరామర్శించి, వారికి ధైర్యం చెప్పారు. ఈ సందర్భంగా దయాకర్ రెడ్డి ఖమ్మం ఎంపీ రఘురాం రెడ్డికి ఫోన్ చేయగానే.. మృతురాలి కుటుంబ సభ్యులతో స్వయంగా



మాట్లాడి.. ఓదార్చారు. అలాగే.. కేంద్ర విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ, అమెరికాలోని భారత రాయభార కార్యాలయ ఉన్నతాధికారులతో పలుమార్లు సంప్రదించానని, వీలైనంత త్వరగా మృతదేహాన్ని స్వదేశానికి రప్పించేందుకు ప్రయత్నిస్తున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో..: ఏదులాపురం మున్సిపల్ చైర్‌పర్సన్ పోకబత్తిని అనిత, వైస్‌చైర్మన్ తమ్మినేని నవీన్, మున్సిపాలిటీ కాంగ్రెస్ అధ్యక్షుడు బానోత్ కిషోర్, గరికపాటి ఆంజనేయ ప్రసాద్, పలువురు కౌన్సిలర్లు, స్థానిక కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## అంగన్వాడీ కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి.



**నేలకొండపల్లి, అక్టోబర్ 5 ప్రభాతవార్త:**

అంగన్వాడీ కేంద్రాలను ప్రతీ ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని ఐసీడీఎస్ సీడీపీవో కవిత వెల్లడించారు. సోమవారం రాజేశ్వరపురం గ్రామం లోని సోమవారం అంగన్వాడీ కేంద్రంలో గర్భిణీ స్త్రీలకు సీమంతాలు నిర్వహించారు. చిన్నారులకు అన్నప్రాసన్న వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కవిత మాట్లాడుతూ అంగన్వాడీ కేంద్రాల ద్వారా ప్రభుత్వం అందించే పౌష్టికాహారం ను పొందాలని సూచించారు. ఈ కార్యక్రమంలో రాజేశ్వరపురం గ్రామ సర్పంచ్ దండా రంగయ్య. ఉప సర్పంచ్ రాసాల నవీన్, అంగన్వాడీ టీచర్స్ కల్పన, ఉమారాణి, విజయలక్ష్మి, ఉమ తదితరులు పాల్గొన్నారు. మండలం లోని మంగాపురం లో సీమంతాలు. అక్షరాభ్యాసం కార్యక్రమం ను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారి శ్రావణ్ కుమార్, ఆ గ్రామ సర్పంచ్ ఖీధీరావత్ అశోక్ రాణి, సూపర్ వైజర్ పార్వతీ తదితరులు పాల్గొన్నారు.

## సబ్బండ వర్గాలు గులాబీ జెండాకి జై కొడుతున్నాయి

**ఎమ్మెల్సీ ఎన్నికలతో తెలంగాణలో మార్పు ఖాయం**
**అర్హతగల ప్రతి పట్టభద్రుడు ఓటరుగా నమోదు కావాలి**
**అవగాహన సదస్సులో రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర, ఎమ్మెల్సీ తాతా మధు, మాజీ ఎమ్మెల్యే కందాల**

**ప్రభాత వార్త ఖమ్మం రూరల్ :**

ఇందు గలదు అందు లేదు అనే సందేహం లేకుండా జెన్ జీల నుండి వృద్ధులు, మహిళలు సమాజంలో సబ్బండ వర్గాలు గులాబీ జెండాకు జై కొడుతున్నాయని బీ ఆర్ఎస్ రాజ్యసభ పక్ష నేత వద్దిరాజు రవిచంద్ర, ఎమ్మెల్సీ తాతా మధుసూదన్, పాలేరు మాజీ ఎమ్మెల్యే కందాల ఉపేందర్ రెడ్డిలు తెలిపారు. సోమవారం ఏదులాపురం మున్సిపాలిటీ పరిధిలోని సాయి గణేష్ నగర్ లో ఉన్నటువంటి కందాల క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్సీ ఎన్నికల సన్నాహక సమావేశం జరిగింది. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ మూడేళ్లలోనే కాంగ్రెస్ పాలన ముగింపు దశకు చేరుకుందని, సమాజంలో ఏ ఒక్క వర్గం కాంగ్రెస్ పాలన పట్ల సంతృప్తిగా లేదన్నారు, ఎన్నికలలో గెలిచేందుకు అలవి కాని హామీలు ఇచ్చిన కాంగ్రెస్ అనతి కాలంలోనే ప్రజల వ్యతిరేకతను మూట కట్టుకున్నది అన్నారు. తెలంగాణలో గ్రాడ్యుయేట్స్ ఎమ్మెల్సీ ఎన్నికలతోనే మార్పు రాబోతుందని ధీమా వ్యక్తం చేశారు. ఈనెల 25 లోపు అర్హత గల పట్టభద్రులందరినీ ఓటు హక్కు నమోదు చేసుకునే విధంగా పార్టీ శ్రేణులు



కసరత్తులు చేయాలన్నారు. స్వయంగా ప్రతి గ్రాడ్యుయేట్ ను కలిసి దరఖాస్తు ఫారం నింపించి, స్వయంగా ఆన్లైన్ చేయించాలని దిశా నిర్దేశం చేశారు. ఆరు నూరైనా, నూరు ఆరైనా ఎమ్మెల్సీ ఎన్నికలలో బీ ఆర్ఎస్ అభ్యర్థి ఘన విజయం సాధించడం ఖాయమన్నారు. యువకులు విద్యావంతులు, ఉద్యోగులు ఈ ప్రభుత్వంపై తీవ్ర ఆగ్రహంతో ఉన్నారని రికార్డు విజయం సొంతం చేసుకోబోతున్నామని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ మాజీ మండల అధ్యక్షుడు బెల్లం వేణుగోపాల్ పలువురు పార్టీ ముఖ్య నాయకులు, పాల్గొన్నారు

## సుప్రజ మరణం అత్యంత బాధాకరం

**మృతదేహాన్ని తరలించేందుకు తానా చర్యలు**
**బాధిత కుటుంబానికి బీఆర్ఎస్ నేతల పరామర్శ**

**ప్రభాత వార్త ఖమ్మం రూరల్:**

రెండు రోజుల క్రితం అమెరికా లో జరిగిన రోడ్డు ప్రమాదంలో మరణించిన దారం సుప్రియ మరణం అత్యంత బాధాకరమని బీఆర్ఎస్ రాజ్యసభ సభ్యుడు, పార్లమెంటరీ నేత వద్దిరాజు రవిచంద్ర, ఎమ్మెల్సీ తాత మధుసూదన్, పాలేరు మాజీ ఎమ్మెల్యే కందాల ఉపేందర్ రెడ్డిలు అన్నారు. సోమవారం ఏదులాపురం మున్సిపాలిటీ పరిధిలో ని సింహాద్రి నగర్ లో నివాసముంటున్న సుప్రియ తల్లిదండ్రులను వారు పరామర్శించారు. తొలుత సుప్రియ చిత్రపటానికి పూలమాలవేసి, ఘనంగా నివాళులర్పించారు. అనంతరం సుప్రియ తల్లి తల్లితండ్రులను ఓదార్చారు. ప్రమాదం జరిగిన తీరు వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం వారు మాట్లాడుతూ ఎంతో భవిష్యత్తు ఉన్న సుప్రియ అకాల మరణం చెందడం బాధాకరమన్నారు. ఆమె మృతదేహాన్ని భారతదేశానికి



రప్పించేందుకు తానా, ఇతర అసోసియేషన్ల చర్యలు ప్రారంభించాయన్నారు. శుక్రవారం లోపు మృతదేహం ఇండియాకు వచ్చే అవకాశం ఉందన్నారు. ఎప్పటికప్పుడు తన ప్రతినిధులతో సంప్రదిస్తున్నట్లు వారి పేర్కొన్నారు. పార్టీ అండగా ఉంటుందని ధైర్యంగా ఉండాలని మృతురాలి కుటుంబ సభ్యులకు భరోసా కల్పించారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల ప్రెసిడెంట్ బెల్లం వేణుగోపాల్, నాయకులు బానోతు కృష్ణ, మైబ్బి సాహెబ్, నారపాటి రమేష్, గూడా సంజీవరెడ్డి తో పాటు ఇతర పార్టీ ముఖ్య నాయకులు తదితరులు పాల్గొన్నారు

# పిల్లల చదువుపై కలెక్టర్ అంకిత్ నజర్ !!

### పరీక్షల నుంచి మధ్యాహ్న భోజనం వరకు

### కొమ్ముగూడెం బడిలో ఆకస్మిక తనిఖీ





**జూలూరుపాడు, ప్రభాతవార్త, అక్టోబర్ 5:** పాఠశాలలో పిల్లల చదువు, హాజరు, పరీక్షల నిర్వహణతో పాటు వారి ఆరోగ్యం, పోషకాహారంపైనా జిల్లా కలెక్టర్ అంకిత్ ప్రత్యేక దృష్టి సారించారు. మండల పరిధిలోని కొమ్ముగూడెం మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలను సోమవారం కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఎస్ఏ-1 పరీక్షలను పరిశీలించి విద్యార్థుల అభ్యసన స్థాయిపై ఆరా తీశారు. చదువులో వెనుకబడిన పిల్లలను గుర్తించి ప్రత్యేక శ్రద్ధ చూపాలని ఉపాధ్యాయులకు సూచించారు. పాఠశాలలోని ప్రీప్రైమరీ కేంద్రాన్ని సందర్శించి చిన్నారులకు కల్పిస్తున్న అభ్యసన వాతావరణం, ఆటలు, బొమ్మలను పరిశీలించారు. విద్యార్థులకు అందిస్తున్న రాగిజావ, మధ్యాహ్న భోజనం నాణ్యత, మెనూ, వంటశాల పరిశుభ్రతపై ఆరా తీశారు. విద్యార్థుల హాజరు, విద్యా ప్రమాణాలు, ఆరోగ్యం, పోషకాహారంపై నిరంతర పర్యవేక్షణ ఉండాలని కలెక్టర్ అంకిత్ సూచించారు.

**73 మందికి 62 మంది హాజరు**

పాఠశాలలో మొత్తం 73 మంది విద్యార్థులు ఉండగా సోమవారం 62 మంది హాజరైనట్లు ఉపాధ్యాయులు తెలిపారు. హాజరు శాతం పెంచేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని కలెక్టర్ సూచించారు. తరచూ పాఠశాలకు గైర్హాజరవుతున్న విద్యార్థుల తల్లిదండ్రులతో మాట్లాడి, పిల్లలు క్రమం తప్పకుండా బడికి వచ్చేలా చూడాలని ఆదేశించారు.

**మన ఊరు-మన బడి పనులపై ఆరా**

పాఠశాలలోని మౌలిక సదుపాయాలను పరిశీలించిన కలెక్టర్.. 'మన ఊరు-మన బడి' కార్యక్రమం కింద చేపట్టిన అభివృద్ధి పనుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఆయా పనుల ప్రస్తుత పరిస్థితి, విద్యార్థులకు కలుగుతున్న ప్రయోజనాలను పరిశీలించారు.

**చిన్నారులతో మమేకం**

పాఠశాల ఆవరణలో నిర్వహిస్తున్న ప్రీప్రైమరీ కేంద్రాన్ని కూడా కలెక్టర్ సందర్శించారు. అక్కడ 14 మంది చిన్నారులు విద్యనభ్యసిస్తున్నట్లు తెలుసుకున్నారు. వారికి అందుతున్న సౌకర్యాలు, నూతనంగా అందించనున్న ఏకరూప దుస్తులను పరిశీలించా రు. ఆటలు, బొమ్మలు, అభ్యసన సామగ్రిని వినియోగిస్తూ చిన్నారుల్లో ఆసక్తిని పెంచాలని సూచించారు.

**భోజనం నాణ్యతపై పరిశీలన**

విద్యార్థులకు అందుతున్న పోషకాహారంపై కలెక్టర్ ఆరా తీశారు. ఉదయం 11 గంటలకు రాగిజావ, అనంతరం మధ్యాహ్న భోజనం అందిస్తున్నట్లు ఉపాధ్యాయులు తెలిపారు. భోజన మెనూ, ఆహార పదార్థాల నాణ్యత, వంటశాల పరిశుభ్రతను పరిశీలించారు. విద్యార్థులకు నాణ్యమైన, పరిశుభ్రమైన, పోషక విలువలతో కూడిన ఆహారం అందించాలని సూచించారు. విద్యార్థుల హాజరు, చదువు, ఆరోగ్యం, పోషకాహారంపై నిరంతర పర్యవేక్షణ ఉండాలని కలెక్టర్ అంకిత్ తెలిపారు. విద్యార్థుల సమగ్ర అభివృద్ధికి ఉపాధ్యాయులు, అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. కలెక్టర్ వెంట తహసీల్దార్ శ్రీనివాస్, ఎంఈఓ జుంకీలాల్, సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

---

# ఖమ్మంలో బంగారం ట్రేడింగ్ పేరుతో ఘరానా మోసం.!

**మొదటి పేజీ తరువాయి..**

ఈ ఘటనకు సంబంధించి ఖమ్మం వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో నలుగురిపై భారతీయ న్యాయ సంహిత (బీఎన్ఎస్) సెక్షన్లు 318(4), 351(2), 3(5) కింద కేసు నమోదైనట్లు తెలుస్తోంది. ఈ కేసులో ప్రధాన నిందితుడిగా పేర్కొంటున్న గోపతి యశ్వంత్‌ను గత నెల 30వ తేదీన పోలీసులు అరెస్ట్ చేసినట్లు సమాచారం.

బంగారం, ఫారెక్స్ ట్రేడింగ్ ద్వారా అధిక లాభాలు వస్తాయని నమ్మించి పలువురి నుంచి పెద్ద మొత్తంలో డబ్బులు తీసుకున్నారనేది బాధితుల ప్రధాన ఆరోపణ. పెట్టుబడులపై ఆశించిన లాభాలు రాకపోవడం, ఇచ్చిన డబ్బులు తిరిగి చెల్లించాలని కోరినప్పటికీ సమస్య పరిష్కారం కాకపోవడంతో బాధితులు పోలీసులను ఆశ్రయించినట్లు తెలుస్తోంది. అయితే, ఈ వ్యవహారంలో అసలు ఎంతమంది బాధితులు ఉన్నారు? మొత్తం లావాదేవీల విలువ ఎం? డబ్బులు ఎక్కడికి మళ్లించబడ్డాయి? అనే అంశాలపై సమగ్ర దర్యాప్తు జరగాల్సి ఉంది.

**బాధితులకు న్యాయం ఎప్పుడు?**

దర్యాప్తులో ప్రతి అంశం వెలుగులోకి రావాలని కోట్ల రూపాయల మోసం జరిగిందని ఆరోపణలు వచ్చినప్పుడు ప్రధాన నిందితుడి అరెస్టుతోనే దర్యాప్తు ముగిసిపోకూడదని, బాధితుల నుంచి సేకరించిన డబ్బు ఎక్కడికి వెళ్లింది? ఆర్థిక లావాదేవీల్లో మరెవరైనా భాగస్వాములుగా ఉన్నారా? బాధితులను బెదిరించినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న వ్యక్తుల పాత్ర ఏమిటి? అనే ప్రశ్నలకు సమాధానాలు లభించాలిని బాధితులు కోరుకుంటున్నారు.

ఈ కేసులో నలుగురిపై కేసు నమోదైన నేపథ్యంలో, ప్రతి నిందితుడి పాత్రను ఆధారాలతో పరిశీలించి, బాధితులకు న్యాయం జరిగేలా పోలీసులు చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని బాధితులు కోరుకుంటున్నారు.

**పోలీస్ కానిస్టేబుల్ కిరణ్ కుమార్ వ్యవహారంపై విచారణ ఎప్పుడు?**

ఈ కేసులో మరో కీలకమైన అంశం ప్రధాన నిందితుడి కుటుంబ సభ్యులు, అతని సన్నిహిత బంధువుగా పేర్కొంటున్న ఏఆర్ కానిస్టేబుల్ తీరథాల కిరణ్ కుమార్ పాత్రకు సంబంధించిన ఆరోపణలు. తమ డబ్బులు తిరిగి ఇవ్వాలని ప్రధాన నిందితుడిని ప్రశ్నించిన బాధితులను అతని తల్లి, సోదరి, అలాగే కిరణ్ కుమార్ భయపెట్టినట్లు కొందరు బాధితులు ఆరోపిస్తున్నట్లు సమాచారం.

అంతేకాకుండా, ప్రధాన నిందితుడికి సంబంధించిన డబ్బులను దాచిపెట్టడంలో, ఈ వ్యవహారంలో కీలకంగా ఉన్న వ్యక్తులకు సహకరించడంలో కానిస్టేబుల్ కిరణ్ కుమార్ పాత్ర ఉందని కొందరు బాధితులు ఆరోపిస్తున్నట్లు తెలుస్తోంది. అయితే, ఈ ఆరోపణలు ఇంకా దర్యాప్తులో నిర్ధారణ కావాల్సి ఉంది. సంబంధిత ఆర్థిక లావాదేవీలు, కాల్ రికార్డులు, ఇతర ఆధారాలను పరిశీలించడం ద్వారా మాత్రమే వాస్తవాలు బయటపడే అవకాశం ఉంది.

**ప్రభుత్వ విధుల్లో కొనసాగుతున్నారా?**

ఈ వ్యవహారంలో అత్యంత కీలకమైన ప్రశ్న ఏంటంటే !! కేసులో ఆరోపణలు ఎదుర్కొంటున్న పోలీస్ కానిస్టేబుల్ కిరణ్ కుమార్‌పై శాఖాపరమైన విచారణ జరిగిందా? ఆయన పాత్రపై ఉన్నతాధికారులు ఏమైనా నివేదిక కోరారా?

కొన్ని వర్గాల సమాచారం ప్రకారం, ఈ కేసు దర్యాప్తు అధికారి (ఐఓ) ఎదుట హాజరుకావాలని కోరినప్పటికీ కిరణ్ కుమార్ హాజరుకాలేదని ఆరోపణలు వినిపిస్తున్నాయి. అయితే, ఆయనకు అధికారికంగా నోటీసులు జారీ అయ్యాయా? హాజరుకాకపోవడానికి కారణాలేమిటి? అనే అంశాలను సంబంధిత అధికారులు స్పష్టం చేయాల్సి ఉంది.

ఒకవేళ విధుల్లో ఉన్న పోలీసు సిబ్బందిపై తీవ్రమైన ఆరోపణలు వచ్చినా, వాటిని పరిశీలించకుండా ఉన్నతాధికారులు ఎందుకు ఉపేక్షిస్తున్నారని ప్రశ్నలు ప్రస్తుతం లేవనెత్తుతున్నాయి.

---



# ఖాళీ కడుపుతో పారిశుద్ధ్య పనులు చేయాలా?

### మూడు నెలలుగా వేతనాలు అందక కార్మికుల ఆవేదన

### ప్రభుత్వ ఆసుపత్రి వద్ద సీఐటీయూ ఆధ్వర్యంలో మెరుపు నిరసన

### వారంలోగా వేతనాలు చెల్లిస్తామని సూపరింటెండెంట్ హామీ

**భద్రాచలం, ప్రభాతవార్త:** ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో పనిచేస్తున్న శానిటేషన్ కార్మికులు, సెక్యూరిటీ గార్డులు, ఇతర తాత్కాలిక ఉద్యోగులకు మూడు నెలలుగా వేతనాలు అందకపోవడంతో సోమవారం మెరుపు నిరసన చేపట్టారు.

ఆసుపత్రి ప్రధాన గేటు వద్ద సీఐటీయూ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఏజే రమేష్ మాట్లాడుతూ వేతనాలు అందక కార్మికులు, వారి కుటుంబాలు పస్తులుండే పరిస్థితి నెలకొందన్నారు. కనీస వేతనం రూ.18,500 చెల్లించాల్సి ఉండగా కేవలం రూ.11,000 ఇస్తున్నారని ఆరోపించారు. ఆ మొత్తాన్ని కూడా సకాలంలో చెల్లించకపోవడంతో కార్మికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. నాలుగు రాష్ట్రాల సరిహద్దులోని ఆసుపత్రికి రోజూ 500 నుంచి 800 మంది ఓపీ రోగులు వస్తున్నారని, కార్మికులపై పనిభారం అధికంగా ఉందన్నారు. వైద్యాధికారులు స్పందించి కార్మికుల వ్యక్తిగత ఖాతాల్లో నేరుగా వేతనాలు జమ చేసేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. దసరా పండుగ సమీపిస్తున్న నేపథ్యంలో పెండింగ్ వేతనాలను వెంటనే చెల్లించాలని కోరారు. లేనిపక్షంలో నిరవధిక సమ్మెకు దిగుతామని ఏజే రమేష్ హెచ్చరించారు. అనంతరం ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రాజశేఖర్‌తో కార్మిక నేతలు చర్చలు జరిపారు. వారం రోజుల్లోగా పెండింగ్ వేతనాలు చెల్లించి సమస్యను పరిష్కరిస్తామని సూపరింటెండెంట్ హామీ ఇవ్వడంతో నిరసన విరమించారు. కార్యక్రమంలో సీఐటీయూ పట్టణ కన్వీనర్ బండారు శరత్‌బాబు, శానిటేషన్ యూనియన్ నాయకులు రమణ, నరేందర్, నాగరాజు, కృష్ణ, శోభ తదితరులు పాల్గొన్నారు.

# ఐటీసీ వ్యర్థజలాలపై సారపాకలో ఆగ్రహం

**సారపాక, ప్రభాతవార్త:** సారపాక మేజర్ గ్రామపంచాయతీ నాలుగో వార్డు పరిధిలో ఐటీసీ పీఎస్పీడీ కర్మాగారం నుంచి వ్యర్థజలాలు విడుదలవుతున్నాయని ప్రజలు ఇచ్చిన ఫిర్యాదుపై సర్పంచ్ గూగులోత్ కిషోర్ శివరాం నాయక్ సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. గ్రామస్తుల ఫిర్యాదు మేరకు కాలుష్య నియంత్రణ మండలి అధికారులకు సమాచారం ఇవ్వగా, అధికారులు వ్యర్థజలాల నమూనాలను సేకరించారు. కర్మాగారంలోనూ నమూనాలు సేకరించి పరీక్షించాలని సర్పంచ్ , ప్రజలు కోరారు. వ్యర్థజలాల కారణంగా దుర్వాసనతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని ఆయన తెలిపారు. వ్యర్థజలాలు గోదావరిలో కలవకుండా శాశ్వత పరిష్కారం చూపాలని ఐటీసీ యాజమాన్యాన్ని డిమాండ్ చేశారు. ఈటీపీ ద్వారా వ్యర్థజలాలను బయటకు విడుదల చేయడం లేదని యాజమాన్యం చెబుతున్నప్పటికీ, ప్రస్తుతం వ్యర్థజలాలు బయటకు వస్తున్నాయన్న అంశంపై స్పష్టత ఇవ్వాలని కోరారు. అలాగే కార్మికులకు ఈఎస్ఐ వైద్య సేవలు, మందుల లభ్యతపై వస్తున్న ఫిర్యాదులను కూడా వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కాలుష్య సమస్యను నిర్లక్ష్యం చేస్తే ప్రజల తరఫున ప్రజాస్వామ్య పద్ధతిలో పోరాటం చేపడతామని సర్పంచ్ హెచ్చరించారు.

# పాల్వంచ స్పైసీ రెస్టారెంట్‌లో యజమాని అరాచకం

## సప్లై బాయ్‌పై దాడి,బాధితుడికి న్యాయం చేయాలని ఆందోళన

**పాల్వంచ టౌన్, అక్టోబర్ 05,ప్రభాత వార్త:**




కష్టపడి పనిచేసుకుంటున్న ఒక సప్లై బాయ్‌పై రెస్టారెంట్ యజమాని దాడికి పాల్పడిన ఘటన పాల్వంచ పట్టణంలో తీవ్ర కలకలం రేపింది.బాధితుడి కుటుంబ సభ్యులు,రాజకీయ నాయకులు తెలిపిన వివరాల ప్రకారం..పాల్వంచలోని స్పైసీ రెస్టారెంట్‌లో సప్లై బాయ్‌గా పనిచేస్తున్న చలపతిరావుపై గాంధీ జయంతి రోజున అర్ధరాత్రి సమయంలో విధుల్లో ఉండగా యజమాని భౌతిక దాడికి పాల్పడ్డారు.పనిచేసే సిబ్బందితో ఏవైనా సమస్యలు ఉంటే మాట్లాడి పరిష్కరించుకోవాలి గానీ,ఇలా దాడి చేయడమేంటని బాధితుడి కుటుంబ సభ్యులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.రెస్టారెంట్ ఎదుట నిరసన – మద్దతు తెలిపిన తెలంగాణ రాజ్యాధికార పార్టీబాధితుడు చలపతిరావుకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ కుటుంబ సభ్యులు ఆందోళనకు దిగారు.ఈ నిరసన కార్యక్రమానికి తెలంగాణ రాజ్యాధికార పార్టీ నాయకులు,కార్యకర్తలు పూర్తి మద్దతు తెలిపారు.రెస్టారెంట్ ఎదుట పెద్ద ఎత్తున బైఠాయించి యజమాని వైఖరికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. పనిచేసే సిబ్బందిపై దాడులకు తెగబడటం ఏమాత్రం సమర్థనీయం కాదని మండిపడ్డారు.సీసీటీవీ ఫుటేజీ పరిశీలించాలి.. సంఘటనకు సంబంధించిన నిజానిజాలు తేలాలంటే రెస్టారెంట్‌లోని సీసీ కెమెరాల ఫుటేజీని వెంటనే బయటపెట్టి,అధికారులు సమగ్ర విచారణ జరిపాలని నాయకులు డిమాండ్ చేశారు.దాడి ఆరోపణలు నిజమని తేలితే యజమానిపై కఠిన చట్టపరమైన చర్యలు తీసుకోవాలని,బాధితుడికి న్యాయం జరిగే వరకు తమ పోరాటం ఆపేది లేదని స్పష్టం చేశారు.ఈ నిరసన కార్యక్రమంలో తెలంగాణ రాజ్యాధికార పార్టీ జిల్లా అధ్యక్షుడు మల్లెల వీరనారాయణ, పాల్వంచ పట్టణ అధ్యక్షుడు అటికేతి శంకర్,ఇతర నాయకులు, కార్యకర్తలు,బాధితుడి కుటుంబ సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ప్రభుత్వ ఆసుపత్రి బాట పట్టిన తెలంగాణ రక్షణ సేన

## రోగుల సమస్యలు, వసతులపై క్షేత్రస్థాయిలో ఆరా ప్రజలకు మెరుగైన వైద్యం అందే వరకు ప్రశ్నిస్తాం: సముద్రాల క్రాంతి కుమార్

**కొత్తగూడెం టౌన్, అక్టోబర్ 5 ప్రభాతవార్త:**



ప్రజా సమస్యలను క్షేత్రస్థాయిలో గుర్తించి.. వాటి పరిష్కారం కోసం సంబంధిత అధికారులపై ఒత్తిడి తీసుకురావడమే లక్ష ్యంగా తెలంగాణ రక్షణ సేన ముందుకు సాగుతోందని ఆ పార్టీ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అధ్యక్షుడు సముద్రాల క్రాంతి కుమార్ తెలిపారు.ఈ నేపథ్యంలో సోమవారం ఆయన కొత్తగూడెం ప్రభుత్వ ఆసుపత్రిని సందర్శించి అక్కడి పరిస్థితులను పరిశీలించారు. ఆసుపత్రిలో వైద్య సేవలు, రోగులకు అందుతున్న మౌలిక వసతులు, పారిశుద్ధం, తాగునీరు, మరుగుదొడ్లు, బెడ్ల లభ్యత తదితర అంశాలపై రోగులు, వారి సహాయకులను నేరుగా అడిగి తెలుసుకున్నారు.ప్రభుత్వ ఆసుపత్రులపై ప్రధానంగా పేద, మధ్యతరగతి కుటుంబాలు ఆధారపడుతున్నందున వారికి అవసరమైన వైద్య సేవలు, మౌలిక వసతులు అందేలా అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని క్రాంతి కుమార్ కోరారు. రోగులకు అందాల్సి న మందులు, వైద్య సేవలు, ఇతర సౌకర్యాల్లో లోపాలు ఉంటే వాటిని సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు."ప్రజల సమస్యలు కార్యాలయాల్లో కూర్చొని తెలుసుకునేవి కావు.. క్షేత్రస్థాయికి వెళ్లి ప్రత్యక్షంగా పరిశీలించినప్పుడే వాస్తవ పరిస్థితులు తెలుస్తాయి" అని ఆయన పేర్కొన్నారు. ఆసుపత్రికి వచ్చే రోగులు, వారి కుటుంబ సభ్యులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను ప్రత్యక్షంగా తెలుసుకునేందుకే ఈ పర్యటన చేపట్టినట్లు చెప్పారు. కొత్తగూడెం ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు మెరుగైన వైద్య సేవలు, అవసరమైన మౌలిక వసతులు అందేలా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రజలకు నాణ్యమైన వైద్యం అందే విషయంలో తెలంగాణ రక్షణ సేన ప్రజల తరఫున సమస్యలను ప్రశ్నిస్తూ, పరిష్కారం కోసం కృషి చేస్తుందని స్పష్టం చేశారు. కార్యక్రమంలో టీఆర్ఎస్ కార్మిక విభాగం (టీఆర్‌టీయూ) రాష్ట్ర అధ్యక్షుడు డి.వీరన్న, మహిళా విభాగం నాయకురాలు దోనెపల్లి కమల గాయత్రి, లకావత్ సురేష్, కొత్తగూడెం నియోజకవర్గ ఇన్‌చార్జి నమ్మి జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

# పులుల లెక్కకు పకడ్బందీ ప్రణాళిక

## క్షేత్రస్థాయిలో శాస్త్రీయ ఆధారాల సేకరణపై అటవీ సిబ్బందికి శిక్షణ

**కొత్తగూడెం, అక్టోబర్ 5 ప్రభాతవార్త:**



పులుల గణనలో కేవలం సంఖ్యలకే పరిమితం కాకుండా.. వాటి ఆవాసాలు, సంచారం, ఆహార లభ్యత, నీటి వనరులపై సమగ్ర సమాచారాన్ని సేకరించేందుకు అటవీ శాఖ కసరత్తు ప్రారంభించింది. ఆల్ ఇండియా టైగర్ ఎస్టిమేట్–2026 ఫేజ్–III క్షేత్రస్థాయి సర్వే నేపథ్యంలో అటవీ సిబ్బందికి శాస్త్రీయ పద్ధతుల్లో డేటా సేకరణపై ఒకరోజు శిక్షణ నిర్వహించారు. కొత్తగూడెం వనవిహార్ కాంప్లెక్స్‌లోని భద్రా మీటింగ్ హాల్‌లో జరిగిన శిక్షణ కార్యక్రమంలో మణుగూరు, కిన్నెరసాని వైల్డ్‌లైఫ్ మేనేజ్‌మెంట్, సత్తుపల్లి డివిజన్లకు చెందిన అటవీ అధికారులు, బీట్ సిబ్బంది పాల్గొన్నారు. అమ్రాబాద్ టైగర్ రిజర్వ్ క్యూరేటర్ రవికాంత్ క్షేత్రస్థాయిలో పాటించాల్సి న విధానాలను సిబ్బందికి వివరించారు. పులుల ఉనికిని నిర్ధారించే పాదముద్రలు, స్కాట్, గోకిన ఆనవాళ్లు, ఆహార అవశేషాలు, కెమెరా ట్రాప్ చిత్రాలు వంటి ఆధారాలను ఎలా గుర్తించాలి, వాటిని జీపీఎస్ ద్వారా ఎలా నమోదు చేయాలి, ఫొటోగ్రాఫిక్ ఆధారాలతో పాటు ఫీల్డ్ రికార్డులను ఏ విధంగా నిర్వహించాలనే అంశాలపై శిక్షణ ఇచ్చారు. అటవీ ప్రాంతాల్లో పులుల కదలికలతో పాటు ఆవాసాల పరిస్థితి, నీటి లభ్యత, ఆహార జంతువుల ఉనికి, వన్యప్రాణుల సంచారం వంటి అంశాలపైనా క్షేత్రస్థాయి సమాచారం నమోదు చేయా లని సూచించారు. సర్వే ద్వారా సేకరించే స వ రా చా ర ం భవిష్యత్‌లో పులుల సంరక్షణ, అటవీ నిర్వహణకు కీలక ఆధారం గా నిలుస్తుందని జిల్లా అటవీ అధికారి సిద్ధార్థ్ విక్రమ్ సింగ్ తెలిపారు. డేటా సేకరణలో చిన్నపాటి పొరపాట్లకు కూడా తావులేకుండా, ప్రతి వివరాన్ని పరిశీలించి నాణ్యమైన, ధృవీకరించదగిన సమాచారాన్ని మాత్రమే నమోదు చేయాలని సిబ్బందికి సూచించారు. ఫేజ్–III సర్వేను సమర్థవంతంగా నిర్వహించేందుకు కిన్నెరసాని ఎఫ్‌డీవో బాబును డిప్యూటీ సీసీఎఫ్ ఫేజ్–III నోడల్ అధికారిగా నియమించారు. కార్యక్రమంలో ఎఫ్ఆర్ఓలు, డీవైఆర్ఓలు, బీట్ అధికారులు, ఇతర క్షేత్రస్థాయి అటవీ సిబ్బంది పాల్గొన్నారు.

# ప్రజావాణి వినతులకు సత్వర పరిష్కారం

## జిల్లా కలెక్టర్ అంకిత్

**కొత్తగూడెం, అక్టోబర్ 5 ప్రభాతవార్త:**



ప్రజావాణిలో స్వీకరించే ప్రతి వినతిని క్షుణ్ణంగా పరిశీలించి నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ అంకిత్ అధికారులను ఆదేశించారు. సోమవారం ఐడీఓసీలో నిర్వహించిన ప్రజావాణిలో అదనపు కలెక్టర్ విద్యాచందన, డీఆర్వో పద్మావతితో కలిసి ప్రజల నుంచి వినతులు స్వీకరించారు.భూ సమస్యలు, రెవెన్యూ, పింఛన్లు, సంక్షేమ పథకాలు, గృహాలు, ఉపాధి తదితర అంశాలపై ప్రజలు ఫిర్యాదులు అందజేశారు. తక్షణ సమస్యలను వెంటనే పరిష్కరించాలని, క్లిష్టమైన సమస్యలపై నిరంతర పర్యవేక్షణ కొనసాగించాలని కలెక్టర్ సూచించారు. ప్రజావాణి దరఖాస్తుల పరిష్కారంపై ఎప్పటికప్పుడు సమీక్షి ంచాలని ఆదేశించారు.జిల్లా కేంద్రంతో పాటు మండలాల్లోని ఎంపీడీవో కార్యాలయాల్లోనూ ప్రజావాణి నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రజలు సంబంధిత ఆధార పత్రాలతో సమీప కార్యాలయంలో వినతులు అందజేయాలని సూచించారు.పట్టా మంజూరు, లోకల్ ఏరియా సర్టిఫికెట్, వరదల్లో దెబ్బతిన్న దుకాణం, భూమి సర్వే, సైనిక్ స్కూల్‌లో చదువుతున్న విద్యార్థికి ఆర్థిక సాయం తదితర అంశాలపై వచ్చిన వినతులను సంబంధిత తహసీల్దార్లకు కలెక్టర్ ఎండార్స్ చేశారు.

# కరెంటు సబ్ స్టేషన్లో నిర్వహించనున్న సిజిఆర్ఎఫ్ కార్యక్రమం

## వినియోగదారులు హాజరవ్వాలని ఏఈ సాయి తరుణ్ పిలుపు

**అన్నపురెడ్డిపల్లి, అక్టోబర్ 05(ప్రభాతవార్త):**



విద్యుత్తు ఫిర్యాదుల పరిష్కారంకు సిజిఆర్ఎఫ్ వేదికను వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలని. టిజిఎన్పిడిసిఎల్ ఏఈ సాయి తరుణ్ కోరారు. విద్యుత్తు పంపిణీ సంస్థ (డిస్కం) పరిధిలో ఏర్పాటు చేయబడిన విద్యుత్తు వినియోగదారుల సమస్యల పరిష్కార ఫోరం(కన్స్యూమర్ గ్రీవెన్స్ రిడ్రెసల్ ఫోరం) వేదికను సిజిఆర్ఎఫ్ వరంగల్ చైర్ పర్సన్ కె మాధవరావు సమక్షంలో నిర్వహిస్తామన్నారు. అన్నపురెడ్డిపల్లి మండలం పెంట్లం గ్రామంలోని తెలంగాణ ఉత్తర విద్యుత్తు పంపిణీ కంపెనీ లిమిటెడ్ ఉపకేంద్రంలో బుధవారం ఉదయం సమయం 10 గంటల 30 నిమిషాల నుండి మధ్యాహ్నా సమయం 01 గంట వరకు ఉంటుందని. సహాయక ఇంజనీరు(ఏఈ)తెలిపారు. అన్నపురెడ్డిపల్లి చంద్రుగొండ జూలూరుపాడు సుజాతనగర్ మండలాల పరిధిలోని విద్యుత్తు వినియోగదారులు పాల్గొని. విద్యుత్తు సేవలోని కనెక్షన్లు. ట్రాన్స్ఫార్మర్లు సమస్యలు. విద్యుత్తు బిల్లులు. మీటర్లు సమస్యలు. సరఫరాలో అంతరాయాలు.పలు సమస్యలను నేరుగా ఫోరం దృష్టికి తీసుకువచ్చి. పరిష్కారం పొందవొచ్చని పేర్కొన్నారు. కన్స్యూమర్ గ్రీవెన్స్ రిడ్రెసల్ ఫోరం కార్యక్రమంలో గ్రామ సర్పంచ్లు, ప్రజాప్రతి నిధులు, నాయకులు వినియోగదారులు పాల్గొని. సద్వినియోగం చేసుకోవాలన్నారు.

# జిల్లాలో సీఐల బదిలీలు

## కొత్తగూడెం వన్‌టౌన్‌కు సముద్రాల జితేందర్.. టూటౌన్‌కు షేక్ యాసిన్

**కొత్తగూడెం క్రైమ్, అక్టోబర్ 5 ప్రభాతవార్త:**భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో సీఐల బదిలీలు, నియామకాలు చేపడుతూ మల్టీజోన్–1 హైదరాబాద్ పోలీస్ ఎస్టాబ్లిష్‌మెంట్ బోర్డు ఉత్తర్వులు జారీ చేసింది. కొత్తగూడెం వన్‌టౌన్ సీఐగా విధులు నిర్వహిస్తున్న ముప్పారపు కరుణాకర్‌ను మల్టీజోన్–1కు అటాచ్ చేస్తూ ఆదేశాలు వెలువడ్డాయి. ఆయన స్థానంలో టీజీసీఎస్‌బీలో డిప్యూటేషన్‌పై విధులు నిర్వహిస్తున్న సముద్రాల జితేందర్‌ను కొత్తగూడెం వన్‌టౌన్ సీఐగా నియమించారు. ఇక కొంతకాలంగా ఖాళీగా ఉన్న కొత్తగూడెం టూటౌన్ సీఐ పోస్టులో షేక్ యాసిన్‌ను నియమిస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. అలాగే ఎస్.రాజును భద్రాచలం టౌన్ సీఐగా నియమించారు. చుంచుపల్లి సీఐ గా ఉన్న వెంకటేశ్వర్లు ను ఎస్బి కి బదిలీ చేసారు. ఆయన స్థానంలో ఖమ్మం ట్రాఫిక్ లో విధులు నిర్వహిస్తున్న శివ ప్రసాద్ చుంచుపల్లి సర్కిల్ సీఐ గా రానున్నారు. కొత్త నియామకాలతో ఆయా పోలీస్ స్టేషన్లలో శాంతిభద్రతల పరిరక్షణ, నేర నియంత్రణపై అధికారులు మరింత దృష్టి సారించనున్నారు.

# రోడ్డు బాగయ్యే వరకు పోరాటం ఆగదు!

**దుమ్ము, ధూళితో ప్రజలు ఉక్కిరిబిక్కిరి..**
**అధికారుల నిర్లక్ష్యంపై ఆగ్రహం**
**శేషగిరినగర్‌లో రోడ్డుపై బైఠాయించిన తెలంగాణ రక్షణ సేన, టీఆర్ఎస్ నాయకులు**

**కొత్తగూడెం టౌన్, అక్టోబర్ 5 ప్రభాతవార్త:**
ఏళ్ల తరబడి శిథిలావస్థలో ఉన్న రహదారి.. నిత్యం దుమ్ము, ధూళితో కాలుష్యం.. చిన్నారుల నుంచి వృద్ధుల వరకు తీవ్ర ఇబ్బందులు.. అయినా అధికారుల్లో మాత్రం చలనం లేదని తెలంగాణ రక్షణ సేన భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అధ్యక్షుడు సముద్రాల క్రాంతి మండిపడ్డారు. ప్రజా సమస్య పరిష్కారం కోసం శేషగిరినగర్ కాలనీవాసులతో కలిసి రోడ్డుపై బైఠాయించి నిరసన తెలిపారు. కొత్తగూడెం పోస్టాఫీస్ సెంటర్ నుంచి హేమచంద్రపురం వెళ్లే ప్రధాన రహదారి గత మూడేళ్లుగా అధ్వానంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. రైటర్ బస్తీ,



శేషగిరినగర్, వికలాంగుల కాలనీ, వెంకటేశ్వర కాలనీ ప్రజలు ప్రతిరోజూ దుమ్ము, ధూళితో నరకయాతన అనుభవిస్తున్నారని తెలిపారు. రోడ్డు మీద భారీ వాహనాల రాకపోకలతో పరిస్థితి మరింత దారుణంగా మారిందన్నారు. "ప్రజలు ఇబ్బందులు పడుతున్నా ఎమ్మెల్యేకు కనిపించడం లేదా?" అంటూ క్రాంతి ప్రశ్నించారు. రహదారి సమస్యపై జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ కోర్టులో పిటిషన్లు దాఖలైనప్పటికీ సమస్య పరిష్కారం కాకపోవడం అధికారుల నిర్లక్ష్యానికి నిదర్శనమన్నారు. ఈ రహదారిలో పంచాయతీరాజ్ కార్యాలయం, జిల్లా కోర్టు, ప్రభుత్వ, మిషనరీ పాఠశాలలు, జూనియర్ కళాశాల, వివిధ ప్రభుత్వ కార్యాలయాలతో పాటు జిల్లా పోలీస్ హెడ్‌క్వార్టర్స్ కూడా ఉన్నాయని గుర్తుచేశారు.

ప్రతిరోజూ ఈ మార్గంలో ప్రయాణించే అధికారులు, ప్రజాప్రతినిధులకు రోడ్డు దుస్థితి కనిపించకపోవడం ఆశ్చర్యంగా ఉందన్నారు. కొత్తగూడెంను మున్సిపల్ కార్పొరేషన్‌గా ఏర్పాటు చేశామని చెప్పుకుంటున్న పాలకులు కనీస మౌలిక వసతుల కల్పనలో ఎందుకు విఫలమవుతున్నారని ప్రశ్నించారు. ప్రజల సమస్యలను పరిష్కరించడమే తమ ప్రధాన లక్ష్యమని, తమ నాయకురాలు కవితమ్మ ఆదేశాల మేరకు ప్రజా సమస్యలపై నిరంతర పోరాటం కొనసాగిస్తామని స్పష్టం చేశారు. రోడ్డు నిర్మాణ పనులు పూర్తయ్యే వరకు వెనక్కి తగ్గేది లేదని క్రాంతి హెచ్చరించారు. అప్పటివరకు ఈ మార్గంలో సింగరేణి రవాణా వాహనాలతో పాటు భారీ వాహనాల రాకపోకలను నియంత్రించేందుకు అధికారులు తక్షణ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సమస్యను పరిష్కరించకపోతే ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. నిరసన కార్యక్రమంలో టీఆర్ఎస్ కార్మిక విభాగం (టీఆర్‌టీయూ) రాష్ట్ర అధ్యక్షుడు డి.వీరన్న, మహిళా విభాగం నాయకురాలు దోనెపల్లి కమల గాయత్రి, లకావత్ సురేష్, కొత్తగూడెం నియోజకవర్గ ఇన్‌చార్జి నమ్మి జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

# డీఈవో శంభు ప్రసాద్‌కు ట్రస్మా ఘన సన్మానం

**ప్రైవేట్ పాఠశాలల సమస్యలపై వినతిపత్రం..**
**సానుకూలంగా స్పందించిన డీఈవో**
**జిల్లాను విద్యలో రాష్ట్రంలో అగ్రస్థానంలో నిలపడానికి అందరి సహకారం అవసరం: శంభు ప్రసాద్**

**కొత్తగూడెం ఎడ్యుకేషన్, అక్టోబర్ 5 ప్రభాతవార్త:**
భద్రాద్రి కొత్తగూడెం జిల్లా నూతన విద్యాశాఖ అధికారి (డీఈవో)గా బాధ్యతలు స్వీకరించిన శంభు ప్రసాద్‌ను తెలంగాణ రికగ్నైజ్డ్ స్కూల్స్ మేనేజ్‌మెంట్ అసోసియేషన్ (ట్రస్మా) ప్రతినిధులు సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో



డీఈవోను కలిసి శాలువా కప్పి, పుష్పగుచ్ఛం అందజేసి ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా జిల్లాలోని ప్రైవేట్ పాఠశాలలు, విద్యాసంస్థలు ఎదుర్కొంటున్న వివిధ సమస్యలను ట్రస్మా ప్రతినిధులు డీఈవో దృష్టికి తీసుకెళ్లారు. సమస్యల పరిష్కారానికి సంబంధించిన అంశాలతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు. దీనిపై డీఈవో శంభు ప్రసాద్ సానుకూలంగా స్పందిస్తూ, నిబంధనల పరిధిలో సమస్యలను పరిశీలించి పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చినట్లు ట్రస్మా ప్రతినిధులు తెలిపారు. ఈ సందర్భంగా డీఈవో శంభు ప్రసాద్ మాట్లాడుతూ.. జిల్లాలో విద్యా ప్రమాణాలను మరింత మెరుగుపరచి భద్రాద్రి కొత్తగూడెం జిల్లా విద్యాశాఖను రాష్ట్రంలో అగ్రస్థానంలో నిలపడానికి అధికారులు, ఉపాధ్యాయులు, ప్రభుత్వ, ప్రైవేట్ విద్యాసంస్థల యాజమాన్యాలు సమన్వయంతో పనిచేయాల్సిన అవసరం ఉందన్నారు. విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని అందరి సహకారం అవసరమని పేర్కొన్నారు. కార్యక్రమంలో ట్రస్మా జిల్లా అధ్యక్షుడు బండి లక్ష్మణ్, కార్యదర్శి భాగం విజయకుమార్, కోశాధికారి మధుసూదన్‌రెడ్డితో పాటు శ్రీధర్‌రెడ్డి, కిషోర్, చైతన్య, వరప్రసాద్, డాక్టర్ బి.ఎన్.ఆర్, రమేష్, మణికంఠ, చక్రధర్, కోటిరెడ్డి, రాంబాబు, సురేష్, నరసింహారావు, కవిత, పి.రమేష్, కృష్ణప్రసాద్, బోడ పుణ్యానాయక్, కే.వెంకటేశ్వరరావు, ప్రతాపరెడ్డి, శ్రీనివాసరావు, చంద్రమోళి తదితర ప్రైవేట్ పాఠశాలల యాజమాన్య ప్రతినిధులు పాల్గొన్నారు.

# ప్రమాదమా.. దాడి చేసి ప్రమాదంగా చిత్రీకరించారా?

**చుంచుపల్లి తండాలో యువకుడి అనుమానాస్పద మృతి**
**అన్ని కోణాల్లో దర్యాప్తు కోరుతున్న బంధువులు**

**చుంచుపల్లి, అక్టోబర్ 5 ప్రభాతవార్త:**
చుంచుపల్లి మండలం చుంచుపల్లి తండాకు చెందిన ధరావత్ హరికృష్ణ (37) ఆదివారం అర్ధరాత్రి అనుమానాస్పద రీతిలో మృతి చెందాడు. హౌసింగ్ బోర్డు నుంచి చుంచుపల్లి తండాకు ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా మార్గమధ్యలో అదుపుతప్పి కిందపడటంతో తలకు తీవ్ర గాయాలై మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. ప్రమాద సమయంలో



హరికృష్ణ మద్యం సేవించి ఉన్నట్లు పోలీసులు పేర్కొన్నారు. అయితే హరికృష్ణ రాత్రి సమయంలో ఒంటరిగా ప్రయాణిస్తుండగా ప్రమాదానికి గురై మృతి చెందడంపై కుటుంబ సభ్యులు, బంధువులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. ఎవరైనా దాడి చేసి అనంతరం ప్రమాదంగా చిత్రీకరించి ఉండవచ్చనే అనుమానాలను వారు పోలీసుల దృష్టికి తీసుకెళ్లారు. ప్రమాద స్థలం, మృతదేహంపై గాయాల స్వభావం, ద్విచక్ర వాహనం పరిస్థితి తదితర అంశాలను క్షుణ్ణంగా పరిశీలించి వాస్తవాలను వెలికి తీయాలని కోరుతున్నారు. మృతుడికి ఇద్దరు పిల్లలు ఉన్నారు. బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి ప్రమాదంతో పాటు ఇతర అనుమానాస్పద కోణాల్లోనూ దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రవికుమార్ తెలిపారు. దర్యాప్తులో వెలువడే ఆధారాల ఆధారంగానే మృతి ప్రమాదమా, మరేదైనా కారణమా అన్నది తేలనుంది.

# రహదారి ఇరువైపులా ముళ్ళపొదలు, చెట్ల తొలగింపు.

**వాహనదారుల ఇబ్బందులకు చెక్ పెట్టిన సర్పంచ్ సోడే మహేశ్వరి**

**పాల్వంచ ,అక్టోబర్ 05,ప్రభాత వార్త:**



గ్రామపంచాయతీ పరిధిలో ప్రజలకు మెరుగైన రహదారి సౌకర్యాలు కల్పించడమే లక్ష్యంగా సర్పంచ్ సోడే మహేశ్వరి మరో కీలక ముందడుగు వేశారు.రహదారికి ఇరువైపులా చెట్లు, ముళ్ళపొదలు విపరీతంగా పెరగడంతో వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడేది.ఎదురుగా వచ్చే వాహనాలు సరిగా కనిపించక ప్రమాదాలు జరిగే అవకాశం ఉండటంతో,వాహనదారులు పడుతున్న ఇబ్బందులను సర్పంచ్ మహేశ్వరి ప్రవీణ్ తక్షణమే గుర్తించారు. ఈ సమస్య పరిష్కారానికి బ్లేడు బండి (జెసిబి/ట్రాక్టర్) సహాయంతో రహదారికి ఇరువైపులా ఉన్న చెట్ల కొమ్మలను,పొదలను పూర్తిగా తొలగించే పనులను దగ్గరుండి చేయించారు. రహదారిని శుభ్రం చేయించడంతో ప్రయాణం సుఖవంతమైందని స్థానిక ప్రజలు, వాహనదారులు హర్షం వ్యక్తం చేశారు.

# 25 వేల మంది విద్యార్థులకు కంటి పరీక్షలు

**ఈ నెల 9 నుంచి ఐటీడీఏ పరిధిలో ప్రత్యేక శిబిరాలు**

**భద్రాచలం,ప్రభాతవార్త**



ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ నూతన కార్యవర్గం ఐటీడీఏ పీఓ బి.రాహుల్‌ను సోమవారం మర్యాద పూర్వకంగా కలిసింది.అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల నిర్వహణకు సంబంధించిన వినతిపత్రాన్ని పీఓకు సమర్పించింది.ఐటీడీఏ పరిధిలోని 63 ఆశ్రమ పాఠశాలలు, 32 గురుకుల కళాశాలల్లో కంటి పరీక్షలు నిర్వహించేందుకు పీఓ ఆమోదం తెలిపారు.సుమారు 25 వేల మంది విద్యార్థులకు ఈ నెల 9వ తేదీ నుంచి కంటి పరీక్షలు నిర్వహించనున్నారు.అవసరమైన వారికి ఉచితంగా కంటి అద్దాలు అందించనున్నారు.పాల్వంచలో డయాలసిస్, క్యాన్సర్ కేంద్రాలకు చర్యలుతలసేమియా, సికిల్‌సెల్ బాధితులకు వైద్య సహాయంకంటి చూపు తక్కువగా ఉన్న వారికి శస్త్రచికిత్స శిబిరాలు నిర్వహించేందుకు చర్యలు చేపట్టనున్నారు.తలసేమియా, సికిల్‌సెల్ ఎనీమియా బాధితుల కోసం రెడ్‌క్రాస్ ఆస్పత్రికి బయోకెమిస్ట్రీ ఎనలైజర్ అందించేందుకు సహకరిస్తామని పీఓ తెలిపారు.పాల్వంచలో మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రి, క్యాన్సర్ నిర్ధారణ కేంద్రం, డయాలసిస్ సెంటర్, రక్తనిధి కేంద్రం ఏర్పాటుకు నిధులు సమకూర్చేందుకు చర్యలు చేపడతామన్నారు.ఈ సందర్భంగా పీఓ బి.రాహుల్‌కు రెడ్‌క్రాస్ నూతన కార్యవర్గ సభ్యులు కృతజ్ఞతలు తెలిపి సత్కరించారు. రెడ్‌క్రాస్ జిల్లా చైర్మన్ డాక్టర్ ఎస్.ఎల్.కాంతారావు, వైస్ చైర్మన్ చల్లగుళ్ల నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

# ఎస్సీ స్టడీ సర్కిల్ లో ఉచిత రెసిడెన్షియల్ శిక్షణ

**ఖమ్మం విద్యా విభాగం అక్టోబర్ 5, ప్రభాత వార్త:**
రాష్ట్ర షెడ్యూల్డ్ కులముల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో ఉమ్మడి ఖమ్మం జిల్లాకు చెందిన ఎస్సీ, ఎస్టీ, బిసి, మైనారిటీ నిరుద్యోగ అభ్యర్థుల నుంచి ఎస్సై, పోలీస్ కానిస్టేబుల్ ప్రిలిమ్స్ పరీక్షల కొరకు ఉచిత భోజనం, రెసిడెన్షియల్ శిక్షణ ఇచ్చేందుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఎస్సీ సంక్షేమ శాఖ ఉప సంచాలకులు, ఎస్సీ స్టడీ సర్కిల్ కార్యదర్శి జి. జ్యోతి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు.!! తెలంగాణ ఎస్సీ స్టడీ సర్కిల్ స్టేట్ డైరెక్టర్ ఏ. నరసింహ రెడ్డి ఆదేశాల మేరకు ఈ ఉచిత శిక్షణ ఖమ్మం ఎస్సీ స్టడీ సర్కిల్ కేంద్రంలో నిర్వహించబడుతుందని అన్నారు.ఈ శిక్షణా కాలపరిమితి ఈ నెల 12 నుండి డిసెంబర్ 20 వరకు (రెండు నెలలు) కొనసాగుతుందని ఉప సంచాలకులు అన్నారు. ఎస్సై, పోలీస్ కానిస్టేబుల్ ఉచిత శిక్షణ కొరకు దరఖాస్తు చేసుకునే అభ్యర్థులు ఎస్సై, పోలీస్ కానిస్టేబుల్ పోస్ట్ లకి దరఖాస్తు చేసిన అక్నాలెడ్జ్‌మెంట్ జిరాక్స్ తోపాటు డిగ్రీ విద్యార్హత ఒరిజినల్ సర్టిఫికేట్, అన్ని విద్యార్హతల సర్టిఫికేట్ల జిరాక్స్ ప్రతులు, రెండు పాస్‌పోర్ట్ సైజ్ ఫోటోలు, ఆధార్ కార్డు జిరాక్స్!!లతో ఈ నెల 5 వ తేదీ నుంచి ఈ నెల 9 వ తేదీ సాయంత్రం 5.00 గంటల వరకు రిపోర్ట్ చేయాలన్నారు. ఇతర పూర్తి వివరాల కోసం అభ్యర్థులు 9866726277, 9032077276 ఫోన్ నంబర్లలో సంప్రదించవచ్చని ఉప సంచాలకులు ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

# శంకుస్థాపనలు ఘనం.. అభివృద్ధి శూన్యం!

**విలీన డివిజన్లలో అడుగడుగునా సమస్యలే...**

**శంకుస్థాపనలకే పరిమితమైన పనులు..**

**మౌలిక వసతుల కోసం ప్రజల ఎదురుచూపులు**

**పారిశుద్ధ్య కార్మికుల కొరతతో పేరుకుపోతున్న సమస్యలు**

**వీధిలైట్లు లేక పలు ప్రాంతాలు అంధకారంలో.. తాగునీటికీ ఇబ్బందులు**

**బ్లీచింగ్, ఫాగింగ్ ఊసే లేదు.. వార్డు అధికారులు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ అందుబాటులో లేరు**

సుజాతనగర్ అక్టోబర్ 5 ప్రభాతవార్త:

గ్రామపంచాయతీ నుంచి కొత్తగూడెం మున్సిపల్ కార్పొరేషన్‌లో విలీనమైన సుజాతనగర్ మండలంలోని నాలుగు డివిజన్లలో అభివృద్ధి పనులు ముందుకు సాగడం లేదన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. కార్పొరేషన్‌లో విలీనమై పాలన మారినా.. ప్రజల సమస్యలు మాత్రం పరిష్కారానికి నోచుకోవడం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు జరిగినా, క్షేత్రస్థాయిలో పనులు మాత్రం కనిపించడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. మౌలిక వసతుల కల్పనలో అధికారులు, ప్రజాప్రతినిధులు ప్రత్యేక దృష్టి సారించాల్సిన అవసరం ఉందని ప్రజలు కోరుతున్నారు.

**పారిశుద్ధంపై నిరక్ష   ్యం?**

విలీన డివిజన్లలో పారిశుద్ధ్య కార్మికుల కొరత తీవ్రంగా ఉందని స్థానికులు చెబుతున్నారు. దీంతో వీధులు, కాలనీల్లో పారిశుద్ధ్య నిర్వహణ సక్రమంగా జరగడం లేదనే ఫిర్యాదులు ఉన్నాయి. దోమల నివారణకు చేపట్టాల్సిన బ్లీచింగ్ ప్రక్రియ, ఫాగింగ్ కార్యక్రమాలు కూడా క్రమం తప్పుతున్నాయని ప్రజలు అంటున్నారు. దోమల విజృంభణ సమయంలోనూ అధికారులు పట్టించుకోవడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి.

**వీధిలైట్లు లేక అంధకారం**

పలు డివిజన్లలో వీధిలైట్లు లేక రాత్రివేళల్లో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ప్రధాన రహదారులతో పాటు అంతర్గత కాలనీల్లోనూ చీకటి నెలకొంటుండటంతో మహిళలు, వృద్ధులు, విద్యార్థులు రాత్రి వేళల్లో బయటకు రావడానికి భయపడుతున్నారని స్థానికులు చెబుతున్నారు. పనిచేయని లైట్లను మరమ్మతు చేయడంతో పాటు అవసరమైన ప్రాంతాల్లో కొత్త వీధిలైట్లు ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

**వార్డు అధికారులు ఎక్కడ?**

కార్పొరేషన్‌లో విలీనమైనా ప్రజలకు స్థానికంగా సమస్యలు చెప్పుకునేందుకు వార్డు స్థాయి అధికారుల వ్యవస్థ అందుబాటులో లేకపోవడంపై అసంతృప్తి వ్యక్తమవుతోంది. వార్డు ఆఫీసర్లు లేకపోవడంతో సమస్యలను ఎవరికి చెప్పాలో తెలియని పరిస్థితి నెలకొందని ప్రజలు అంటున్నారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్ కూడా క్రమం తప్పకుండా పర్యటించడం లేదనే ఆరోపణలు ఉన్నాయి. దీంతో పారిశుద్ధ్య సమస్యలపై పర్యవేక్షణ కొరవడుతోందని స్థానికులు పేర్కొంటున్నారు.

**మోటార్లు ఖరాబైతే నీటి కష్టాలే..**

విలీన డివిజన్లలో తాగునీటి సమస్య కూడా ప్రజలను వేధిస్తోంది. మంచినీటి సరఫరా మోటార్లు మరమ్మతులకు గురైతే వెంటనే ప్రత్యామ్నాయ ఏర్పాట్లు లేకపోవడంతో నీటి కోసం ప్రజలు ఇబ్బందులు పడాల్సి వస్తోందని పాడైన మోటర్లు మరమ్మత్తుల కోసం దాదాపు 3 నుంచి 5 రోజులు పడుతుంది ఆవేదన వ్యక్తం చేశారు. మోటార్ల నిర్వహణ, మరమ్మతుల కోసం ప్రత్యేక వ్యవస్థ ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

**స్మశాన వాటికల్లోనూ వసతుల కొరత**

విలీన ప్రాంతాల్లోని స్మశాన వాటికల్లో కనీస వసతులు కూడా పూర్తిస్థాయిలో అందుబాటులో లేవని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మౌలిక సదుపాయాలు, పరిశుభ్రత, రహదారులు అవసరమైన ఇతర వసతులు కల్పించాల్సిన అవసరం ఉందని పేర్కొంటున్నారు.

**శంకుస్థాపనలకే పరిమితం కాకుండా పనులు చేపట్టాలి**

కార్పొరేషన్‌లో విలీనంతో తమ ప్రాంతాలు మరింత అభివృద్ధి చెందుతాయని ఆశించిన ప్రజలకు నిరాశే ఎదురవుతోందని స్థానికులు అంటున్నారు. శంకుస్థాపనలతో సరిపెట్టకుండా పనులను పూర్తి చేసి ప్రజలకు మౌలిక వసతులు అందించాలని కోరుతున్నారు. పారిశుద్ధం, వీధిలైట్లు, తాగునీరు, స్మశాన వాటికలు, దోమల నివారణ వంటి సమస్యలపై ప్రత్యేక కార్యాచరణ రూపొందించి వెంటనే పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.

**అధికారులారా.. విలీనం ఎందుకు? అభివృద్ధి ఎప్పుడు?**

కార్పొరేషన్‌లో విలీనం చేసి పన్నులు, పరిపాలనను విస్తరించినప్పుడు ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు కల్పించాల్సిన బాధ్యత అధికారులపై లేదా? పారిశుద్ధ్య కార్మికుల కొరత, వీధిలైట్ల సమస్య, తాగునీటి ఇబ్బందులు, ఫాగింగ్–బ్లీచింగ్ లోపం, వార్డు అధికారుల అందుబాటులో లేకపోవడం వంటి సమస్యలు నెలల తరబడి కొనసాగుతున్నా పట్టించుకోకపోవడానికి కారణమేంటి? శంకుస్థాపనలతో ఫొటోలు దిగడమే అభివృద్ధి అనుకుంటున్నారా? లేక పనులు పూర్తి చేసి ప్రజలకు ఫలితం చూపిస్తారా? విలీన డివిజన్ల ప్రజల సమస్యలపై తక్షణ కార్యాచరణ ప్రకటించి, పనులకు గడువు నిర్ణయించి పూర్తి చేయాల్సిన బాధ్యత ఎవరిది? ప్రజల సహనాన్ని పరీక్షి   ంచకుండా అధికారులు ఇప్పటికైనా మేల్కొంటారా? లేదా అనేది వేసి చూడాలి.

---

# పత్తి ఎంఎస్ పి కొనుగోళ్లను పకడ్బందీగా నిర్వహించాలి

**జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్.**

**రైతులకు మద్దతు ధర అందేలా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలి.**

**129 రైతు వేదికల్లో మాయిశ్చర్ మీటర్లు అందుబాటులో ఉంచాలి.**

**నోటిఫై చేసిన 8 జిన్నింగ్ మిల్లుల్లో కొనుగోళ్లకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలి.**

ఖమ్మం వ్యవసాయం అక్టోబర్05: (ప్రభాతవార్త)

202627 సీజన్ లో పత్తి కనీస మద్దతు ధర కు కొనుగోళ్లను సమర్థవంతంగా పర్యవేక్షి   స్తూ, రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా కొనుగోలు ప్రక్రియ సజావుగా జరిగేలా పకడ్బందీ చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో సంబంధిత శాఖల అధికారులతో పత్తి కనీస మద్దతు ధర కొనుగోళ్ల ఏర్పాట్లపై జిల్లా కలెక్టర్ సమీక్షి   ంచారు. ఈ సందర్భంగా పత్తి సాగు విస్తీర్ణం, అంచనా దిగుబడి, కొనుగోలు కేంద్రాలు, రైతుల నమోదు, నాణ్యత ప్రమాణాలు, తేమ శాతం, వెయిమెంట్, చెల్లింపులు, భద్రత తదితర అంశాలపై సమీక్షి   ంచారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ  కేంద్ర ప్రభుత్వం 202627 సీజన్‌కు పత్తి కనీస మద్దతు ధర (ఎం ఎస్ పి)ను క్వింటాల్‌కు రూ. 8,667గా నిర్ణయించిందన్నారు. 202526 సీజన్‌లో క్వింటాల్‌కు రూ. 8,110 ఉండగా, ప్రస్తుతం రూ. 557 పెంచినట్లు తెలిపారు. మీడియం స్టేపుల్ పత్తికి క్వింటాల్‌కు రూ. 8,267, లాంగ్ స్టేపుల్ పత్తికి క్వింటాల్‌కు రూ. 8,667 మద్దతు ధరగా నిర్ణయించబడిందని తెలిపారు.

202627 సీజన్‌లో ఖమ్మం జిల్లాలో 2,35,637 ఎకరాల్లో పత్తి సాగు చేసినట్లు కలెక్టర్ తెలిపారు. గత ఏడాది 2,25,613 ఎకరాల్లో పత్తి సాగు కాగా, ఈ ఏడాది 10,024 ఎకరాల మేర సాగు విస్తీర్ణం పెరిగిందన్నారు.

**రైతుల వివరాలను కపాస్ కిసాన్ యాప్‌కు అనుసంధానం చేయాలి:**

పత్తి కొనుగోళ్లలో వ్యవసాయ శాఖ కీలక పాత్ర పోషించాలని కలెక్టర్ సూచించారు. నిజమైన పత్తి రైతులను గుర్తించేందుకు సమగ్ర కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలని ఆదేశించారు. కౌలు రైతులను తాత్కాలికంగా డేటాబేస్‌లో నమోదు చేసే విధానాన్ని అమలు చేయాలని తెలిపారు. పత్తి సాగు చేస్తున్న రైతుల వివరాలను ఎన్ఐసి ద్వారా కపాస్ కిసాన్ యాప్‌కు బదిలీ చేసే ప్రక్రియను పూర్తి చేయాలని సూచించారు. అగ్రి స్టాక్‌ను కపాస్ కిసాన్ యాప్‌తో అనుసంధానం చేసి రైతుల వివరాలు, సేవల పంపిణీని మరింత సులభతరం చేసేందుకు వ్యవసాయ, మార్కెటింగ్ శాఖలు, సిసిఐ సమన్వయంతో చర్యలు చేపట్టాలని ఆదేశించారు.

**అంతర్ జిల్లా మ్యాపింగ్‌ను ముందుగానే పూర్తి చేయాలి:**

పత్తి కొనుగోళ్లలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అవసరమైన అంతర్ జిల్లా మ్యాపింగ్ ప్రతిపాదనలను ముందుగానే ఖరారు చేసి సిసిఐ పరిశీలనకు పంపాలని కలెక్టర్ సూచించారు. కొనుగోళ్ల ప్రారంభమయ్యే నాటికి అవసరమైన అన్ని ప్రక్రియలను పూర్తి చేయాలని ఆదేశించారు. రైతులు తమ పత్తిని కొనుగోలు కేంద్రాలకు తీసుకురాక ముందే తేమ శాతాన్ని పరిశీలించుకునేలా జిల్లాలోని 129 రైతు వేదికల్లో మాయిశ్చర్ మీటర్లు అందుబాటులో ఉంచాలని మార్కెటింగ్ శాఖను కలెక్టర్ ఆదేశించారు. తేమ శాతం అధికంగా ఉండటం వల్ల పత్తి తిరస్కరణకు గురికాకుండా రైతులకు ముందుగానే అవగాహన కల్పించాలని సూచించారు.

**టోల్‌ఫ్రీ, వాట్సాప్ నంబర్లపై విస్తృత ప్రచారం:**

పత్తి కొనుగోళ్లకు సంబంధించి రైతుల సమస్యలను పరిష్కరించేందుకు 1800 599 5779 టోల్‌ఫ్రీ నంబర్, 88972 81111 వాట్సాప్ నంబర్‌ను కొనసాగించాలని కలెక్టర్ సూచించారు. ప్రత్యేక సిబ్బందిని ఏర్పాటు చేసి రైతుల సమస్యలను ప్రతిరోజూ ఎప్పటికప్పుడు పరిష్కరించాలని ఆదేశించారు. ప్రతి మంగళవారం నిర్వహించే రైతు నేస్తం కార్యక్రమం ద్వారా పత్తి కొనుగోళ్లకు సంబంధించిన ఎఫ్ఏక్యూ ప్రమాణాలు, స్లాట్ బుకింగ్ విధానం, టోల్‌ఫ్రీ నంబర్, కొనుగోలు కేంద్రాల వివరాలపై రైతులకు విస్తృత అవగాహన కల్పించాలని కలెక్టర్ సూచించారు. బ్రోచర్లు, వాల్ పోస్టర్లు, కర పత్రాలు, బ్యానర్లు, టీవీ చానళ్లతో పాటు బల్క్ మెసేజ్‌ల ద్వారా కూడా రైతులకు విస్తృత ప్రచారం నిర్వహించాలని ఆదేశించారు.

**కొనుగోలు స్లాట్ల వివరాలను ముందుగానే తెలియజేయాలి:**

సిసిఐ అధికారులు పత్తి కొనుగోలు స్లాట్ల ప్రారంభ వివరాలను జిల్లా కలెక్టర్, జిల్లా మార్కెటింగ్ అధికారి, మార్కెట్ కమిటీ కార్యదర్శులకు ముందుగానే అందించాలని కలెక్టర్ సూచించారు. తద్వారా రైతులకు ముందస్తుగా సమాచారం అందించి కొనుగోలు ప్రక్రియను క్రమబద్ధీకరించాలని తెలిపారు. కొనుగోళ్ల ప్రారంభమైన వెంటనే అన్ని నోటిఫైడ్ జిన్నింగ్ మిల్లులను కార్యకలాపాల్లోకి తీసుకురావాలని సూచించారు. రైతులు సమీపంలోని జిన్నింగ్ మిల్లుకు పత్తిని తరలించుకునే అవకాశం కల్పించడం ద్వారా రవాణా ఖర్చు తగ్గుతుందని తెలిపారు. అన్ని మిల్లులను ఒకేసారి ప్రారంభించడం ద్వారా కొన్ని మిల్లుల్లో మాత్రమే ముడి పత్తి నిల్వలు పేరుకుపోకుండా నివారించవచ్చని పేర్కొన్నారు.

**8 జిన్నింగ్ మిల్లులను కొనుగోలు కేంద్రాలుగా నోటిఫై:**

202627 సీజన్‌లో ఖమ్మం జిల్లాలో పత్తి కొనుగోళ్ల కోసం 8 జిన్నింగ్ మిల్లులను కొనుగోలు కేంద్రాలుగా నోటిఫై చేసినట్లు కలెక్టర్ తెలిపారు. ఖమ్మం, మద్దులపల్లి, మధిర, వైరా ప్రాంతాల్లోని నోటిఫైడ్ జిన్నింగ్ మిల్లుల్లో కొనుగోలు ఏర్పాట్లు చేపట్టాలని ఆదేశించారు.

**అగ్నిమాపక భద్రతా పరికరాల తనిఖీలు పూర్తి చేయాలి:**

కొనుగోలు కేంద్రాలుగా ప్రతిపాదించిన జిన్నింగ్ మిల్లుల్లో అగ్నిమాపక భద్రతా పరికరాల తనిఖీలను అత్యవసరంగా పూర్తి చేయాలని కలెక్టర్ సూచించారు. జిల్లా అగ్నిమాపక అధికారి అన్ని ప్రతిపాదిత జిన్నింగ్ మిల్లులను తనిఖీ చేసి, అవసరమైన భద్రతా ప్రమాణాలు పాటించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

జిన్నింగ్ మిల్లుల్లోని అన్ని వేయింగ్ బ్రిడ్జ్‌లను కొనుగోళ్ల ప్రారంభానికి ముందే తనిఖీ చేసి, క్యాలిబ్రేషన్‌ను నిర్ధారించాలని జిల్లా లీగల్ మెట్రాలజీ అధికారిని కలెక్టర్ ఆదేశించారు. కొనుగోలు సీజన్ మొత్తం వేయింగ్ బ్రిడ్జ్‌లను తరచుగా తనిఖీ చేస్తూ ఖచ్చితమైన తూకం జరిగేలా చూడాలని సూచించారు. మాయిశ్చర్ మీటర్ రీడింగులు, ఎఫ్ఏక్యూ ప్రమాణాల రీడింగులు, వెయిమెంట్ డేటాను సిస్టమ్ సాఫ్ట్‌వేర్‌తో డిజిటల్‌గా అనుసంధానం చేసే చర్యలు చేపట్టాలని ఆదేశించారు. జిన్నింగ్ మిల్లులు, మార్కెట్ యార్డుల్లో అవసరమైన సమయంలో పోలీసు భద్రత కల్పించాలని కలెక్టర్ సూచించారు. పత్తి బేళ్ల రవాణాలో ఎలాంటి సమస్యలు తలెత్తకుండా పోలీసు, రవాణా శాఖలు సమన్వయంతో పనిచేసి సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. అన్ని పత్తి కొనుగోలు కేంద్రాలు, నోటిఫైడ్ జిన్నింగ్ మిల్లుల్లో నిర్దేశిత ప్రమాణాల ప్రకారం సీసీటీవీ కెమెరాలను ఏర్పాటు చేసి, అవి నిరంతరం పనిచేసేలా నిర్వహించాలని కలెక్టర్ ఆదేశించారు.

**కనీస మద్దతు ధర ప్రయోజనం పొందేందుకు ఆధార్ ధృవీకరణ తప్పనిసరి:**

కనీస మద్దతు ధర ప్రయోజనాలను పొందేందుకు రైతులు ఆధార్ ఆధారిత ధృవీకరణ ప్రక్రియను పూర్తి చేయాలని కలెక్టర్ తెలిపారు. పత్తి కొనుగోలు, చెల్లింపుల ప్రక్రియను ఆధార్ ధృవీకరించిన బ్యాంకు ఖాతాలతో అనుసంధానం చేయనున్నందు న రైతులు తమ ఆధార్, బ్యాంకు ఖాతా వివరాలు సక్రమంగా ఉండేలా చూసుకోవాలని సూచించారు.

ఈ సమావేశంలో జిల్లా మార్కెటింగ్ అధికారి సంతోష్, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి డి. పుల్లయ్య, సిసిఐ, అగ్నిమాపక, లీగల్ మెట్రాలజీ, పోలీస్, రవాణా శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## భద్రాద్రి బ్యాంకు 30వ అవతరణ దినోత్సవం వేడుకలు

**ఖమ్మం అక్టోబర్ 5 ప్రభాత వార్త:**



ఖమ్మంలో గాంధీచౌక్ హెడ్ ఆఫీసులో భద్రాద్రి కో పరేటివ్ అర్బన్ బ్యాంకు 30వ అవతరణ దినోత్సవం వేడుకలు ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా కేకు కట్చేసి బ్యాంకు చైర్మన్ చెరుకూరి కృష్ణమూర్తి మాట్లాడుతూ.. బ్యాంకు 29 వసంతాలు పూర్తి చేసుకొని 30వ సంవత్సరంలోకి అడుగుపెడుతున్న సందర్భంగా ఖాతాదారులకు, శ్రేయోభిలాషులకు, వాటాదారులకు, సిబ్బందికి, తనతో కలిసి పనిచేసిన పూర్వ ప్రస్తుత డైరెక్టర్లకు శుభాకాంక్షలు కృతజ్ఞతలు తెలిపారు. బ్యాంకు వివిధ రంగాల వారికీ ఋణ సహాయంచేస్తూ సమాజంలో వారి అభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తోందని తెలిపారు. బ్యాంకు 25 శాఖలతో విస్తరించిందని , బ్యాంకు యొక్క వ్యాపార టర్నోవరు రూ++ 1065 కోట్లు దాటిందని సంతోషం వ్యక్తం చేశారు. ఖాతాదారులు తమ మీద వుంచిన విశ్వాసానికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. బ్యాంకు వైస్ చైర్మన్ లు సన్నే ఉదయ్ ప్రతాప్ , వేములపల్లి వెంకటేశ్వరరావు, బ్యాంకు డైరెక్టర్స్ దేవత రాజారావు , మద్ది పిచ్చయ్య , కర్లపూడి నర్మద, కపిలవాయి జయప్రద, రాజ్పురోహిత్ చెన్ సింగ్ , శ్రీ రంగా నాగ శ్రీనివాసరావు, దారా జీవన్ రామ్ , బోర్డు ఆఫ్ మేనేజ్మెంట్ సభ్యులు, బ్యాంకు ఉన్నతాధికారులు ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

## భద్రాచలం ఆధ్యాత్మికతకు తగ్గట్టుగా పోలీసింగ్

**ప్రజలకు అందుబాటులో.. నేరాలపై ఉక్కుపాదం**

**స్నేహపూర్వకతతో సేవలు.. శాంతిభద్రతలే లక్ష్యం**

**భద్రాచలం పట్టణ సీఐగా సట్ల రాజు**

**భద్రాచలం క్రైమ్, అక్టోబర్ 5(ప్రభాతవార్త):**

భద్రాచలం పట్టణ పోలీస్ స్టేషన్ సీఐగా సట్ల రాజు బాధ్యతలు చేపట్టనున్నారు. గతంలో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పరిధిలోని అశ్వాపురం సీఐగా విధులు నిర్వహించిన ఆయనకు పోలీస్ శాఖలో విశేష అనుభవం ఉంది. అశ్వాపురంలో పనిచేసిన సమయంలో శాంతిభద్రతల పరిరక్షణతోపాటు ప్రజలకు అందుబాటులో ఉంటూ స్నేహపూర్వక అధికారిగా గుర్తింపు పొందారు. ప్రస్తుతం భద్రాచలం వంటి అత్యంత సున్నితమైన, ఆధ్యాత్మిక ప్రాధాన్యం కలిగిన పట్టణంలో సీఐగా బాధ్యతలు చేపట్టనున్న నేపథ్యంలో ఆయనపై ప్రజల్లో ఆసక్తి నెలకొంది. శ్రీ సీతారామచంద్రస్వామి దేవస్థానం, భక్తుల రద్దీ, ప్రధాన కూడళ్లలో ట్రాఫిక్ నియంత్రణ వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాల్సిన అవసరం ఉంది. భక్తులు, స్థానిక ప్రజలు, వ్యాపారులు, ఆటోడ్రైవర్లు తదితర వర్గాలతో సమన్వయంతో ముందుకు సాగితే పోలీసింగ్ మరింత ప్రజలకు చేరువయ్యే అవకాశం ఉంది. నేరాల నియంత్రణతోపాటు మహిళలు, వృద్ధులు, భక్తుల భద్రతకు ప్రాధాన్యం ఇవ్వాల్సి ఉంది. ఆధ్యాత్మిక పట్టణ ప్రశాంతతకు భంగం కలగకుండా ముందస్తు చర్యలు చేపట్టడం కీలకం కానుంది. గతంలో పనిచేసిన ప్రాంతాల్లో సమర్థవంతమైన అధికారిగా, ప్రజలకు అందుబాటులో ఉండే అధికారిగా పేరు తెచ్చుకున్న సట్ల రాజుపై భద్రాచలం ప్రజలు సైతం అదే తరహా సేవలను ఆశిస్తున్నారు. నూతన సీఐగా బాధ్యతలు స్వీకరిస్తున్న సట్ల రాజుకు పలువురు పోలీసు అధికారులు, ప్రజలు అభినందనలు తెలిపారు.





## శ్రీదేవి శరన్నవరాత్రి మహోత్సవాల ముహూర్తం రాట ఏర్పాటు

**దుమ్ముగూడెం ప్రభాతవార్త (అక్టోబర్ 5)**



దుమ్ముగూడెం గ్రామంలో పవిత్ర గోదావరి నది తీరాన పరమ శివ నందీశ్వర శ్రీ ముత్యాలమ్మ అమ్మవారి ఆలయాల నడుమ ఉన్న శ్రీ శ్రీ ఆత్మారామ చంద్ర స్వామి వారి ఆలయ ప్రాంగణంలో ఈ నెల 11 వ తేదీ ఆది వారం నుండి శ్రీ దేవి శరన్నవరాత్రి ఉత్సవాలు ప్రారంభం కానున్నాయి దసరా మహోత్సవాలు సందర్భంగా సోమవారం ఉదయం 9.29 నిమిషాలకు శ్రీ దేవి శరన్నవరాత్రి మహోత్సవం ప్రారంభ సూచికగా ముహూర్తం రాట అంగ రంగ వైభవంగా వేద పండితులు కొంపల్లి సత్యనారాయణ మూర్తి మంత్రాల నడుమ మహిళలు ముత్తైదువులు పిల్లలు పెద్దలు సమక్షం లో ముహూర్తం రాటను వేశారు ఈ ముహూర్తం రాట ఏర్పాటు కొరకు ఆదివారం మేళా తాళాలతో ఇంటి ఇంటికి మహిళలు గ్రామస్తులు వెళ్లి బొట్టు కార్యక్రమం నిర్వహించి అమ్మవారి తాంబూలం స్వీకరించుటకు మహిళలు ముత్తైదువులను ఆహ్వానించారు దసరా మహోత్సవాల సందర్భంగా ముహూర్తం రాటను వేసే కార్యక్రమానికి అధిక సంఖ్యలో భక్తులు విచ్చేసి అమ్మవారి దైవ కార్యక్రమం లో పాల్గొని అమ్మ వారి తీర్థ ప్రసాదాలు స్వీకరించి అమ్మవారి కృపకు పాత్రులైనారు

## అర్హులైన నిరుపేదలకే ఇళ్లను మంజూరు చేయాలి

**- పెండింగ్ దరఖాస్తులను వెంటనే పూర్తిచేయాలి**

**- జిల్లా కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా**

**ప్రభాతవార్త ప్రతినిధి, జనగామ :**



అర్హులైన నిరుపేదలకు ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేయాలని జిల్లా కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా అధికారులను ఆదేశించారు.సోమవారం జిల్లా సమీకృత కలెక్టర్ కార్యాలయంలోని మినీకాన్ఫరెన్స్ హాల్లో ఇందిరమ్మ ఇళ్లపథకంకింద మంజూరైన ఇళ్లనిర్మాణాల పురోగతి, రెండు పడకగదుల ఇళ్ల కేటాయింపుకు సంబంధించిన ధ్రువపత్రాల పరిశీలన ప్రక్రియ, పెండింగ్ దరఖాస్తులపై అదనపు కలెక్టర్ బెన్షాలోమ్‌తో కలిసి జిల్లా కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ అర్హతకలిగిన ప్రతిలబ్ధిదారుడికి న్యాయంజరిగేలా, అనర్హులకు ఇళ్లుమంజూరు కాకుండా నిబంధనల ప్రకారం క్షుణ్ణంగా పరిశీలన చేయాలన్నారు.పాలకుర్తి, జనగామ నియోజకవర్గాల్లో పెండింగ్‌లో ఉన్న ఇళ్లదరఖాస్తుల పరిశీలన ప్రక్రియను వేగవంతంచేసి, త్వరితగతిన పూర్తిచేయాలని సూచించారు.దరఖాస్తుల పరిశీలనలో రేషన్‌కార్డు, ఆదాయధృవీకరణ పత్రం కీలకంగా పరిగణించాలని సూచించారు. కుటుంబంలోని పెద్దలు, వయోజనుల వివరాలను రేషన్‌కార్డు ఆధారంగా పరిశీలించడంతోపాటు, కుటుంబంలోని కుమారులు వేర్వేరుగా రేషన్ కార్డులు తీసుకొని, ప్రత్యేకంగా నివసిస్తున్న సందర్భాల్లో వారి అర్హతలను కూడా నిబంధనల ప్రకారం సరిచూడాలన్నారు.గ్రామీణ ప్రాంతాల్లో రూ.1.50లక్షలు, పట్టణ ప్రాంతాల్లో రూ.2లక్షల వరకు వార్షిక ఆదాయం ఉన్నవారిని ఆదాయ పరిమితి నిబంధనల ప్రకారం పరిగణనలోకి తీసుకోవాలని సూచించారు. ఆదాయ ధృవీకరణ పత్రాలు ప్రతి సంవత్సరం మారే అవకాశం ఉన్నందున వాటిని తప్పనిసరిగా ధృవీకరించి తగిన చర్యలు తీసుకోవాలన్నారు.లబ్ధిదారులకు భూమి, ఇల్లు, ఇతర ఆస్తులు ఉన్నాయా అనే విషయాన్ని సంబంధిత ప్రభుత్వ వెబ్‌సైట్ల ద్వారా పరిశీలించాలని ఆదేశించారు. కుటుంబ సభ్యులకు ఇతర ప్రాంతాల్లో ఇళ్లు, భూములు, ఆస్తులు ఉన్నట్లయితే స్థానికంగా విచారణ జరిపి, వాస్తవాలను నిర్ధారించుకోవాలని సూచించారు. అన్ని వివరాలను క్షుణ్ణంగా పరిశీలించిన అనంతరం మాత్రమే దరఖాస్తులను ఆమోదించడం, తిరస్కరించడం చేయాలని స్పష్టంచేశారు.ఈ-ఆఫీస్ విధానాన్ని తప్పనిసరిగా వినియోగిస్తూ, కార్యాలయ ఫైళ్ల ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించాలని స్పష్టంచేశారు. సమావేశంలో గృహ నిర్మాణశాఖ పీడీ బలరామరావు, మునిసిపల్ కమిషనర్ రాజశేఖర్‌రెడ్డి, ఎంపిడిఓలు మహేష్‌నాయక్, లావణ్య, ఇతర సంబంధిత అధికారులు, డీఈఈలు, అన్ని మండలాల ఏఈలు, తదితరులు పాల్గొన్నారు.

## మంథని నియోజకవర్గానికి రూ.12.58 కోట్ల నిధులు...

**115 భవనాల నిర్మాణానికి మంజూరు..**

**ఐదు మండలాల్లో అభివృద్ధి పనులకు శ్రీకారం...**

**కాటారం, అక్టోబర్ 5, ప్రభాతవార్త:**

జయశంకర్ భూపాలపల్లి జిల్లా పరిధిలోని మంథని నియోజకవర్గంలోని 5 మండలాల్లో అభివృద్ధి పనులకు రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు భారీగా నిధులు మంజూరు చేయించారు. వీబీ జీ రామ్ జీ 202627 కింద మొత్తం రూ.12.58 కోట్లతో 115 భవనాల నిర్మాణానికి నిధులు మంజూరైనట్లు మంత్రి క్యాంప్ కార్యాలయం ఒక ప్రకటనలో తెలిపింది.

**కొత్తగా రూ.5.08 కోట్లు..**

మహాముత్తారం, మల్హర్ రావు మండలాల్లో 6 గ్రామ పంచాయతీ భవనాలకు రూ.1.20 కోట్లు (ఒక్కోటి రూ.20 లక్షలు), కాటారం, మహాముత్తారం, మహదేవ పూర్, మల్హర్ రావు మండలాల్లో 24 అంగన్వాడీ భవనాలకు రూ.2.88 కోట్లు (ఒక్కోటి రూ.12 లక్షలు), మహాముత్తారం, మహదేవ పూర్, పలిమెల మండలాల్లో 10 మహిళా సంఘ (వీఓ) భవనాలకు రూ.కోటి (ఒక్కోటి రూ.10 లక్షలు) మంజూరయ్యాయి. రెడ్డిపల్లి, ప్రేమ్ నగర్, రేగులగూడెం, ఇప్పలపల్లి, ఎడ్లపల్లి, నాచారం గ్రామాల్లో పంచాయతీ భవనాలు, కాటారం మండలంలోని మద్దులపల్లి, కాటారం, ఎర్రగుంటపల్లి తదితర 14 గ్రామాల్లో అంగన్వాడీ భవనాలు నిర్మించనున్నారు.

**ఇదివరకే రూ.7.50 కోట్లు..**

ఇదివరకే మంజూరైన 75 వీఓ భవనాలకు రూ.7.50 కోట్లు మంజూరయ్యాయి. కాటారంలో 24, మహాముత్తారంలో 19, మల్హర్ రావులో 15, మహదేవపూర్ లో 11, పలిమెలలో 6 భవనాల నిర్మాణ ప్రక్రియలో ఉన్నాయి. నిధులు మంజూరు చేసిన మంత్రి శ్రీధర్ బాబుకు 5 మండలాల కాంగ్రెస్ నాయకులు, సర్పంచులు, గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు.

## ప్రజావాణి అర్జీల పరిష్కారంలో జాప్యం వద్దు..

**నిరక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవు**

**జయశంకర్ భూపాలపల్లి జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ**

**జిల్లా ప్రజావాణిలో 85 దరఖాస్తుల స్వీకరణ**

**ప్రభాతవార్త ప్రతినిధి, జయశంకర్ భూపాలపల్లి బ్యూరో**

ప్రజావాణిలో ప్రజల నుంచి స్వీకరించిన అర్జీలను ఎటువంటి జాప్యం లేకుండా వెంటనే పరిష్కరించాలని జయశంకర్ భూపాలపల్లి జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ అధికారులను ఆదేశించారు. సోమవారం ఐడీఓసీ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ఆయన స్వయంగా ప్రజల నుంచి దరఖాస్తులను స్వీకరించారు. ఈ సందర్భంగా వివిధ సమస్యలపై మొత్తం 85 దరఖాస్తులు అందినట్లు కలెక్టర్ తెలిపారు. వచ్చిన ప్రతి అర్జీని అత్యంత ప్రాధాన్యతగా పరిగణించి, సంబంధిత శాఖల అధికారులకు ఎండార్స్ చేసినట్లు ఆయన పేర్కొన్నారు. ప్రజల సమస్యల పరిష్కారంలో అధికారులు ఎట్టి పరిస్థితుల్లోనూ నిరక్ష్యం వహించరాదని, అలా చేస్తే శాఖాపరమైన కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. అర్జీల పరిష్కారానికి తీసుకున్న చర్యల వివరాలను ఎప్పటికప్పుడు ప్రజావాణి పోర్టల్‌లో తప్పనిసరిగా నమోదు చేయాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ పడాల అశోక్‌కుమార్, డీఆర్వో వసంత, ఆర్డీఓ హరికృష్ణ, శిక్షణా డిప్యూటీ కలెక్టర్ నవీన్ రెడ్డితో పాటు వివిధ శాఖల జిల్లా స్థాయి అధికారులు పాల్గొన్నారు.

## జర్నలిస్టులకు ఇంటి స్థలాలు కేటాయించాలి

**కలెక్టర్ కలసిన వెంకటాపూర్ జర్నలిస్టులు**

**సానుకూలంగా స్పందించిన కలెక్టర్**

**వెంకటాపూర్ (రామప్ప) ప్రభాతవార్త :**

ప్రభుత్వానికి ప్రజలకు మధ్య వారధిగా ఉండే జర్నలిస్టులకు ఇంటి స్థలాలు కేటాయించాలని వెంకటాపూర్ జర్నలిస్టులు ములుగు కలెక్టర్ హేమంత్ బొర్కడే వాసుదేవరావును కోరారు. ఈ మేరకు వెంకటాపూర్ జర్నలిస్టులు సోమవారం ములుగు కలెక్టర్ కార్యాలయానికి చేరుకొని కలెక్టర్ ను ప్రత్యేకంగా కలిశారు. గత కొన్నేళ్లుగా తాము మీడియా వృత్తిలో కొనసాగుతూ ప్రజా సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకువస్తున్నామని పేర్కొన్నారు. అలాంటి తాము 4 సంవత్సరాలుగా వెంకటాపూర్ మండలం పాలంపేట గ్రామ శివారులోని రెవిన్యూ భూమిలో గుడిసెలు వేసుకొని మోకా మీద ఉన్నామని ఆయనకి తెలిపారు. దీనికి కలెక్టర్ సానుకూలంగా స్పందించారు. జర్నలిస్టుల ఇంటి స్థలాల అంశంపై పూర్తి నివేదిక అందించాలని కలెక్టర్ అడిషనల్ కలెక్టర్ రెవిన్యూ మహేందర్ జీ కి సిఫారస్ చేసినట్లు జర్నలిస్టులు తెలిపారు.

# గురుకులంలో ఎలకల కలకలం..

## .!!10 మంది విద్యార్థినులకు ఎలుకల కాటు ఆసుపత్రిలో వైద్య పరీక్షలు.

**నేలకొండపల్లి, అక్టోబర్ 5 ప్రభాతవార్త:**

నేలకొండపల్లి లోని ప్రభుత్వ సాంఘిక సంక్షేమ గురుకుల గురుకుల బాలికల పాఠశాలలో విద్యార్థినులకు భద్రత కరువైంది. దాదాపు10 మంది విద్యార్థినులను ఎలుకలు కరిచిన ఘటన కలకలం రేపింది. ఉపాధ్యాయులు స్పందించి వెంటనే ప్రభుత్వ హస్పిటల్ లో వైద్య పరీక్షలు నిర్వహించారు. విషయం తెలుసుకున్న పీ.డీ.ఎస్.యు సంఘం విద్యార్థి సంఘం నాయకులు సోమవారం నేలకొండపల్లి ప్రభుత్వ సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల పాఠశాలలో ధర్నా నిర్వహించారు. నేలకొండపల్లి మండలం లోని సింగారెడ్డిపాలెం సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల పాఠశాల లో ఎలకల కలకలం రేపాయి. పదో తరగతి చదువుతున్న 10 మంది విద్యార్థినులను శనివారం రాత్రి నిద్రిస్తున్న విద్యార్థినులను ఎలకలు కరిచినట్లు విద్యార్థులు పేర్కొంటున్నారు. పదో తరగతి చదువుతున్న లి ఖిత, లాస్య, శర్మిళ, రజిని, గీతిక, సానియా,



సాయిపూర్విత, పుణ్యవతి, జ్యోషిక, వెన్నల అనే విద్యార్థినులను కరిచాయి. వీరికి ఆదివారం నేలకొండపల్లి ప్రభుత్వ హస్పిటల్ వైద్య పరీక్షలు నిర్వహించారు. అవసరమైన వైద్యంను అందించారు. గురుకుల సంస్థ డిప్యూటీ సెక్రటరీ అరుణకుమారి, జోనల్ ఆఫీసర్ అపూర్వ లు పాఠశాల ను సందర్శించారు. ఘటన పై గురుకుల బాలికల పాఠశాల ప్రిన్సిపాల్ విజయకుమారి ని వివరాలు అడిగి తెలుసుకున్నారు. గురుకులంలో పారిశుద్ధం లోపం కారణంగా ఎలుకలు సంచరిస్తున్నట్లు తెలుస్తుంది. ప్రభుత్వ హస్పిటల్ వైద్యాధికారి డాక్టర్ అర్జున్ గౌతమ్ గురుకుల పాఠశాల నందు ప్రత్యేక వైద్య శిభిరం ను నిర్వహించారు. అయితే ఎలకలు కరిచిన విషయం ను విద్యార్థుల తల్లిదండ్రులకు సమాచారం ఇవ్వకపోవటంతో



విద్యార్థి సంఘం నాయకులు అగ్రహాం వ్యక్తం చేశారు. విషయం తెలుసుకున్న పీ.డీ.ఎస్.యు సంఘం నాయకులు గురుకుల పాఠశాలలో ధర్నా నిర్వహించారు. విద్యార్థినులను పరామర్శించి ఆరోగ్యం గురించి అడిగి తెలుసుకున్నారు. ప్రిన్సిపాల్ తో వాదన కు దిగారు. విద్యార్థినులకు మెరుగైన వైద్యం అందించాలని, గురుకుల ఉన్నతాధికారులు తక్షణమే విచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు. గురుకుల జిల్లా అధికారులు పర్యవేక్షణ లేకపోవటం వలనే ఇలాంటి ఘటనలు జరుగుతున్నాయని ఆరోపించారు. తల్లిదండ్రులకు సమాచారం ఇవ్వకపోవటం పై మండిపడ్డారు. ఈ కార్యక్రమంలో పీ.డీ.ఎస్.యు సంఘం జిల్లా అధ్యక్షుడు లక్ష్మణ్, యాక్టింగ్ కార్యదర్శి తిమ్మిడి రఘు, మురళీకృష్ణ, సుశాంత్, త్రినాధ్. భాను, ప్రవీణ తదితరులు పాల్గొన్నారు.

## సింగరేణి కార్మికులకు 40శాతం లాభాల వాటా ఇవ్వాలి



**మణుగూరు, ప్రభాతవార్త, అక్టోబర్05:**

సింగరేణి కార్మికులకు 202526 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి 40 శాతం లాభాల వాటాను వెంటనే ప్రకటించి చెల్లించాలని సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ ) డిమాండ్ చేసింది. మణుగూరులోని గనులు, డిపార్ట్‌మెంట్లలో అధికారులకు సోమవారం మెమోరాండం అందజేశారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ బ్రాంచ్ నాయకులు మాట్లాడుతూ.. లాభాల ప్రకటనలో జాప్యంతో కార్మికులు ఆందోళన చెందుతున్నారని పేర్కొన్నారు. గుర్తింపు సంఘంతో చర్చించి, ముఖ్యమంత్రి సమక్షంలో లాభాల వాటాను ప్రకటించే సంప్రదాయాన్ని కొనసాగించాలన్నారు. ఉత్పత్తి, రక్షణకు అవసరమైన మెటీరియల్ కొరతను తీర్చాలని, లేనిపక్షంలో దసరా అడ్వాన్స్, దీపావళి బోనస్‌లపై ప్రభావం పడుతుందన్నారు. అలాగే, టీజీజెన్‌కో నుండి రావలసిన రూ. 59,000 కోట్ల బకాయిలను ప్రభుత్వం ద్వారా వెంటనే ఇప్పించేలా యాజమాన్యం చొరవ చూపాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏరియా బ్రాంచి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## శిథిలావస్థకు చేరిన పశువైద్యశాల

**కామేపల్లి, అక్టోబర్ 5 ప్రభాతవార్త :**



కామేపల్లిలోని ప్రభుత్వ పశు వైద్యశాల శిధిలావస్థకు చేరింది. ఆసుపత్రి పైకప్పు పెచ్చులు ఊడి పడుతుం డటంతో రైతులు, పశు వైద్య సిబ్బంది భయాందోళన చెందుతున్నారు. వైద్యశాల ప్రమాదభరితంగా ఉండటంతో అరచేతిలో ప్రాణాలు పెట్టుకొని బిక్కు బిక్కు మంటూ వైద్య సిబ్బంది విధులు నిర్వహిన్నారు. వైద్యశాల భవనం నిర్మించి నాలుగు దశాబ్దాలు



గడుస్తుండటంతో ఈ దుస్థితి నెలకొంది. ప్రమాదకరంగా తయారైందని



రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వర్షం కురిసిన ప్రతిసారి ఆసుపత్రిలో వర్షపు నీరు కారుతూ ఆసుపత్రిలో ఉన్న విలువైన మందులు, ఇంజక్షన్లు తడుస్తున్నాయన్నారు. ఈ విషయం పై ప్రభుత్వము, సంబంధిత శాఖ



ఉన్నతాధికారులు స్పందించి తక్షణమే నూతన భవనం మంజూరు చేసి నిర్మించి దీర్ఘకాలంగా పడుతున్న ఇబ్బందులను తొలగించాలని సిపిఎం



మండల నాయకులు బాదావత్ శ్రీను, నాయకులు రామ్ సింగ్, రాయల వెంకన్న, రైతులు, గ్రామస్తులు కోరారు. సోమవారం ఖమ్మం కలెక్టరేట్ లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ కు ఈ మేరకు లి ఖితపూర్వకంగా విన్నవించారు. దీంతో జాయింట్ కలెక్టర్ స్పందించి నూతన పశువైద్యశాల భవనం నిర్మించి రైతుల ఇబ్బందులను తొలగించేందుకు తగు చర్యలు తీసుకోవడం జరుగుతుందని స్పష్టం చేసినట్లు తెలిపారు.

## ముందుస్తు చర్యలే ప్రమాదాల నివారణకు మార్గం



**మనుగూరు, ప్రభాతవార్త, అక్టోబర్ 05:**

మనుగూరు ఏరియా ఎంవీటీసీ లో ఫ్రంట్‌లైన్ సూపర్‌వైజర్ల కోసం నిర్వహస్తున్న శిక్షణా కార్యక్రమంలో భాగంగా రెండో బ్యాచ్ శిక్షణ సోమవారం ప్రారంభమైంది. ఈ శిక్షణ అక్టోబర్ 5 నుండి 17 వరకు రెండు వారాల పాటు కొనసాగుతుందని నిర్వాహకులు తెలిపారు.

ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఏరియా జీఎం డి. వెంకట రామారావు శిక్షణా కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గని కార్యకలాపాల్లో ఫ్రంట్‌లైన్ సూపర్‌వైజర్లది అత్యంత కీలకమైన బాధ్యత అని పేర్కొన్నారు. పని ప్రాంతాల్లో భద్రతా పరిస్థితులను ఎప్పటికప్పుడు అంచనా వేస్తూ, కార్మికులు సురక్షిత పద్ధతుల్లో విధులు నిర్వహించేలా పర్యవేక్షించాల్సిన బాధ్యత సూపర్‌వైజర్లపై ఉందన్నారు. ప్రమాదాలు జరగకుండా ముందస్తు భద్రతా చర్యలు చేపట్టడమే ఉత్తమ పద్ధతి అని ఆయన సూచించారు.

ఈ కార్యక్రమంలో ఎస్ఈఏఓయు ప్రెస్ ప్రెసిడెంట్ వి. కృష్ణారావు, సిఐటియు ప్రతినిధి అండ్ పిఆర్ మైన్స్ మేనేజర్ కె. రమేష్, ఏరియా సేఫ్టీ ఆఫీసర్ జె. నాగేశ్వరరావు, ఇన్‌ఛార్జ్ ఎంవిటిసి బి. బాబు, ఏరియా సేఫ్టీ ఆఫీసర్ తో పాటు ఇతర అధికారులు, సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

## ఇందిరమ్మ ఇళ్ల ఎల్1 జాబితాపై విచారణ జరపాలి

## అర్హులైన నిరుపేదలకు న్యాయం చేయాలి.

## ఆనందపురం సర్పంచ్ ముర్రం సమ్మయ్య




**అశ్వాపురం, ప్రభాతవార్త అక్టోబర్ 05:**

అశ్వాపురం మండలం ఆనందపురం గ్రామపంచాయతీలో ఇందిరమ్మ ఇళ్ల పథకానికి సంబంధించి ఎల్1 జాబితాలో చోటుచేసుకున్న పేర్లపై సమగ్ర విచారణ నిర్వహించాలని గ్రామ సర్పంచ్ ముర్రం సమ్మయ్య అధికారులను కోరారు. ఈ మేరకు సోమవారం మండల కేంద్రంలోని రైతు వేదికలో నిర్వహించిన ప్రజావాణిలో అధికారులకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ ఇందిరమ్మ ఇళ్ల సర్వే నిర్వహించిన సమయంలో కొంతమంది వ్యక్తులు గ్రామంలో నివాసం లేకపోవడంతో వారి ఇళ్లకు సర్వే జరగలేదని తెలిపారు. అయితే వెరిఫికేషన్ అధికారి ద్వారా తెలిపిన సమాచారం మేరకు, ఆ సమయంలో గ్రామంలో నివాసం లేని కొంతమంది వ్యక్తుల పేర్లు ఎల్ 1 జాబితాలో ఉన్నట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. ఆనందపురం గ్రామంలో అనేక మంది నిరుపేద కుటుంబాలు, అర్హులైన నిజమైన లబ్ధిదారులు ఇందిరమ్మ ఇళ్ల కోసం ఎదురుచూస్తున్నారని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో గ్రామంలో నివాసం లేని వారి పేర్లు ఎల్ 1 జాబితాలో ఎలా నమోదయ్యాయో పరిశీలించి, సంబంధిత సర్వే వివరాలను కూడా వెల్లడించాలని కోరారు. గ్రామంలో మరోసారి సమగ్ర సర్వే నిర్వహించి, అర్హత కలిగిన నిరుపేద కుటుంబాలను గుర్తించి వారికి న్యాయం చేయాలని అధికారులకు వినతిపత్రం సమర్పించినట్టు వారు తెలిపారు.